హాసుబుల్ (?) — ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్
: fb.com/vaartha Digital
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Mahabubnagar, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-9-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 237 పేజీలు: 10+4 వెల: 6.50

హార్ముజ్ వద్ద యుద్ధంలో అమెరికా లేజర్ ఆయుధాలు 5
మిక్స్‌డ్ షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణం 7

# గంగమ్మ ఒడికి గణేశుడు

## హైటెక్ భద్రత మధ్య ప్రశాంతంగా నిమజ్జనం



శుక్రవారం హైదరాబాద్ సచివాలయం వద్ద గణేశుని శోభాయాత్ర దృశ్యం

- మధ్యాహ్నానికే 'సాగర్' జలాల్లోకి ఖైరతాబాద్ మహాగణపతి
- భారీ పోలీసు పహారా, సిసి కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షణ
- మంత్రి పొన్నం, డిజిపి ఆనంద్, కొత్వాల్ సజ్జనార్ ఏరియల్ సర్వే
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 'సాగర్' దాకా వైభవంగా సాగిన శోభాయాత్ర

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** జంట నగరాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం జరిగిన సామూహిక వినాయక నిమజ్జనం హైటెక్ భద్రత, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం మధ్య సాఫీగా సాగింది. హైదరాబాద్ చరిత్రలో అంతర్భాగంగా మారిన గణేష్ నిమజ్జనం వేడుకలకు పోలీసు శాఖ ఏర్పాటు చేసిన భారీ భద్రత, లక్షలాది >>2



శుక్రవారం మధ్యాహ్నం 'సాగర్' జలాల్లోకి ప్రవేశించిన ఖైరతాబాద్ గణనాథుడు

# జ్ఞానేశ్! వెళ్లిపో

## దేశవ్యాప్తంగా నినదించిన కాంగ్రెస్

### పలు రాష్ట్రాల్లో 'సర్'పై ఆందోళనలు, ఉద్రిక్తత

### అసోంలో గౌరవ్ గగోయ్‌ని అదుపులోకి తీసుకొన్న పోలీసులు

### సిఇసిని అరెస్టు చేయాలని విపక్ష నేతల డిమాండ్



శుక్రవారం గువాహతిలో గౌరవ్ గొగోయ్‌ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ పార్టీ కార్యకర్తలు పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం కార్యాలయాల వైపు ర్యాలీలు చేపట్టారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జరిగిన ఈ నిరసనలు అసోం, జమ్మూ కశ్మీర్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, చండీగఢ్, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, గోవా తదితర ప్రాంతాల్లో జరిగాయి. అసోంలో జరిగిన నిరసనలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్‌ను >>2

సుప్రీం కోర్టుకు 'సర్' వివాదం
5 సిఇసి వెంటనే రాజీనామా చేయాలి: సిజెపి డిమాండ్



శుక్రవారం కేరళంలో కెసి వేణుగోపాల్ నుంచి ఆర్యదాన్ అవార్డు అందుకుంటున్న సిఎం రేవంత్ రెడ్డి

# సంఘ్ పరివార్ ప్రమాదకరం

## ఆ సంస్థ సారధ్యంలోని బిజెపి భారత్‌ను విభజిస్తోంది..

### మతతత్వ శక్తులతో దేశానికి ముప్పు

### కేరళంలో ప్రతిష్టాత్మక అవార్డు స్వీకరించిన సందర్భంగా సిఎం రేవంత్

### ఆర్యదాన్ అవార్డు ఎంతో గౌరవాన్నిచ్చింది: సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 25:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేరళంలో ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు లభించింది. కేరళంలోని నిలంబూరులో శుక్రవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆ పురస్కారాన్ని రేవంత్ స్వీకరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్... సిఎం రేవంత్‌రెడ్డికి అవార్డును ప్రదానం చేశారు. కేరళం దిగ్గజ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. ఈ అవార్డు కింద రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర సామాజిక వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, సిఎం రేవంత్ రెడ్డి దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని గుర్తిస్తూ సిఎం రేవంత్ రెడ్డిని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పట్ల రేవంత్‌రెడ్డి చూపుతున్న నిబద్ధతను కూడా అవార్డు ఎంపిక కమిటీ ప్రశంసించినట్లు వెల్లడించారు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, కేరళంలోని నాలుగు వేర్వేరు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన ఆర్యదాన్ ముహమ్మద్ ప్రజాసేవ, లౌకిక విలువలు, సామాన్యుల సంక్షేమం పట్ల నిబద్ధతతో పనిచేసిన నాయకుడిగా కేరళలో గుర్తింపు పొందారు. ఆయన నాలుగో వర్ధంతి సందర్భంగా ఈ అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా, ఈ కార్యక్రమంలో కెసి వేణుగోపాల్ ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకోప న్యాసం చేశారు.

ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ఆర్యదాన్ ముహమ్మద్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌కు సేవలందించిన ఆయన కేరళం రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని గుర్తు చేశారు. నీలాంబూర్‌తో పాటు కేరళంలో కాంగ్రెస్ పార్టీకి ఆయన ఒక బలమైన శక్తిగా నిలిచారని అన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ పేరుతో ఏర్పాటు చేసిన అవార్డును అందుకోవడం తనకు ఎంతో గౌరవంగా ఉందని అన్నారు. కేరళం వెలుపల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి >>2

## ఫిబ్రవరి, మార్చిలో

# ఖైరతాబాద్ ఉప ఎన్నిక?

### మళ్లీ బరిలోకి దానం!

**హైదరాబాద్,సెప్టెంబరు25,ప్రభాతవార్త:** దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో 6 నెలల్లోగా ఖైరతాబాద్ ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. ఇందుకు లైన్ క్లియర్ చేస్తూ బై ఎలక్షన్ జరపాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ త్వరలో కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ పంపనున్నట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్రంలో సర్ ప్రక్రియ నవంబర్ 9న పూర్తి కానుండగా, ఆ తర్వాత నోటిఫికేషన్ ఇస్తారని సమాచారం. కాగా, వచ్చే యేడాది ఫిబ్రవరి, మార్చిలో ఉత్తరప్రదేశ్ ఎన్నికలు జరుగనున్నాయి. అదే సమయంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఖైరతాబాద్ సీటు ఖాళీ కానుండటంతో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు దృష్టి పెట్టాయి. దానం మీడియాతో >>2

# రాహుల్ తీరు అనుచితం

### ప్రధాని, కేంద్ర హోంమంత్రిపై ఏమిటా వ్యాఖ్యలు?

### కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్య పరిరక్షణ, లేకుంటే విఘాతమా?

### మండిపడిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికైన ప్రధానమంత్రి, హోంమంత్రిని లోక్‌సభలో ప్రతిపక్ష నేత దేశద్రోహి అంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కోట్లాది మంది నమ్మకంతో ఓటేసి గెలిపించిన వారిపై రాహుల్ గాంధీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం.. ఆయన మానసిక స్థితిని, ఆయన అసహనాన్ని తెలియజేస్తుందన్నారు. వరుసగా ఎన్నికల్లో ఓడిపోతుండటంతో మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారనిపిస్తుందని, ఒకపార్టీ జెండాతోగెలిచి వేరే పార్టీలోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై సుప్రీం కోర్టు అనర్హత వేటు వేయడాన్ని స్వాగతించి, క్షమాపణలు చెప్పాల్సింది పోయి.. అదేరోజు ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వేరే పార్టీల టికెట్లపై ఎన్నికైన 10 మంది ఎమ్మెల్యేలను రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు.

దానం నాగేందర్ ఒక పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతుండగానే, రాహుల్ గాంధీ ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించారు. ఆ నియోజకవర్గాల ప్రజలు ఓ పార్టీని నమ్మి ఓటేశారు. కానీ కాంగ్రెస్ ఆప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ.. ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి చేర్చుకుంది. ఇదే అసలైన ఓట్ చోరీఅంటే. ఫిరాయింపుల ద్వారా ప్రజల తీర్పును దొంగిలించిన పార్టీకి.. ఇతరులు ఓట్లు దొంగిలించారని ఆరోపించే నైతిక హక్కు లేదు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోలేకపోవడంతో ఎన్నికల్లో ఓడిపోతూ.. నిరాశ నిస్పృహలకు గురవుతున్న కాంగ్రెస్ నాయకులు, రాహుల్ గాంధీ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ప్రజలు వీరిని ఛీత్కరించినప్పుడల్లా ఏం చేయాలో పాలుపోక రాజ్యాంగబద్ధ సంస్థలపై వారి అసహనాన్ని వెళ్లగక్కు తున్నారంటూ మండి >>2

దశాబ్దంలో తొలిసారి తగ్గిన వరి ఉత్పత్తి 6లో

# వరద పోతుంటే బురద రాజకీయాలా?

### వెంటనే మోటార్లు నడిపి జలాశయాలను నింపాలి

### ఎండిన రిజర్వాయర్లకు కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణం

### మంత్రి ఉత్తమ్‌కు మాజీ మంత్రి హరీష్ లేఖ



**హైదరాబాద్,సెప్టెంబరు25,ప్రభాతవార్త:** ప్రస్తుతం గోదావరి నదిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్నందున మోటార్లు నడిపి రిజర్వాయర్లను నింపాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం మంత్రికి బహిరంగ లేఖను రాశారు. ఇప్పటికైనా కళ్లు తెరచి, చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభంలేదని పేర్కొన్నారు. ఎల్‌నినోను సాకుగా చూపకుండా, అందివచ్చిన గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా ఆన్‌ఆఫ్ పద్ధతిలో కాకుండా 24 గంటల పాటు అన్ని మోటార్లు నడిపి జలాశయాలను నింపాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థను నిర్మించి, 141 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను ఏర్పాటు చేశారని వెల్లడించారు. గోదావరిలో వరద వచ్చినప్పుడు ఆ నీటిని ఒడిసి పట్టి రిజర్వాయర్లనునింపితే రైతులకుఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు గోదావరిలో భారీ వరద ప్రవాహం ఉన్నా, ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. నీళ్లందక పంటలు ఎండిపోతుంటే, మీరుమాత్రం ప్రాజెక్టుల మీద రాజకీయాలు చేస్తూ పంటలు ఎండగొడుతున్నారని విమర్శిం >>2

# రెండు రోజులు వర్ష సూచన

### ఖమ్మంలో అత్యధికంగా 105.2 మి.మీ. వర్షపాతం

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** తీవ్ర అల్పపీడనం తీరాన్ని దాటినప్పటికీ, వర్ష హెచ్చరిక ఇంకా కొనసాగుతోంది. రాబోయే కొద్ది గంటల్లో ఈ తీవ్ర అల్పపీడనం బలహీనపడే అవకాశం ఉందని, ఆ తర్వాత 24 గంటల్లో మరింత బలహీనపడుతుందని వాతావరణ అధికారులు అంచనా వేశారు. అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. దీనిప్రభావంకారణంగా తెలంగాణలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్‌తో పాటు అన్ని ఇతర జిల్లాల్లో కూడా వర్షం పడుతుందని అంచనా. తెలంగాణలోని ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 17 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. నల్గొండ, యాదాద్రి, జగిత్యాల, కామా >>2

# 'భూ భారతి'కి బ్రేక్‌లు!

### పదిరోజులుగా నిలిచిన సేవలు

### స్లాట్ బుకింగ్‌కు తప్పని తిప్పలు

### రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నా చర్యలు చేపట్టని అధికారులు




**హైదరాబాద్ (మలక్‌పేట జోన్ ప్రతినిధి), సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** ధరణి స్థానంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన భూ భారతి పోర్టల్ గత పది రోజులుగా పనిచేయడం లేదు. కనీసం స్లాట్ బుకింగ్‌కూడా కాకపోవడంతో రైతులు, వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు, నూతనంగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటున్న వారు భూ భారతి పోర్టల్ మొరాయింపుతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలవడంతో తలెత్తిన సమస్యలకు భూ భారతి పోర్టల్ సేవల సమస్యలు తోడయ్యాయి. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ ధరణిని కాదని మెరుగైన విధానం పేరుతో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన భూ భారతి పోర్టల్‌లో ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాల్సిన సంబంధిత >>2

# పార్టీలు మారిన 111 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు

**హైదరాబాద్,సెప్టెంబరు25,ప్రభాతవార్త:** 2022-26 మధ్యకాలంలో నాలుగేళ్లలో పార్లమెంట్, అసెంబ్లీలకు చెందిన 111మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీలు ఫిరాయించనట్లుగా అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడిఆర్) రిపోర్ట్ వెల్లడించింది. నాగాలాండ్, పశ్చిమ బెంగాల్‌లో అత్యధిక సంఖ్యలో నేతలు పార్టీలు మారినట్లు వెల్లడించింది. 26మంది లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, 78మంది ఎమ్మెల్యేలు పార్టీలు మారిన వారిలో ఉన్నారు. అత్యధికంగా 32 కేసులు నాగాలాండ్‌లో నమోదయ్యాయి.

అధికార నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ >>2



శుక్రవారం హైదరాబాద్‌లో బాలాపూర్ గణనాథుని శోభాయాత్ర దృశ్యం



శుక్రవారం ముంబయిలో సాగిన గణేశ నిమజ్జనం యాత్ర

# గంగమ్మ ఒడికి గణేశుడు

>> సిసి కెమెరాల పర్యవేక్షణ, జియో టాగింగ్, డ్రోన్లతో పర్యవేక్షణ పూర్తి స్థాయిలో ఫలితాలను ఇవ్వడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. జంట నగరాల విషయం ఇలావుంచితే రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నిమజ్జన దృశ్యాలను ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా డిజిపి కంట్రోల్ రూంలోని అధునాతన వ్యవస్థ ద్వారా డిజిపి ఆనంద్ సహా ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షించి స్థానిక అధికారులకు సూచనలు చేశారు. కాగా నిమజ్జన దృశ్యాలను హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, డిజిపి ఆనంద్, కొత్వాల్ సజ్జనార్, బల్దియా కమిషనర్ కర్ణన్, కలెక్టర్ ప్రియాంక అల హెలికాప్టర్ ద్వారా వీక్షించారు.

శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, క్రౌడ్ కంట్రోల్ (మూకుమ్మడిగా ప్రజలు తకలి వచ్చినపుడు పరిస్థితులను అదుపులో వుంచడం) వంటి అంశాలలో టెక్నాలజిని వాడుతూ పరిస్థితులను చక్కదిద్దడంలో తెలంగాణ పోలీసు శాఖ గణేష్ నిమజ్జనోత్సవాలు సాఫీగా నిర్వహించి మరోమారు మెరుగైన ఫలితాలను సాధించింది. జంట నగరాలతో పాటు శివార్లలో ఏర్పాటు చేసిన ఎనిమిది లక్షలకు పైగా సిసి టివిలు, సాంకేతిక పరిజ్ఞానం వల్ల పోలీసుల విధి నిర్వహణ ఎంత సులభమవుతుందో ఈ ఉత్సవాలు తేటతెల్లం చేశాయి. తొమ్మిదేళ్ల క్రితం వినాయక చవితి ఉత్సవాలకు పోలీసు శాఖ తొలిసారిగా టెక్నాలజిని వాడడం వల్ల మంచి ఫలితాలను అందుకుంది. ఆ తరువాత ఇదే పద్దతిని మరింత విస్తరిం చడంతో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడడంలో విజయం సాధించసాగారు. ఈ యేడాది కూడా అదే పంథాను పోలీసులు ఎంచుకుని మరోమారు మెరుగైన ఫలితాలు అందుకున్నారు. టెక్నాలజి వాడడం వల్ల విగ్రహాల ఏర్పాటు మొదలు అవి నిమజ్జనం అయ్యే వరకు ఏం జరుగుతుందనేది బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు డిజిపి కంట్రోల్ రూంలో వున్న సిబ్బంది అనుక్షణం తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ఇదే సమయంలో పోలీసు అధికారుల కోసం ఏర్పాటు చేసిన యాప్ వల్ల తమ సెల్‌ఫోన్లలో కూడా నిమజ్జనానికి వచ్చిన వినాయక విగ్రహాల కదలికలు నిరంతరం పర్యవేక్షించే అవకాశం కలిగింది. ఇతర ప్రాంతాల విషయం అలావుంచితే పాతబస్తీ పోలీసులకు టెక్నాలజి సేవలు చాలా వరకు మేలు చేసింది. వినాయక నిమజ్జనంలో పాతబస్తీ కీలకంగా వుండడం విదితమే. పూర్వపు దక్షిణ మండల పరిధిలోని అన్ని ప్రాంతాల విగ్రహాలు మొదటగా నిమజ్జనం అయ్యేందుకు అధికారులు ప్రాధాన్యం ఇచ్చారు. టెక్నాలజిని వాడడం వల్ల పాతబస్తీ పోలీసులు నిమజ్జనానికి వచ్చిన విగ్రహాలను వెంటవెంటనే ట్యాంక్‌బండ్ వైపుకు తరలించేందుకు అవకాశం కలిగింది. దీని వల్ల వినాయక నిమజ్జనంపై పట్టు సాధించిన పోలీసు అధికారులు ఇదే సమయంలో ఆయా ప్రాంతాల సిబ్బంది సరిగ్గా విధులు నిర్వహించారా...? లేదా...? అనే దాని పైనా దృష్టి సారించగలిగారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు కూడా ఇదే పద్దతిని ఎంచుకుని వాటిని డిజి కంట్రోల్ రూం నుంచి అజమాయిషీ చేశారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 లక్షలకు పైగా సిసి కెమెరాల ద్వారా గణేష్ ఉత్సవాలను ఆయా ప్రాంతాలలోని కమాండ్ కంట్రోల్‌ల నుంచి అక్కడి అధికారులు పర్యవేక్షించారు. బడా గణేష్‌గా పేరుగాంచిన ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం మధ్యాహ్నం 2.30 గంటలకు ముగిసింది. గత ఏడాది 1.40 గంటలకు నిమజ్జనం అవగా ఈ యేడాది 50 నిమిషాలు ఆలస్యమయ్యింది.

**అడుగడుగునా పోలీసుల మొహరింపు..మంత్రి పొన్నం, డిజిపి, కొత్వాల్ తదితరుల ఏరియల్ సర్వే**

ఇదిలావుండగా జంట నగరాలతో పాటు శివార్లలో గణేష్ ఉత్సవాలు సాఫీగా సాగేందుకు గ్రేటర్ పరిధిలో అడుగడుగునా పోలీసులను మొహ ంచారు. 35 వేల మంది పోలీసు బలగాలను రంగంలో దింపగా ఇందులో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మూడు వేల మంది కూడా వున్నారు. పాత బస్తీలో మూడు వేల మంది పోలీసులను మొహరించారు. గతంలో జరిగిన అవాంఛనీయ ఘటనల దృష్ట్యా పాతబస్తీ విషయంలో పోలీసు అధికారులు మరిన్ని జాగ్రత్తలు చేబట్టారు. పాతబస్తీ విషయం ఇలావుంటే పూర్వపు పశ్చిమ, తూర్పు మండల పరిధుల్లో కూడా భద్రతా ఏర్పాట్లను పటిష్ఠం చేశారు. నగరంలోని సున్నిత, అతి సున్నిత ప్రాంతాలలో ఉన్నతాధికారులు స్వయంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇక ఈసారి జరిగిన గణేష్ ఉత్సవాలకు ఏడు లక్షలకు పైగా సిసి కెమెరాలను అమర్చారు. ఇందులో మెజారిటి కెమెరాలు నేరుగా సిటీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు డిజిపి కంట్రోల్ రూంలకు అనుసంధానం చేయగా మరికొన్ని కెమెరాలను ఆయా ప్రాంతాల పోలీసు స్టేషన్లకు అనుసంధానించారు. సిసి కెమెరాల ద్వారా ఆయా ప్రాంతాలలోని పరిస్థితులను పోలీసులు నిరంతరం పర్యక్షించారు. బందోబస్తు ఏర్పాట్లను డిజిపి ఆనంద్ నగర పోలీసు కమిషనర్ సజ్జన్నర్ సహా ఇతర ఉన్నతాధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. కాగా నిమజ్జన ఏర్పాట్లపై హైదరా బాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, డిజిపి ఆనంద్, కొత్వాల్ సజ్జన్నర్, బల్దియా కమిషనర్ కర్ణన్, కలెక్టర్ ప్రియాంక అలహెలికాప్టర్ ద్వారా వీక్షించారు.

# ముంబయిలో వైభవంగా గణేశ నిమజ్జనాలు

## లక్షలాదిమంది వీక్షించిన లాల్‌భోగ్జా గణేశుడు

**ముంబయి, సెప్టెంబరు 25:** అనంత చతుర్దశి సందర్భంగా ముంబై నగరంలో శుక్రవారం ఉదయం నుంచి గణేశ్ నిమజ్జన శోభాయాత్రలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహాల నిమజ్జనం సజావుగా, సురక్షితంగా జరిగేలా ముంబై పోలీసులు, బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) భారీగా ఏర్పాట్లు చేశారు. నగరవ్యాప్తంగా 430 గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. వీటిలో 416 గృహ గణపతి విగ్రహాలు, 8 సామూహిక గణేశ్ విగ్రహాలు, 6గౌరీ విగ్రహాలు ఉన్నాయి. నిమజ్జనాల కోసం ముంబైలోని 278 ప్రాంతాల్లో 383 కృత్రిమ చెరువులు, అదనంగా 67 సహజ నిమజ్జన ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ప్రఖ్యాత లాల్ భౌగ్చా గణేశుని నిమజ్జన ఊరేగింపులో లక్షలాదిమంది ప్రజలు తరలివచ్చారు. వీధులన్నీ లాల్‌భోగ్చా లంబోదరుడిని చివరిసారి వీక్షించేందుకు వచ్చిన జనంతో నిండిపోయాయి. నిమజ్జన విధుల్లో 25 వేలమందికి పైగా బీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొననున్నారు. భారీ గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి వీలుగా నిమజ్జన కేంద్రాల్లో 1,194 స్టీల్ ప్లేట్లు, 23 జర్మన్ రాఫ్టులు, 34 క్రేన్లు, 10 మోటార్ బోట్లు సిద్ధంగా ఉంచారు. ప్రజల భద్రత కోసం 85 అంబులెన్సులు, 1,132 మంది లైఫ్‌గార్డులను అందుబాటులో ఉంచారు. ప్రజలకు రాత్రివేళ కూడా ఇబ్బందులు లేకుండా ముఖ్య కూడళ్లు, బీచ్‌ల వద్ద 6,052 ఫ్లడ్‌లైట్లు, సెర్చ్‌లైట్లు ఏర్పాటు చేశారు. భారీగా తరలివచ్చే భక్తులను నియంత్రించేందుకు పోలీసులు, బీఎంసీ, అగ్నిమాపక శాఖ తదితర విభాగాలు కలిసి 261 స్వాగత కేంద్రాలు, 228 కంట్రోల్ రూమ్‌లు, 75 పరిశీలనా టవర్లను ఏర్పాటు చేశాయి.

# జ్ఞానేశ్! వెళ్లిపో

>> పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గొగోయ్ డిమాండ్ చేశారు. మణిపూర్లో పిసిసి అధ్యక్షుడు ఒక్రమ్ ఇబోబి సింగ్, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేత కీశమ్ మేఘచంద్ర సింగ్ నేతృత్వంలో కార్యకర్తలు లాంఫెల్పట్లోని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీస్ వైపు ర్యాలీ నిర్వహించారు.సిఇసిని అరెస్టు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు సిఇసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్లో కాంగ్రెస్ నేతలు పిసిసి కార్యాలయం నుంచి రాష్ట్ర సచివాలయంలోని ఎన్నికల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జమ్మూలో ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. శ్రీనగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో నిరసన చేపట్టి సిఇసి తక్షణ రాజీనామాను డిమాండ్ చేశారు. చండీగఢ్‌లో ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు వాటర్ కేనన్లతో అడ్డుకున్నారు. లక్నోలో కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్లో కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వాచన్ భవన్ సమీపంలో ఆందోళన చేపట్టారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, ఓటర్ల జాబితాలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్లో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శుభంకర్ సర్కార్ నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాలకత్తా యూనివర్సిటీ కాలేజ్ స్ట్రీట్ క్యాంపస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం వైపు సాగింది. ఒడిశాలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. గోవాలో కాంగ్రెస్ నాయకులు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించి వినతిపత్రం సమర్పించారు.ఢిల్లీలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో కొందరు కార్యకర్తలు జ్ఞానేశ్ కుమార్ ముఖంతో కూడిన మాస్కులు ధరించారు. మరికొందరు చేతులకు సంకెళ్లను పోలిన వస్తువులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఐవైసి అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్ నేతృత్వంలో రైసినా రోడ్డు లోని పార్టీ కార్యాలయం నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీ నిర్వహించారు. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేందుకు ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటులో తీర్మానం ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ అంశంపై సెప్టెంబర్ 29న న్యూఢిల్లీలో జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# సంఘ్ పరివార్ ప్రమాదకరం

>> వ్యక్తిగా నిలవడం మరింత ప్రత్యేకమని చెప్పారు. సంఘ్ పరివార్ దేశానికి, ప్రజాస్వామ్యానికి అతి పెద్ద ప్రమాదకారి, దేశవ్యాప్తంగా సంఘ్ పరివార్ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం భారతాన్ని మతం పేరిట విభజిస్తోంది... గాంధీ పరివార్ మాత్రం భారత ఐక్యతకు కృషి చేస్తోందని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తగా, రాహుల్‌గాంధీ నాయకత్వంలోని బృందంలో ఒక కార్యకర్తగా తాను ఈ అవార్డును స్వీకరిస్తున్నానని చెప్పారు. కేరళంకు రావడం తనకు ఎప్పుడూ సంతోషంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలోనూ, కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ ఇక్కడికి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిసారీ కేరళం ప్రజలు తనకు ఆత్మీయ స్వాగతం పలికారని చెప్పారు. లౌకికవాదానికి అండగా నిలుస్తూ కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులకు మద్దతు ఇస్తున్న కేరళం ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భారత ఆత్మ(ఐడియా ఆఫ్ ఇండియా)కు రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక కేరళం రాజకీయాలకు దేశ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. వాతావరణ నిపుణులు రుతుపవనాల కోసం కేరళ వైపు ఎలా చూస్తారో... దేశ రాజకీయాలను అర్థం చేసుకునే విషయంలోనూ కేరళను ఒక సంకేతంగా చూడవచ్చని అన్నారు. కేరళంలో చోటుచేసుకున్న పలు రాజకీయ పరిణామాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 1991లో కేరళరలో కరుణాకరన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పివి నరసింహా రావు ప్రధానమంత్రి అయ్యారని, 1996లో కేరళంలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయిందని గుర్తు చేశారు. 2001లో ఎకె ఆంటోనీ ముఖ్యమంత్రి కాగా, 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. 2026లో కేరళంలో కాంగ్రెస్ మళ్లీ విజయం సాధించడంతో కొత్త రాజకీయ గాలి మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. కేరళం నుంచి మొదలైన ఈ గాలి దేశమంతా తుపానుగా మారాలి అని పిలుపునిచ్చారు. ఆర్యదాన్ ముహమ్మద్ తన జీవితాంతం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేశారని రేవంత్ రెడ్డి అన్నారు.

ప్రస్తుతం దేశంలో మతతత్వ శక్తుల నుంచి ప్రమాదం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. బిజెపిపై తీవ్ర రాజకీయ విమర్శలుచేశారు. స్వేచ్ఛ, లౌకికవాదం, రాజ్యాంగ విలువలను కాపాడటమే ఆర్యదాన్ ముహమ్మద్‌కు నిజమైన నివాళి అని అన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, ఓటు హక్కును పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, ఎన్నికల గుర్తుల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతున్నాయంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రంలోని అధికార బిజెపి ప్రభుత్వాన్ని పరోక్షంగా ఆరోపించారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. గత రెండు దశాబ్దాల్లో జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వంటి వివిధ పదవులను చూశానని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇక నా ముందున్న ఏకైక లక్ష్యం రాహుల్‌గాంధీని భారత ప్రధానమంత్రిగా చూడటం అని స్పష్టం చేశారు. కేరళంలో మొదలైన రాజకీయ మార్పు గాలిని దేశంలోని ప్రతి ఇంటికి, ప్రతి వీధికి, ప్రతి గ్రామానికి, ప్రతి నగరానికి, ప్రతి రాష్ట్రానికి తీసుకెళ్లాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మార్పు గాలులు వీస్తున్నాయని, రాహుల్ గాంధీ ఆశాభావ సందేశం ప్రజల్లోకి వెళ్తోందని అన్నారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడే వరకు రాహుల్ గాంధీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కేరళంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. రాహుల్ గాంధీ నాయకత్వం, రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం, ఓటు హక్కు వంటి అంశాలను కేంద్రంగా చేసుకుని ప్రతిపక్ష రాజకీయాన్ని బలోపేతం చేయాలన్న కాంగ్రెస్ ప్రయత్నాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కూడా కీలకంగా స్వరం వినిపిస్తున్నారు.

# అమెరికా దాడిచేయవచ్చనే జాగ్రత్త పడ్డాం

## కెనడా ప్రధాని మెక్ కార్నీ

**టొరంటో, సెప్టెంబరు 25:** అమెరికా తమ దేశంపై దాడి చేసే అవకాశాన్ని కూడా కెనడా ప్రభుత్వం పరిశీలించినట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ స్వయంగా వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా మార్చాలంటూ పదేపదే వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ అంశంపై కెనడా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అయితే అమెరికా దాడి చేసే అవకాశం ఉందని తాము భావించడం లేదని కార్నీ స్పష్టం చేశారు. అత్యంత అరుదైన, తీవ్రమైన పరిస్థితులను కూడా పరిశీలించడం ప్రధాని బాధ్యత అని చెప్పారు. ఇలాంటి ప్రమాదాలను పట్టించుకోకుండా ఉండటం బాధ్యతారాహిత్యమే అవుతుందని అమెరికా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అమెరికా, కెనడా మధ్య గతేడాది నుంచి వాణిజ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. కెనడా వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం భారీ సుంకాలు విధించింది. దీనికి ప్రతిగా కెనడా కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాలు విధించింది.

ఉత్తరాది పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ : U40109TG2000SGC034119
టెండర్ ప్రకటన నం. 09/2026-27
ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి ప్రయోజనాల నిమిత్తం ఆదిలాబాద్ సర్కిల్‌లో ఆదిలాబాద్ డివిజన్ వద్ద 33 KV / 11 KV మరియు LT లైన్ల షిఫ్టింగ్ కలిపి రీ-రూటింగ్ మరియు M లైన్ టవర్స్ పాక్షిక టర్న్‌కీ ప్రాతిపదికపై నెలకొల్పుట. 1) బిడ్ నం.లు II-92/2026-27, 2) బిడ్ నం.లు II-93/2026-27, 3) బిడ్ నం.లు II-94/2026-27, 4) బిడ్ నం.లు II-95/2026-27, 5) బిడ్ నం.లు I-233/2026-27, "పద్దెర మరియు సగర (ఉప్పర)" లకు రిజర్వుడు, 6) బిడ్ నం.లు I-234/2026-27. తదుపరి వివరాలకు: https://tender.telangana.gov.in (లేదా) www.tgnpdcl.com వీక్షించండి.
సం/- చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), TGNPDCL, వరంగల్
DIPR.No.10656-PP/CL/Advt/1/2026-27, తేది: 25.09.2026

# ఖైరతాబాద్ ఉప ఎన్నిక?

>> మాట్లాడుతూ మళ్లీ పోటీ చేస్తానని చెప్పారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బిఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచారు. ఆయనకు 67,368 ఓట్లు వచ్చాయి,కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డికి 45,358 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి 38,094 ఓట్లు వచ్చాయి. మూడు పార్టీలకు గణనీయంగానే ఓటు బేస్ ఉంది. ఇప్పుడు ఉప ఎన్నికలో ఆ ఓట్లు ఎలా మారుతాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఈ ఉప ఎన్నిక కీలకంగా మారింది. ప్రభుత్వ పనితీరు,నగర అభివృద్ధి స్థానిక సమస్యలను ప్రచారంలోకి తీసుకురావచ్చు, అభ్యర్థి ఎంపిక మాత్రం ప్రధాన అంశంగా మారింది. దానం నాగేందర్‌కు మరోసారి అవకాశం ఇస్తారా లేదా అనే చర్చ సాగుతోంది. విజయారెడ్డికి టిక్కెట్ ఇస్తే దానం నాగేందర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వవచ్చునని ప్రచారం ఒకవైపు సాగుతోంది.

# 'భూ భారతి'కి బ్రేక్‌లు!

>> అధికారులు పది రోజులు దాటుతున్నా తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. భూ భారతి పోర్టల్ సేవలు నిలిచిపోవడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. అసలు పోర్టల్ ఎందుకు పనిచేయడం లేదనే విషయంలో అధికారుల నుండి లేదా ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు అధికారిక ప్రకటన విడుదల కాలేదు. దీంతో రైతులు, వ్యాపారులు, ప్రజలు అసలు ఏం జరుగుతుందో అర్థంగాక ఆందోళనకు గురవుతున్నారు. భూ భారతి పోర్టల్ కార్యకలాపాలు స్థంభించి పది రోజులు దాటుతున్నా పోర్టల్‌లో తలెత్తిన సమస్యలు సరిదిద్దక పోవడం, భూ భారతి పోర్టల్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని చెప్పవచ్చు. పోర్టల్ పనితీరుపై అధికారుల ఆజమాయిషి కొరవడిందేమో అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అసలు సమస్య ఏంటనేది అధికారులు ప్రకటన చేయక పోవడంతో తమ వద్దకు వచ్చే వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక మీ సేవ నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. ఎప్పటి నుండి భూ భారతి పోర్టల్ తిరిగి పనిచేస్తుందో తెలియక పోవడంతో మీ సేవ కేంద్రాల చుట్టూ రైతులు, వ్యాపారులు, ప్రజలు ప్రతి రోజు చక్కర్లు కొడుతున్నారు. గుర్తింపు పొందిన కంపెనీలు, ఇన్‌స్టిట్యూషన్స్ పిపిబి దరఖాస్తులు, ప్రభుత్వ భూమి అసైన్‌మెంట్ ఇకెవైసి సేవలు, భూ భారతి డాటా మాడిఫికేషన్ సిస్టం ఇకెవైసి సేవలు, భూ భారతి జిపిఎ ఇకెవైసి అథెంటికేషన్, ఖాతా మెర్జింగ్ ఇకెవైసి సేవలు, ల్యాండ్ అక్వ్యయిర్డ్ అండ్ అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ ఇకెవైసి అప్‌డేట్, నాన్ అగ్రికల్చర్ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, పెండింగ్ మ్యుటేషన్ ఇకెవైసి, భూ భారతి స్లాట్ బుకింగ్ సర్వీస్, ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ ఇకెవైసి, పిపిబి, లేదా నాలా కన్వర్షన్ విషయంలో బయో మెట్రిక్ అథెంటికేషన్, ఇన్స్టిట్యూషనల్ పిపిబికి సంబంధించి ఛేంజ్ ఇన్ ఆథరైజ్డ్ సిగ్నేటరి, కోర్ట్ కేస్ ఇంటిమేషన్ ఇకెవైసి, భూ భారతి సర్వీసులకు సంబంధించిన యూజర్ ఛార్జెస్ రశీదులు, సెమి అర్బన్ ల్యాండ్ ఇకెవైసి సేవలు గత పది రోజులుకు పైగా పనిచేయడం లేదు. అధికారులు, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందిచి భూ భారతి పోర్టల్‌లో తలెత్తిన సమస్యలను పరిష్కరించి పోర్టల్ సేవలు పూర్తి స్థాయిలో తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలి.

# 111 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు

>> పార్టీ (ఎన్‌డిపిపి), నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) మధ్య జరిగిన రాజకీయ సమీకరణాల్లో భాగంగా ఈ ఫిరాయింపులు చోటుచేసుకున్నాయి. అత్యధిక ప్రజాప్రతినిధుల్ని చేర్చుకున్న పార్టీగా ఎన్‌పిఎఫ్ నిలిచింది. పశ్చిమ బెంగాల్లో 20 మంది లోక్‌సభ ఎంపీలు తృణమూల్ కాంగ్రెస్ నుంచి నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)లో చేరారు. దీని తర్వాతి స్థానంలో తెలంగాణ నిలిచింది. బిఆర్ఎస్‌లో గెలిచిన 9 మంది ఎమ్మెల్యేలు ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. గోవాలో 8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. ఉద్ధవ్ శివసేన నుంచి ఎన్నికైన ఎంపీలు, ఆ తర్వాత ఏక్నాథ్ షిండే శివసేనలో చేరారు. మేఘాలయలో ఐదుగురు, మణిపూర్లో ముగ్గురు, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్లో చెరో నలుగురు ఎమ్మెల్యేలు పార్టీలు మారారు. హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్లో ఇద్దరు చొప్పున, కర్ణాటక, మధ్యప్రదేశ్, సిక్కిం, యూపీల్లో ఒక్కో పార్టీ ఫిరాయింపు కేసు నమోదైంది.

పార్టీల పరంగా చూస్తే అత్యధికంగా ఎన్‌డిపిపి నుంచి 25 మంది బయటకు వెళ్లారు. టీఎంసీ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి 19 మంది, బీఆర్ఎస్ నుంచి 9 మంది, ఆప్, ఎన్సీపీల నుంచి చెరో ఏడుగురు, శివసేన నుంచి ఆరుగురు, జేడీయూ నుంచి ఐదుగురు, ఎన్పీపీ నుంచి నలుగురు పార్టీలు మారారు. మొత్తంగా ఎన్‌డిపిపి, టీఎంసీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 111 కేసులలో 64 కేసులు(అంటే 58శాతం) నమోదయ్యాయి. పార్టీలు మారిన ప్రజాప్రతినిధులను ఎక్కువగా చేర్చుకున్న పార్టీల్లో ఎన్‌పిఎఫ్ అత్యధికంగా 32 మందిని పొందింది. ఆ తర్వాత బిజెపి 29 మందిని,ఎన్‌సిపిఐ 20 మందిని చేర్చుకున్నాయి. కాంగ్రెస్‌కు 9,శివసేనకు 8,ఎన్‌పిపికి 6,అరుణాచల్ పీపుల్స్ పార్టీలోకి నలుగురు చేరారు.

# బురద రాజకీయాలా?

>> చారు. గోదావరి జలాలను లిఫ్ట్ చేయకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే, మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉన్నాయని, మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 13 టీఎంసీలు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇక్కడ 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థం అందుబాటులో ఉందన్నారు. మల్లన్న సాగర్ నిండుకుండలా మారితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు, మూసీ ప్రాజెక్టుకు కూడా ఇక్కడి నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుందని సూచించారు.కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లోనూ 15 టీఎంసీలకు కేవలం 6 టీఎంసీలే ఉన్నాయని, ఇక్కడికి సైతం నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఎల్లంపల్లిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్ మానేరు సహా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా పూర్తి పరిష్కారం లభిస్తుందని సూచించారు. ఈ రిజర్వాయర్లను నింపడం వల్ల దాదాపు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి దోహదం చేసినట్లవుతుందని తెలిపారు. మరోవైపు మిడ్ మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాం (ఎల్.ఎం.డి.)లో ప్రస్తుతం 11 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని, ఇక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయని వివరించారు. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లోని రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేసిన వారవుతారని తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని లేఖలో పేర్కొన్నారు. పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ కోసం రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని, రంగనాయక సాగర్‌లో నీళ్ల లేకపోవడం వల్ల పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ ఇబ్బందిగా మారిందని వెల్లడించారు.గోదావరి నదిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్నది. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని అన్ని మోటార్లను నడిపి నీళ్ల లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకో వడం లేదు. ఉద్దేశపూర్వకంగా మీరు చేస్తున్న నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.జలకళతో కనిపించాల్సిన రిజర్వాయర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయంటే దానికి కారణం నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. రాజకీయాలను పక్కన పెట్టి రైతు ప్రయోజనాల కోసం ఆలోచించాలని, ప్రకృతిపై నెపం నెట్టి రైతులకు సాగు నీళ్ల ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవద్దని కోరారు.

## వారం - వర్జ్యం

26-09-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి. పౌర్ణమి రా.10.15, న.పూర్వాభాద్ర ఉ.11.29
వ.రా.8.55 - రా.10.30
దు.తె.5.56 - ఉ.7.32
రాహు ఉ.9.00-10.30
శుభ స. ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం:** సెంటిమెంట్ వస్తుభద్రతపట్ల జాగ్రత్త వహించండి. ఏకపక్షనిర్ణయాలు లాభించవు. వైద్యవిధానంలో మార్పులు చేస్తారు.

**వృషభం :** అలౌకిక విషయాల పట్ల ఆసక్తిని చూపుతారు.ప్రత్యర్థులకు మీ శక్తి సామర్థ్యాలే జవాబు అవుతాయి.

**మిథునం :** బంధువర్గానికి సంబంధించిన కొన్ని వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షిస్తారు.వస్తువుల కొనుగోలు.

**కర్కాటకం :** సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటారు.మేనేజ్మెంట్ రంగంలోని వారికి అనుకూలం. ప్రయాణ సూచన.

**సింహం :** ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కలిగినవారితో పరిచయాలు ఏర్పడతాయి. క్రయవిక్రయాలను సాగిస్తారు.

**కన్య :** భాగస్వామ్య వ్యాపారాలలో జాగ్రత్తలు అవసరం.ఇతరులకు మీ వంతు సహాయ సహకారాలను అందిస్తారు.

**తుల :** బహుమతులను అందుకుంటారు. పనులపట్ల మీ శ్రద్ధ కొంతవరకు తగ్గినట్లు అనిపిస్తుంది.

**వృశ్చికం :** నూతన వ్యాపారాలు ప్రారంభించడానికి అనుకూలం. మీ ప్రతిభాపాటవాలు వెలుగుచూస్తాయి.

**ధనుస్సు:** అధికంగా శ్రమిస్తారు. ఫలితాలను కూడా అదేవిధంగా సాధిస్తారు. కీలక విషయాలలో ఓర్పును కనబరచండి.

**మకరం :** అదృష్టం అండగా నిలుస్తుంది. విద్యార్థులకు అనుకూలం. వృత్తి, ఉద్యోగ పరంగా సానుకూల ఫలితాలు.

**కుంభం:** గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నాలు చేస్తారు.ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది.

**మీనం :** ఆత్మీయ వర్గం యొక్క సూచనలను పరిగణలోనికి తీసుకుంటారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలమైన మార్పులు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాహుల్ తీరు అనుచితం

>> పడ్డారు. నిన్న సుప్రీం కోర్టు.. ఇవాళ ఎన్నికల కమిషన్.. రేపు మరో సంస్థ.. ఇలా కాంగ్రెస్ ప్రతి సంస్థపై తన అక్కసు వెల్లగక్కుతూనే ఉంటుంది. అవినీతి నాయకులపై ఈడి, సిబిఐలు విచారణ జరిపితే కూడా కాంగ్రెస్ గగ్గోలు పెడుతూ.. విచారణ సంస్థల దుర్వినియోగం జరుగుతోందంటూ లేనిపోని ఆరోపణలు చేస్తుందన్నారు. ఇక్కడ కాంగ్రెస్ నేతలు ఒక విషయం గుర్తుంచుకోవాలని, నిజంగానే విచారణ సంస్థలను దుర్వినియోగం చేసేదే నిజమైతే.. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ బెయిల్‌పై బయట ఎందుకు తిరుగుతున్నారో ఓసారి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా లక్షలాది మంది బూత్ ఏజెంట్లు ఉన్నారు. ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు ఉంటే.. తెలియజేయడానికి చాలా సమయం ఇచ్చారు. అయినా కూడా ఎలాంటి అభ్యంతరాలు దాఖలు చేయలేదు. ఓట్ చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ప్రమాణపూర్వకంగా చెప్పాలని డిమాండ్ చేస్తే మౌనం వహించారు. మరి అలాంటప్పుడు ఎందుకు అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తారు? ఎన్నికల సంఘం స్వతంత్రమైన రాజ్యాంగబద్ధ సంస్థ అనే విషయంలో మాకో క్లారిటీ ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థ వ్యవహారాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు.. చేసుకోదు కూడా. పశ్చిమ బెంగాల్‌తో పాటు దేశవ్యాప్తంగా ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో 92 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించారు. అలాంటి ఓటర్లను ఇరాక్, ఉత్తర కొరియా ప్రజలతో రాహుల్ గాంధీ పోల్చడం నిజంగా సిగ్గు చేటు. ప్రధానమంత్రి గారు, హోంమంత్రి గారిపై అసభ్యకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను.

# రెండురోజులు వర్ష సూచన

>> రెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, సిద్దిపేట, సూర్యాపేట, సంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలను కోరారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం చెదురుమదురు నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటు వర్షపాతం 11.3 మిల్లీమీటర్లుగా నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాలోని వేమసూర్‌లో 105.2 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది. రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో 45.9 మిల్లీమీటర్లు, సూర్యాపేట్‌లో 40.2 మిల్లీమీటర్లు, మంచిర్యాలలో 11.9 మిల్లీమీర్లు, పెద్దపల్లిలో 15.2 మిల్లీమీటర్లు, ఆసిఫాబాద్‌లో 13.2 మిల్లీమీటర్లు, జగిత్యాలలో 14.2 మిల్లీమీటర్లు, కరీంగనగర్‌లో 12.5 మిల్లీమీటర్లు, ములుగులో 25.1 మిల్లీమీటర్లు, భూపాలపల్లిలో 13.6 మిల్లీమీటర్లు, మహబూబాబాద్‌లో 20.1 మిల్లీమీటర్లు, జనగామలో 13.5 మిల్లీమీటర్లు, కొత్తగూడెంలో 33.4 మిల్లీమీటర్లు, వరంగల్‌లో 12.2 మిల్లీమీటర్లు, హన్మకొండ జిల్లాలో 14.7 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

# గ్రీన్ యూరియా 3 లక్షల టన్నుల డిమాండ్

## మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ప్రతిపాదనలు

## సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ డైరెక్టర్ సంజయ్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** యేడాదికి మూడు లక్షల టన్నుల గ్రీన్ యూరియా అవసరం ఉందని, దీని కోసం తదుపరి విడత టెండర్లను పిలవడానికి మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నామని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ సంజయ్ శర్మ తెలిపారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గ్రీన్ అమ్మోనియా కోసం మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిన వెంటనే టెండర్లను పిలుస్తామన్నారు. ఇందుకు గాను అవసరమైన నిధులు కోసం కేంద్ర మంత్రిత్వ శాఖకు ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. స్ట్రాటజిక్ ఇంటర్వెన్షన్స్ ఫర్ హైడ్రోజన్ ట్రాన్సిషన్ (ఎస్ఐజిహెచ్‌టి) పథకం కింద కిలోకు రూ.49.75 అత్యల్ప ధరతో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ మొదటి గ్రీన్ అమ్మోనియా సేకరణను ఇప్పటికే పూర్తి చేసిందన్నారు. మొదటి విడతలో ఎరువుల యూనిట్లకు సరఫరా చేయడానికి సంవత్సరానికి మొత్తం 7.24 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను చేర్చారని వెల్లడించారు. పునరుత్పాదక శక్తి ఆధారిత హైడ్రోజన్‌ను ఉపయోగించి గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేస్తారని, దీన్ని యూరియా వంటి ఎరువుల ఉత్పత్తికి ఫీడ్‌స్టాక్‌గా ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. గ్రీన్ యూరియా ఉత్పత్తికి తగిన కార్బన్ డయాక్సైడ్ కూడా అవసరం ఉందని ఇందుకు తమ సంస్థ ప్రత్యేక దృష్టిసారించిందని చెప్పారు. స్వచ్ఛమైన ఇంధనాలను ఆర్థికంగా లాభదాయకంగా మార్చడానికి ప్రభుత్వ మద్దతు కీలకంగా ఉన్నందున, గ్రీన్-ఫ్యూయల్ టెండర్లను పిలిచే ముందు డిమాండ్‌పై స్పష్టత చాలా ముఖ్యమని వెల్లడించారు. రాబోయే ఐదు నుండి 10 ఏళ్లలో హారిత ఇంధన ధరల గమనం పునరుత్పాదక ఇంధన వ్యయాలు, ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రధానంగా పునరుత్పాదక ఇంధన ధరలకు అనుగుణంగా మాడ్యూళ్ల ధరలు పెరిగితే, బ్యాటరీ నిల్వ వ్యవస్థ చాలా అనిశ్చితంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# అంగరంగ వైభవంగా గణేశ శోభాయాత్ర

## వేలాది విగ్రహాల ఊరేగింపుతో నగరమంతా పండుగ సందడి

## ఖైరతాబాద్ మహాగణపతిసహా పలు భారీ విగ్రహాలు

## ట్యాంక్‌బండ్ 'సాగర్'లో నిమజ్జనం

## ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన

## పోలీసు కమిషనర్ సజ్జనార్, 'హైడ్రా' రంగనాథ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** పదకొండు రోజులపాటు విశేష పూజలందుకున్న ఖైరతాబాద్ బడా గణేశుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తులో పంచముఖ సంకటహర మహాగణపతిగా దర్శనమిచ్చిన గణనాథుడి నిమజ్జన కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఎన్టీఆర్ మార్గ్‌లోని హుస్సేన్‌సాగర్ క్రేన్ నంబర్-4 వద్ద ప్రశాంతంగా ముగిసింది. నిమజ్జనానికి ముందు ఉత్సవ కమిటీ సభ్యులు మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ క్రేన్ల సాయంతో విగ్రహాన్ని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. గురువారం రాత్రి 8 గంటలకు కలశ పూజ నిర్వహించి 9 గంటలకు చివరి మహా హారతినిచ్చారు. 10 గంటల నుంచి క్రెయిన్ పైకి ఎక్కించే పనులను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు నిమజ్జన శోభయాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా క్రేన్‌లో తలెత్తిన సమస్యతో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి బడా గణేశుడి శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. మార్గమంతా వేలాదిమంది భక్తులు తరలివచ్చి గణనాథుడికి వీడ్కోలు పలికారు. డప్పులు, భజనలు, నృత్యాలతోపాటు "గణపతి బప్పా మోరియా" నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. శోభాయాత్ర ప్రారంభ సమయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ మహిళా పోలీసులతో కలిసి మహాగణపతి ఎదుట నృత్యం చేశారు. బడా గణేశుడి నిమజ్జనాన్ని వీక్షించేందుకు ట్యాంక్‌బండ్‌కు భక్తులు భారీగా తరలిరావడంతో ఆ ప్రాంతం భక్తజన సంద్రంగా మారింది. సచివాలయం సౌత్‌ఈస్ట్ మార్గం కూడా భక్తులతో కిక్కిరిసిపోయింది. ఇదే సమయంలో అప్పర్ ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవాలు అత్యంత కోలాహలంగా కొనసాగుతున్నాయి. జంట నగరాల నుంచి భారీ సంఖ్యలో విగ్రహాలు తరలివస్తుండగా.. 12 క్రేన్ల ద్వారా నిమజ్జన ప్రక్రియ కొనసాగుతోంది. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 479 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రతి క్రేన్ వద్ద ఒక ఎస్ఐతోపాటు ఐదుగురు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో 25 క్రైమ్ టీమ్స్, 10 షీటీమ్స్ బృందాలు విధులు నిర్వహించాయి. మరోవైపు నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రత్యక్షంగా శోభయాత్రను దగ్గరుండి పరిశీలించారు. భక్తుల రద్దీ, భారీ సంఖ్యలో తరలివస్తున్న విగ్రహాల నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా 58 సీసీటీవీ కెమెరాలతో నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవాలు పూర్తయ్యేలా అప్పర్ ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య బడా గణేశుడి నిమజ్జనం పూర్తవడంతో భక్తులు భావోద్వేగంతో వీడ్కోలు పలికారు.



శుక్రవారం సాగర్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

# నిమజ్జనానికి వినాయకుడిని తీసుకెళ్తూ యువకుడి మృతి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** నిమజ్జనానికి వినాయకుడిని తీసుకెళ్తున్న ఒక యువకుడు టస్కర్ వాహనం కింద ప్రమాదావశాత్తు పడి మృతిచెందిన సంఘటన ఖైరతాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. ఖైరతాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. కార్మికనగర్‌కు చెందిన శివ(24) తమ వినాయకుడిని తీసుకొని స్నేహితులు, స్థానికులతో కలిసి ట్యాంక్‌బండ్‌కు తీసుకెళ్తున్నారు. టస్కర్ వాహనం వీవీ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్డుకు వెళ్లాల్సి ఉండగా లక్డీకపూల్ నుంచి వెళ్దామని భావించి అటుగా వాహనాన్ని మళ్లించారు. వినాయకుడి వద్ద పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ క్రమంలోనే పోలీసులు వాహనాన్ని నెక్లెస్ రోడ్డు వైపు తిప్పాలని సూచించారు. అదే క్రమంలో శివ పరుగున వెళ్లి టస్కర్ వాహనం ఎక్కేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే అతను టస్కర్ వాహనం కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే పోలీసుల కారణంగానే శివ ప్రాణాలు కోల్పోయాడంటూ తోటి భక్తులు ఆందోళన చేశారు. ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రమంతా ప్రశాంతంగా గణేశ నిమజ్జనం

## లక్షా 24వేల విగ్రహాల ఏర్పాటు, శుక్రవారం సాయంత్రం వరకు 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తి

## డిజి కంట్రోల్, కమాండ్ కంట్రోల్ నుంచి నిరంతరం పర్యవేక్షణ.. డిజిపి ఆనంద్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 25: ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా గణేశ నిమజ్జనం ప్రశాంతంగా సాగుతోందని డిజిపి సి.వి ఆనంద్ తెలిపారు. ఈ యేడాది లక్షా 24 వేల విగ్రహాలు ప్రతిష్టించగా శుక్రవారం సాయంత్రం వరకు 88 వేల విగ్రహాలు నిమజ్జనం జరిగిందని ఇంకా 25 వేల విగ్రహాలు మిగిలి వున్నాయని ఆయన తెలిపారు. శుక్రవారం రాత్రి ఏడున్నర గంటలకు తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పలుచోట్ల నిమజ్జనానికి సంబంధించిన సిసి టివి ఫుటేజిలను, పోలీసు బందోబస్తును లైవ్‌లో చూపించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ యేడాది గణేశ్ ఉత్సవాల కోసం పక్కాగా వ్యవహరించామని తెలిపారు. విగ్రహాల ఏర్పాటు మొదటుకొని నిమజ్జనం జరిగే వరకు ఎలా వ్యవహరించాలనే దానిపై ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేసి దానిని పక్కాగా అమలు చేశామని ఆయన అన్నారు. ఈ క్రమంలోనే రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రాంతాలలో ఏర్పాటైన లక్షా 24 వేల విగ్రహాలను లెక్కలో తీసుకున్నామని అయితే వాస్తవంలో దీనికి మూడు రెట్ల విగ్రహాలు వున్నాయని ఆయన తెలిపారు. ఇవన్నీ ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటైనవని డిజిపి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎనిమిది వేల విగ్రహాలు ఎక్కువగా ప్రతిష్టించబడ్డాయని డిజిపి అన్నారు.

శుక్రవారం సాయంత్రం వరకు 6350 విగ్రహాలు నిమజ్జనం అయ్యాయని ఆయన తెలిపారు. ఇక గణేష్ నిమజ్జనం సవ్యంగా సాగేందుకు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. స్థానిక పోలీసులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అదనపు బలగాలను రప్పించామని, ఆక్టోపస్, గ్రే హౌండ్స్ సహా ఇతర విభాగాల బలగాలు కూడా బందోబస్తులో వున్నాయని ఆయన తెలిపారు.

బందోబస్తును ఆయా ప్రాంతాల ఉన్నతాధికారులు భద్రతను పర్యవేక్షిస్తున్నారని డిజిపి తెలిపారు. నగరంలోని ఖైరతాబాద్ గణేష్ విగ్రహం మధ్యాహ్నం రెండున్నర గంటలకు నిమజ్జనం పూర్తయ్యిందని, దీని తరువాత ట్యాంక్‌బండ్ వద్ద ఇతర విగ్రహాల నిమజ్జనం మరింత వేగం పుంజుకుందని ఆయన తెలిపారు. పాతబస్తీ నుంచి ఇంకా విగ్రహాలు రావాల్సి వుందని, జంట నగరాలలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా విగ్రహాలు నిమజ్జనం అవ్వాల్సి వుందని ఆయన తెలిపారు. శుక్రవారం కావడం వల్ల పాతబస్తీలో ప్రార్థనల కారణంగా ఊరేగింపు ఆలస్యమయ్యిందని డిజిపి తెలిపారు. ఈ నేపథ్యంలో గణేష్ విగ్రహాలను మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనల మేరకు త్వరగా తీసుకురావాలని ఆయన సూచించారు.

హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధుల్లో నిమజ్జనం అంతా సవ్యంగా సాగుతోందని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ఆయన తెలిపారు. భద్రత కోసం కొన్నిచోట్ల డ్రోన్లను వాడామని, సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని డిజిపి తెలిపారు. సాయంత్రం వేళ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి తాను మరికొందరు అధికారులు ఏరియల్ సర్వే చేశామని ఆయన తెలిపారు. ఈ ఏడాది గణేష్ ఉత్సవాలలో ఒక ఎస్ఐ సహా 12 మంది పౌరులు మరణించారని డిజిపి ఆనంద్ తెలిపారు. ఇదే సమయంలో డిజె సౌండ్ సిస్టం వల్ల కొన్నిచోట్ల కొందరు అనారోగ్యం పాలవగా ఒకరు మరణించారని ఆయన వెల్లడించారు. గణేశ నిమజ్జనం శనివారం వరకు కొనసాగనుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్‌భగవత్, ఎఐజి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం ఏరియల్‌వ్యూ ద్వారా గణేశ విగ్రహాల నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, డిజిపి సివి ఆనంద్



సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల హాస్టల్ గేటు వద్ద బైఠాయించి ధర్నా చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

# గురుకులంలో ఎలుకల 'దాడి'

## 14 మంది విద్యార్థినులకు కాటు

## పరామర్శకు వెళ్లిన మాజీమంత్రి దయాకర్‌రావును అడ్డుకున్న పోలీసులు

**జనగామ, సెప్టెంబరు 25, ప్రభాతవార్త ప్రతినిధి :** జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఎలుకలు బీభత్సం సృష్టించాయి. మంగళవారం సాయంత్రం 14మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విద్యార్థినులను పరామర్శించేందుకు హాస్టల్‌కు చేరుకున్నారు. విద్యార్థినులను కలిసేందుకు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు, సిబ్బంది అడ్డుకున్నారని ఎర్రబెల్లి ఆరోపించారు. దీంతో హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వార్డెన్, ప్రిన్సిపాల్‌తో మాట్లాడి హాస్టల్‌లో కనీస వసతులు, పారిశుధ్యం సరిగా లేకపోవడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. విద్యార్థినుల భద్రతపై నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి శారదతో ఫోన్‌లో మాట్లాడి ఘటనను వివరించగా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎర్రబెల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి ఇడి సమన్లు

## సాహితీ ఇన్‌ఫ్రా కేసులో విచారణకు రావాలని తాఖీదులు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి ఎంఎల్ఎ అరికపూడి గాంధీకి కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈ డీ) శుక్రవారం సమన్లు జారీ చేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో మూడు వేల కోట్ల రూపాయలను కొల్లగొట్టి వేలాది మంది అమాయకులను రోడ్డున పడవేసిన సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన కేసులో ఈ నెల 27వ తేదీన విచారణకు రావాలని ఈడీ ఆదేశించింది. సాహితీ ఇన్‌ఫ్రాగా పేరొందిన ఆ సంస్థపై హైదరాబాద్ సిసిఎస్‌లో కేసు నమోదు కాగా ఇందుకు సంబంధించి ఆ సంస్థ ఎండి బూదాటి లక్ష్మీ నారాయణ సహా పలువురు అరెస్టవడం తెలిసిందే. ఫ్రీ లాంచ్ ఆఫర్ల పేరిట లేనిభూమి వుందని చెబుతూ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలో బడా బంగళాలు నిర్మిస్తామని అమాయకులను నిండా ముంచిన సాహితి ఇన్‌ఫ్రాకు సంబంధించి సిసిఎస్ పోలీసులు 200 కోట్ల రూపాయలకు పైగా ఆస్తులు జప్తు చేయగా ఇందులో మనీలాండరింగ్ కోణంలో ఈడీ రంగంలో దిగి విచారణ చేబట్టింది. 2018 నుంచి మూడేళ్ల పాటు ఈ సంస్థ గోల్‌మాల్ కార్యకలాపాలు హైదరాబాద్ శివార్లను కేంద్రంగా చేసుకుని సాగాయి. ఇందులో భాగంగా సాహితీ ఇన్‌ఫ్రా నుంచి ఎమ్మెల్యే గాంధీ బ్యాంకు ఖాతాలో 2.1 కోట్ల రూపాయలు బదిలీ అయిన విషయాన్ని ఈడీ గుర్తించింది. సాహితీ ఇన్‌ఫ్రా నుంచి గాంధీ బ్యాంకు ఖాతాకు నిధులు ఎందుకు బదిలీ అయ్యాయి...? దీనికి కారణం ఏమిటి? ఎలాంటి ప్రయోజనం కోసం ఈ నిధులు అందాయి? అనే కోణంలో ఈడీ విచారణ చేబట్టింది. సాహితీ ఇన్‌ఫ్రాకు గాంధీకి ఏమైనా సంబంధాలు వున్నాయా...? అనే అంశంపై వివరాలు సేకరించేందుకు ఈడీ అధికారులు 27వ తేదీనాటి విచారణలో నిగ్గు తేల్చనున్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేశ నిమజ్జనం : మంత్రి పొన్నం

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** గణేశ నిమజ్జనం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, డిజిపి సి.వి.ఆనంద్, నగర పోలీస్ కమిషనర్ సిపి.సజ్జనార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలాలతో కలిసి శుక్రవారం బేగంపేట విమానాశ్రయం నుంచి గంటసేపు ఏరియల్ వ్యూ ద్వారా సంబంధిత అధికారులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన గణేశ నిమజ్జన సరళిని పర్యవేక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా బాధ్యతగా ప్రతి ఒక్కరు వ్యవహరించాలని సూచించారు. ఎంజె.మార్కెట్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడినప్పటికి పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని సమన్వయంతో ట్రాఫిక్ క్లేర్ చేయడం జరిగిందన్నారు. నిమజ్జన ప్రక్రియ ఎప్పటిలాగా ప్రశాంతంగా, విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందన్నారు.

# ఎపి లిక్కర్ స్కాం కేసులో వైసిపి నేత అంబటికి ఇడి నోటీసులు

## సోమవారం హైదరాబాద్‌లో విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ఎపిలో సంచలనం రేపిన లిక్కర్ స్కాంలో వైసిపి నేత అంబటి రాంబాబుకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఇడి అధికారులు ఆయనకు దీనికి సంబంధించిన నోటీసులు శుక్రవారం అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో గల ఇడి కార్యాలయంలో తప్పకుండా విచారణకు రావాలని కోరారు. ఇంతకుముందు ఇచ్చిన నోటీసులకు గానూ అంబటి ఈ నెల 11వ తేదీన విచారణకు హాజరుకావాల్సి వుండగా తనకు తనకు నోటీసులు అందలేదని అంబటి తెలిపారు. దీని తరువాత రెండవ దఫాగా శుక్రవారం నాడు రావాలని కోరారు. అయినా ఆయన రాకపోవడంతో మరోదఫా నోటీసులు ఇచ్చారు. ఇదే కేసులో వైసిపి నాయకులు మర్రి సుబ్బారెడ్డి, పురుషోత్తం రావులతో కలిసి అంబటి భారీగా సర్కారు నిధులను కాజేసిందని ఇడి అభియోగాలు మోపింది. ఈ స్కాంలో సర్కారు ఖజానాకు 195 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని ఇడి తేల్చింది.

# వివేకా హత్య కేసులో కొనసాగుతున్న ఇడి దర్యాప్తు

## సునీల్‌యాదవ్‌ను రెండోరోజు నాలుగు గంటలపాటు విచారణ

## వైసిపి నేతల నుంచి ప్రాణభయం ఉందని ఆందోళన

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎ2గావున్న సునీల్ యాదవ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు శనివారం నాడు వరుసగా రెండవ రోజు విచారించారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో గల ఈడీ కార్యాయంలో సునీల్ యాదవ్‌ను ఈడీ అధికారులు నాలుగు గంటల పాటు అనేక అంశాల పై ప్రశ్నించారు. వివేకానంద రెడ్డి హత్య కేసును సిబిఐ విచారిస్తుండడం తెలిసిందే. అయితే మనీలాండరింగ్ కోణంలో ఈడీ వేరుగా విచారిస్తు ఒడడం విదితమే. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులకు 40 కోట్ల రూపాయలను చెల్లించినట్లు వెలుగులోకి రావడంతో దీనిపై విచారించేందుకు ఈడీ రంగంలో దిగింది.

2019లో జరిగిన వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించి 40 కోట్ల రూపాయల ఫండింగ్ వ్యవహారాలు, ఫోన్ కాల్స్, డిజిటల్ ఆధారాలపై దృష్టి సారించిన ఈడీ అధికారులు సునీల్ యాదవ్‌ను ప్రశ్నించారని సమాచారం. శుక్రవారం నాడు జరిగిన మొదటి దఫా విచారణ శనివారం నాడు మరోదఫాగా కొనసాగింది. విచారణ సందర్భంగా ఎ1 ఎర్ర గంగిరెడ్డి, ఎ3 ఉమా శంకర్ రెడ్డిలతో సునీల్ యాదవ్ జరిపిన ఫోన్ సంభాషణలపై ఈడీ అధికారులు ఎక్కువగా ప్రశ్నించినట్లు తెలిసింది. ఉమాశంకర్ రెడ్డితో మాట్లాడిన కాల్ డేటా రికార్డును సునీల్ యాదవ్ ముందు వుంచి వివరాలను రాబట్టినట్లు తెలిసింది. సాంకేతిక సాక్ష్యాలుగా వున్న గూగుల్ టెక్ అవుట్‌ను కూడా అతని ముందు ఈడీ అధికారులు వుంచినట్లు తెలిసింది. వివేకానంద రెడ్డి హత్య జరిగిన సమయంలో ఎక్కడ వున్నావని ఈడీ అధికారులు అడిగిన ప్రశ్నలకు అతను సమాధానం ఇచ్చేందుకు కొంత తడబడినట్లు తెలిసింది. ఆ సమయంలో తాను ఇంట్లోనే వున్నానని అతను చెప్పినట్లు తెలిసింది. ఈడీకి తాను ఇచ్చిన వాంగ్మూలం కారణంగా వైకాపా నేతల నుంచి తనకు ప్రాణహాని వుందని సునీల్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివేకానంద హత్య వెనుక గల ఆర్థిక లావాదేవీల నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ఈడీ మరింత లోతుగా విచారించేందుకు ఈ కేసులో నిందితులుగా వున్న వారిని వరుసగా విచారిస్తోంది. ఇందుకు సంబంధించి కడప ఎంపి అవినాష్ రెడ్డితో పాటు ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్ ఇళ్లలో ఈడీ అధికారులు ఇటీవలే ఏకకాలంలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు జప్తు చేయడం సంచలనం రేపింది. హైదరాబాద్‌లోని అవినాష్ రెడ్డి ఇంట్లోనూ ఈ సోదాలు జరిగాయి. ఇదే సమయంలో ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి కూడా విచారించి పలు అంశాలపై వివరాలు రాబట్టారు.



సూర్యుడు భూమధ్య రేఖను దాటుతున్న సందర్భంగా నాసా విడుదల చేసిన ఫొటో

# భూమధ్య రేఖను దాటిన సూర్యుడు!

## మొదలైన ఈక్వినాక్స్..

## భూగోళంపై అరుదైన ఘటన ఆవిష్కృతం

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** భూగోళంపై మరో అరుదైన సంఘటన ఆవిష్కృతమయ్యింది. సూర్యుడు గురువారం భూమధ్య రేఖను దాటాడు. దీనిని సాంకేతికంగా ఈక్వినాక్స్ లేదా సెప్టెంబరు ఈక్వినాక్స్ అని పిలుస్తారు. మన దేశంలో దీనిని శరదృతువు విషువత్‌గా పిలుస్తారు. ఈ అద్భుతం కారణంగా ఉత్తర గోళార్థంలో కాలం మారుతుంది. నాసా ఖగోళ లెక్కల ప్రకారం భారత్‌లో ఈ సంఘటన గురువారం నాడు జరిగింది. కొన్ని చోట్ల ఉదయం ఆరు గంటలకు మరికొన్ని చోట్ల సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇది జరిగింది. ఈ సమయంలో సూర్యుడి కేంద్ర భాగం భూమధ్య రేఖను ఉత్తరం నుంచి దక్షిణానికి దాటుతుంది. ఏడాదిలో రెండుసార్లు మాత్రమే ఈ అద్భుతం జరుగుతుంటుంది. మొదటిది మార్చి నెలలో జరగగా రెండవది సెప్టెంబరు నెలలో. ఈక్వినాక్స్ గురువారం నాడు చోటు చేసుకుంది. ఈక్వినాక్స్ అనే పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. దీని అర్థం సమానమైన రోజు లేదా రాత్రి అని చెబుతారు. ఈ రోజున పగలు, రాత్రి దాదాపు సమానంగా వుంటుందని చెబుతారు. భూమి తన అక్షంపై సుమారు 23.5 డిగ్రీల కోణంలో వంగి సూర్యుడి చుట్టూ తిరుగుతుంటుంది. ఈక్వినాక్స్ సమయంలో భూగోళం సూర్యుడి వైపు ఎక్కువగా వుంగి వుండదు. దీనివల్ల సూర్యరశ్మి భూమిపై రెండు వైపులా సమానంగా పడుతుంది. మార్చిలో ఎండాకాలం మొదలైన తరువాత ఇందులో మార్పులు వస్తాయి. సెప్టెంబరులో ఈక్వినాక్స్ ఏర్పడిన తరువాత ఉత్తరార్థ గోళంలో సూర్యరశ్మి క్రమంగా తగ్గుతుంటుంది. అంటే ఇప్పటి నుంచి పగటివేళలు తక్కువగా రాత్రి వేళలు ఎక్కువగా వుంటాయి. ఇది వచ్చే డిసెంబరు నెలలో మరింత ఎక్కువవుతుంది. ఈ నెలలోనే అతి తక్కువ పగలు వుండే రోజు వుంటుంది. ఇక ఈక్వినాక్స్ రావడం వల్ల భారతదేశంలో చలికాలం మొదలవుతుందని సంకేతంగా చెబుతారు. సూర్యుడి గమనంలో మార్పులు ఉతండడం ఇందుకు ఒక కారణం.

# యుపి పర్యటనలో హోంమంత్రి అమిత్‌షా



# 'భారత్ బ్రహ్మోస్'తో పాక్ నిద్రకు దూరం

**గ్రేటర్‌నోయిడా, సెప్టెంబరు 25:** బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు నిద్ర పట్టనివ్వటం లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా బ్రహ్మోస్ క్షిపణుల ధాటికి భారత్ ముందు పాకిస్థాన్ మోకరిల్లాల్సి వచ్చిందన్నారు. శుక్రవారం, అంతర్జాతీయ ట్రేడ్ షో నాల్గో ఎడిషన్‌ను కేంద్ర హోం మంత్రి గ్రేటర్ నొయిడాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో రక్షణ ఉత్పత్తుల తయారీ భారీగా పెరిగిందని అమిత్ షా చెప్పారు. 80దేశాలకు మన రక్షణ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నట్లు తెలిపారు. అమేథీలో తయారైన ఏకే203 అసాల్ట్ రైఫిల్స్ ఉగ్రవాదుల భరతం పడుతున్నాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో ఉన్న రాజకీయ స్థిరత్వాన్ని అమిత్ షా కొనియాడారు. వరుసగా మూడు పర్యాయాలు ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న మోడీ, విధానాలను రూపొందించడమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో అమలు అయ్యేలా చూశారని చెప్పారు. అందువల్లే భారత్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారిందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, భారత్ తన వృద్ధి రేటును నిలబెట్టుకోవడమే కాకుండా దానిని మరింత వేగవంతం చేసిందని షా అన్నారు. 2047ఆగస్టు 15 నాటికి భారత్ అన్ని రంగాల్లో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందన్న మోడీ సంకల్పం నిజమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మాఫియాపై ఉక్కుపాదం మోపిందని అమిత్ షా ఉద్ఘాటించారు. మాఫియా శక్తులను తుడిచిపెట్టడానికి ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని నొక్కి చెప్పారు. ఆపై, రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. 2017లో బీజేపీ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ఆయన గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో ఉపాధి, స్థానిక తయారీ రంగంపై వన్‌డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ ఓడీవోపీ పథకం ప్రభావాన్ని కూడా అమిత్ షా ప్రముఖంగా ప్రస్తావించారు. ఒకప్పుడు ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. అయితే వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమం వల్ల యూపీ యువత తమ సొంత రాష్ట్రంలోనే ఉద్యోగాలు పొందుతున్నారు. రాష్ట్ర ఉత్పత్తులను, తయారీదారులను మరింతగా ప్రోత్సహించేందుకు ఓడీఓపీ వెబ్‌సైట్‌ను ప్రారంభించాం. దీని ద్వారా వ్యాపార, ఉత్పత్తి కార్యకలాపాలను సులభతరం చేయడంతో పాటు, ప్రపంచానికి రాష్ట్ర గుర్తింపును చాటుకోవడానికి సహాయపడుతుందని అమిత్‌షా తెలిపారు.

వార్త

అతిగా జాగ్రత్తపడడం దౌర్భాగ్యుని లక్షణమైతే, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం అవివేకి లక్షణం.

- సెసిల్

# 'సిఇసి' నిర్ణయాల తకరారు!

సర్వకాల సర్వావస్థలయందు అన్నీ నేనే అనే అధిపతులుంటే ఆ వ్యవస్థలు ఎలా రోడ్డునపడతాయో తాజాగా జరిగిన ఒక ఉదంతాన్ని చెప్పుకోవాలి. నిన్న మొన్నటి వరకు అన్నీ తానై, నిర్ణయాలకు తోడై 'సర్' తెచ్చిపెట్టిన అపవాదులన్నీ భరిస్తూ వచ్చిన కేంద్రప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఈసారి తనదైన నిర్ణయాలతో చిక్కుల్లో పడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషన్ అనేది ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ. రాజ్యాంగ విధులను నిర్వర్తిస్తూ దేశ ప్రతిష్ఠను కాపాడాల్సిన ముగ్గురు సభ్యుల వ్యవస్థ. అందరికీ సమాన అధికారాలుండే కమిషనర్ల వ్యవస్థ. ఏ నిర్ణయమైనా సమష్టిగా నిర్ణయించి తీసుకోవాల్సి ఉండగా గత మూడు నెలల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మిగిలిన ఇద్దరు కమిషనర్లను పక్కనపెట్టి 'సర్వాధికారి' పాత్ర వహించడంతో కమిషన్‌లో చిచ్చు ఏర్పడింది. నిన్నమొన్నటి వరకు సిఇసి బయట నుంచి వచ్చే ఆరోపణలను మాత్రమే ఎదుర్కొనేందుకు సమయాత్తమై ఉండేది. ఇప్పుడా సంస్థ ప్రధాన కమిషనర్ లోపలి నుంచి కూడా సమస్యలనెదుర్కొంటున్నారు. ఆయనను అర్జెంట్‌గా తొలగించాలని అరెస్టు చేయాలని పశ్చిమ బెంగాల్ అధినేత్రి మమతా బెనర్జీ డిమాండ్ చేస్తుంటే, ఐదు వామపక్షపార్టీలు కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి ఆయనకు ఉద్వాసన పలకాలని కోరుతున్నాయి. జ్ఞానేశ్వర్ ఆది నుంచీ వివాదాస్పదుని గానే పేరు పడ్డారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ప్రారంభంలోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలపై ఒంటికాలిపై లేచారు. తాజాగా ఆయన రాజీనామా కోరుతూ శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన వ్రతం చేపట్టాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది కూడా. సాధారణంగా ఇలాంటి రాజ్యాంగ సంస్థల్లో అంతర్గతంగా జరిగే విషయాలు బయటకు రావు. ఎందుకో మిగితా ఇద్దరు కమిషనర్లు సుఖబీర్‌సింగ్, వివేక్ జోషి 14సార్లు జ్ఞానేశ్ నిర్ణయాలకు అభ్యంతరాలు చెప్పారు. అయినా కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా 'అంతా నేనే'నన్నట్లు వ్యవహరించడంతోనే అసలు చిక్కొచ్చిపడింది. ఇప్పుడు అన్నివేళ్లూ ఆయనకేసే చూపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి ఇది ఊహించని తలనొప్పి. సిఇసిని తొలగించాడమంటే ప్రభుత్వ ప్రతిష్ఠతో కూడిన వ్యవహారం. ఇంతవరకు దేశంలో సిఇసి స్థాయి అధికారి అభిశంసనేదీ జరుగలేదు కానీ సిఇసిగా జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని ఏప్రిల్‌లో విపక్షాలు ఉభయ సభలలో అభిశంసన తీర్మానాలను ఇచ్చాయి. అప్పట్లో వాటిని సభలో స్పీకర్ తిరస్కరించగా రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. మరోసారి అభిశంసన నోటీసు వచ్చే ప్రయత్నంలో విపక్షాలు ఉన్నాయి. మరోపక్క కాక్రోచ్ జనతా పార్టీ కూడా 48 గంటల్లో జ్ఞానేశ్ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్' వద్ద నిరసన దీక్ష చేపడతామంటోంది.

రాహుల్‌గాంధీ అయితే సిఇసి వ్యవస్థను కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ధ్వంసం చేశారని, దేశవ్యాప్తంగా 12 కోట్ల ఓటర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించి, వారికి ఓటు హక్కు లేకుండా చేశారనిదుయ్యబడ్తున్నారు. నిజానికి ఎవరు ఏ ఉద్దేశంతో 'సర్' విధాన రూపకల్పన చేసినా ఎన్నో తకరారులు బయటకువచ్చాయి. అన్ని రాజకీయ పార్టీలూ ఈవిధానాన్ని ఎండగట్టాయి. ఓటర్లహక్కులను తొలగించే విధానం రాజ్యాంగ బద్ధ విధానంకావని ఘోషిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకే తూట్లు పొడిచే విధంగా 'సర్' పేరిట భారతీయులకు ఓటుహక్కు లేకుండా చేయడం ప్రపంచ దేశాల్లో మనదేశ ప్రజల్ని చులకన చేయడమే. కొత్త ఓటర్ల నమోదు సమయంలో ఫారం-6కు అదనంగా అనుబంధ డిక్లరేషన్‌ను పూర్తి చేయాలన్న నిబంధనపై కూడా ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. ఈసిఐ నెట్‌కు సైబర్ భద్రతను కల్పించేందుకే ఇలాంటిమార్పులు జరిగినట్లు ఇ.సి చెబుతున్నప్పటికీ రాజకీయపార్టీలు వ్యతిరేకించడానికి కారణమైంది. గోవా ఓటర్ల జాబితాలో 97 మంది అర్హులైన ఓటర్లు గల్లంతు కావడాన్ని కాంగ్రెస్‌నేత, పార్లమెంటు సభ్యుడు శశిథరూర్ కేంద్ర ఎన్నికలసంఘం కార్యాచరణపై ధ్వజమెత్తారు. సిఇసి భారత్ పౌరుల రాజ్యాంగ హక్కులను కాలరాయడం పద్ధతి కాదని, ఎన్నికల కమిషన్ దేశానికి క్షమాపణలు చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. బాహ్యంగానూ, అంతర్గతంగానూ ఎన్నికల కమిషన్ సమస్యలనెదుర్కొంటున్న కేంద్ర ఎన్నికల కమిషన్ వ్యవహారాల్లో పారదర్శకత లోపించిందని అందరూ అనుకుంటున్నమాట. ఫారం-6కి అనుబంధంగా తీసుకొచ్చిన డిక్లరేషన్‌లోని అంశాలపై అభ్యంతరంవచ్చిన సందర్భంలో 1960 నాటి చట్టంలోని ఓటర్ల నమోదు నిబంధనలకు సవరణ చేయకుండా ఆత్మబంధువుల 'సర్' వివరాలను కోరడం చట్టవిరుద్ధం. అనధికారమని మిగితా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన సందర్భంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ పట్టించుకోకపోవడమేమూకుమ్మడి విమర్శలకు కేంద్రస్థానం అయింది. ఇలాంటి ఆన్‌లైన్ దరఖాస్తు రూపకల్పనలో 'తకరారు'ను సరిదిద్దడానికి ఏకస్థులై ముందుకు వెళ్లలేకపోయారు. అంటే ఎక్కడో భావసారూప్యం లేని పరిస్థితి ఎదురైనందునే ఎన్నికల కమిషన్ 'క్రాస్ రోడ్స్'లో నిలబెట్టాల్సి వచ్చింది. మరోపక్క స్వతంత్ర ఇసిని ఏ రాజకీయ పార్టీ కూడా ఇష్టపడదనే వ్యాఖ్య సిఇసి కమిషనర్ల ప్యానెల్ నుంచి భారత్ ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్రం తెచ్చిన చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్‌లపై ధర్మాసనం ఎదుటజరుగుతున్న చర్చల్లో జస్టిస్ దీపాంకర్ దత్తా నుంచి వినవచ్చింది. కేంద్ర ఎన్నికల కమిషన్‌లో వచ్చిన పొరపొచ్చాలను, నిర్ణయాలను సరిచేసి 'ఓటు హక్కు'కు పట్టాభిషేకం చేయగల బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉంది. అలా జరిగినప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుంది.



నీతిలేని వాణిజ్యం, కృషిలేని సంపద, శీలంలేని విద్య, త్యాగంలేని ఆరాధన, మానవతలేని శాస్త్రవిజ్ఞానం ఇవి సామాజిక దురాచారాలు.

మహాత్మా గాంధీ



మానవ జీవితంలో ఏదీ స్థిరమైనది కాదు. కనుక సంపద వచ్చినప్పుడు పొంగిపోవటం, బాధలలో కృంగిపోవడం తగదు.

సోక్రటీస్

## ప్రజావాక్కు



### పెరిగిన బిర్యానీ హోటళ్ల సంఖ్య

తెలుగు రాష్ట్రాల్లోని అనేక పట్టణాలు, నగరాలలో భోజన హోటళ్లకంటే బిర్యానీ హోటళ్ళుపెరిగిపోయాయి. తెలుగింటి సాత్త్విక భోజన హోటళ్ళను వెతుక్కునే పరిస్థితి ఏర్పడింది. తెలుగింటి భోజనం అంటే కూర, పప్పు, రోటి పచ్చడి, దినుసుల పొడులు, కాస్త నెయ్యి, పులుసు లేదా చారు, మజ్జిగ. ఇదే సాధారణ తెలుగువ్యక్తి ఆచరించే పూర్తి భోజన విధానం. అన్ని రకాల పోషకాలు లభించే చక్కని భోజనం. ఇప్పుడు అన్నీకలగలిపి దిట్టంగా మసాలాలు వేసిఘాటుగా, కారంగాబిర్యానీ వండేస్తున్నారు. శాకాహార లేదా మాంసాహార బిర్యానీ ఏదైనా ఒకటే పదార్థంగా మరో పదార్థం లేకుండా అదే అధికంగా వేసుకుని తింటే అదివిపరీతమై ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అధిక రక్తపోటు, మధుమేహం వంటివే కాక జీర్ణకోశ సమస్యలు తలెత్తే అవకాశంఉంది. ఆన్‌లైన్ అమ్మకాలలో బిర్యానీదే ప్రథమ స్థానంఅంటే మనం అర్థంచేసుకోవచ్చు.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ

ఇటీవల సుప్రీం కోర్టు చాలా అవసరం. అయినా తీర్పు ఇచ్చింది పౌరుల మనోభావాలు లేదా వారికున్న స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను కాపాడానికి తమస్వీయ నిర్ణయాధికారంకు మరింత వెలుగు తెచ్చే తీర్పు అది. 1986లో వచ్చిన బిజు మన్యుయేల్ కేసులో వచ్చిన తీర్పును సమర్థిస్తూ చేసినవాక్యానం చాలా అవసరమైంది. పాలకుల దృష్టి ఎప్పుడు మతం కులం చుట్టూ కాకుండా ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ వైపులేదా రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ ఇచ్చి అందరితో కలిసి అందరి అభివృద్ధి అనే సూత్రీకరణ వైపు సాగాల్సిన అవసరం ఉంది. అందులో ముఖ్యంగా వెదురు పెంపకం మీదదృష్టి పెట్టాలి. హార్టికల్చర్ అయినా వేదురు అయినా ఇంకాఏమి అయినా చేసినగ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ ఎల్‌నినో ముప్పు ఉంది.

- భారత అవినాష్, జనగామ

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల భవనాలు దాదాపుగా ఆధునీకరించబడినవి. ఏ ప్రభుత్వ కార్యాలయం అయినా మార్పులు చేసేటప్పుడు ప్రధానంగా పారిశుధ్యపు వసతి, నీటి సరఫరా, విద్యుత్ కలిపే చేస్తారు. మరిమహిళలకు ఒకటివేరేగా వాష్‌రూమ్ ఉంటేనే మహిళ సిబ్బంది, విద్యార్థినీలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

- ఎన్.రామలక్ష్మి, హైదరాబాద్

### టీటీడీ సేవలు అమోఘం

తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు అందిస్తున్న సేవలు నిజంగా అభినందనీయం. నిత్య అన్నదానం ద్వారా దేశం నలుమూలల నుంచివచ్చే భక్తులఆకలి తీర్చుతూ, సేవాభావాన్ని చాటుతోంది. తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంతో పాటు, ఆలయం వెలుపల, చుట్టుపక్కల భక్తుల సౌకర్యార్థం అనేకప్రాంతాల్లో ఉచిత అన్నప్రసాద వితరణ, అల్పాహార కౌంటర్లను ఏర్పాటు చేసింది. దర్శనం కోసం కంపార్ట్‌మెంట్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తులవద్దకే సిబ్బంది వచ్చిఉచితంగా అల్పాహారం, భోజనం, పాలు, కాఫీ, టీ అందిస్తున్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు మెట్లమార్గం, నడకమార్గంలో కూడాఅన్నప్రసాదం, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి ప్రయాణాన్ని సులభతరం చేస్తున్నారు. ఆకలితో ఉన్న భక్తులకు ఆహారం అందించడం ఎంతో గొప్ప సేవ. భక్తుల అవసరాలను గుర్తించి ఇంతటి సేవలను అందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు, సిబ్బంది, సేవకులసేవాభావం అభినందనీయం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### పేరుకే ప్రభుత్వ ఆస్పత్రులు!

దేశంలోని ప్రభుత్వాలు ఎలా ఉన్నాయంటే పేరుకే ప్రభుత్వ ఆస్పత్రులు వసతులు, సేవలు సరిగ్గా ఉండవు. కానీ నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల సేవలు అందుబాటులో ఉన్నాయంటారు నాయకులు. కానీ వాళ్లు వెళ్లరు మళ్ళీ చూడరుఅటువైపు. చిన్నచిన్న జబ్బులకుకూడా ఖరీదైన ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తారు. ఎందుకంటేవాళ్లకే ప్రభుత్వ ఆసుపత్రుల పైననమ్మకం లేదు. ప్రభుత్వఆస్పత్రులపైన మనమేమో ప్రాణాలు పోయినా ఫర్వాలేదు. ప్రభుత్వ దవాఖానాలు అంటాం. నాయకులురెండురోజులు ఉంటేకదా ఆస్పత్రులు ఎలా ఉంటాయి. సేవలు ఎలా ఉన్నాయి అని తెలిసేది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### మద్యం దుకాణాలను ఎత్తివేయాలి

తమిళనాడు ప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్నమద్యం దుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడాపరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది.

- కె.రామారావు, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# కర్షకులకు ఎల్‌నినో కష్టాలు

**విశ్వాసం వ్యక్తికి అద్భుతమైన ఉత్తేజాన్ని ఇస్తుంది. కార్యోన్ముఖున్ని చేస్తుంది. ఎన్ని అపజయాలు ఎదురైనా, మరెన్ని ఎదురుదెబ్బలు తగిలినా విశ్వాసం ఉన్న వ్యక్తి తొణకడు, బెదరడు. ముందుకు సాగిపోతూనే ఉంటాడు. అదే వ్యక్తికి విశ్వాసం సన్నగిల్లితే ఏ చిన్న ఎదురుదెబ్బ తగిలినా తట్టుకోలేడు. తనకుతానుగా సమిధైపోతాడు. అందుకే మానవ జీవన పోరాటంలో విశ్వాసం అనేది ఎంతో ముఖ్యమైనది. ఆ విశ్వాసం దెబ్బతినే తమను ఆదుకునేవారు లేరనే నిరాశానిస్పృహలతో తమలోతాము కృంగికృశించి, మరో గత్యంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగా వారిలో ఆత్మవిశ్వాసం పెంచాలి. మరొకపక్క వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు త్రికరణశుద్ధిగా చర్యలు చేపట్టాలి. సాంకేతికంగా మరేఇతర రంగాల్లో ఎంత అభివృద్ధి సాధించినా మనిషి జీవనానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావాల్సిన ఆహారం ఆ రైతుల 'చెమట' పుణ్యమేనని గుర్తుంచుకోవాలి.**

దామెర్ల సాయిబాబ

తమలపాకుతో నువ్విట్లంటే తలుపు చెక్కతో నేనట్లంటా అన్నట్టుగా వ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి. పర్యావరణానికి మానవుడు చేస్తున్న విధ్వంసానికి రెట్టింపు స్థాయిలో ప్రకృతి మానవజాతిపై విరుచుకుపడుతున్నది. రుతుపవనాలు గతి తప్పుతున్నాయి. అకాలవర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. తాజాగా ఏర్పడిన సూపర్ ఎల్‌నినోతో గత ఒకటిన్నర దశాబ్దాలుగా ఎదుర్కొనని తీవ్ర కరవు పరిస్థితులను భారత్ నేడు ఎదుర్కొంటున్నది. ఉత్తరభారత దేశంలో ఇప్పటివరకు వర్షపాతం లోటు పదిహేను శాతం మాత్రమే అయినా దక్షిణ భారత్‌లో అత్యంత తీవ్రంగా ప్రభావితమై దాదాపు ఇరవైఎనిమిది శాతంపైగా లోటును నమోదు చేసుకున్నది. అందులోనూ దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అత్యధికంగా నలభైశాతం లోటుతో దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఆ తర్వాత స్థానాల్లో కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాలున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఈసారి తెలుగు రాష్ట్రాల్లో కరవు రక్కసి విలయతాండవం చేయబోతున్నదనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. తొలకరిలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు విత్తిన మెట్టపంటలు బావుల కింద వేసిన వరినాట్లు నీటికోసం నోరెళ్లబెడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ముగిసిపోయినా ఏదో కొన్ని ప్రాంతాలే తప్ప మిగిలిన ప్రాంతాలన్నీ కరవు ఛాయలతో అలమటిస్తున్నాయి. సాగునీటి సంగతి దేవుడెరుగు. మంచినీటికి కూడా కటకటలాడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మబ్బులు చూసి ముంతలో నీళ్లు పారబోసుకున్నట్లు ముందుగా పడిన చిరుజల్లులకు ఆశపడి తలతాకట్టుపెట్టి సాగు చేసిన పంట కళ్లముందే ఎండిపోతుండడంతో అన్నదాతల ఆవేదనలకు అంతేలేకుండా పోతున్నది. మెట్టపంటల రైతులే కాదు ప్రాజెక్టుల కింద ఉన్న రైతుల పరిస్థితి కూడా ఆందోళనకరమే. ఖరీఫ్‌లో పంటలు పూర్తిగా వేయలేకపోయారు. కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాల్సిన తరుణంలో కూడా నీటి కోసం కటకటలాడాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. 1918-19 కృష్ణాబేసిన్‌లో అతి తక్కువగా వెయ్యి టిఎంసిలు లభ్యం కాగా ఈ యేడాది ఆమాత్రం నీటి లభ్యత ఉంటుందో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు కారణాలు ఎన్నో ఉన్నాయి. మొన్న సోమవారం జూరాల కింద రైతులు తమ పంటలను కాపాడమని కోరుకుంటూ రోడ్లెక్కిప్రాజెక్టుల వద్దకు వెళ్లి నేరుగా గేట్లులేపారు. పోలీసులు రంగప్రవేశం చేసి లాఠీచార్జీ చేయాల్సి వచ్చింది. అయితే ఉన్న కొద్దిపాటి నీరును సాగునీరుకు ఇస్తే తాగునీటి పరిస్థితి ఎలా ఎదుర్కోవాలనేది అధికారంలో ఉన్న పెద్దల ఆలోచన. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు రావడం, కర్ణాటక ప్రభుత్వం నీరు విడుదల చేసేందుకు అంగీకరించడంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారం అయింది. ఇక భూగర్భ జలాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రోజురోజుకు అడుగంటిపో తున్నాయి. ఎల్‌నినో ప్రభావ పరిస్థితులను ఎదుర్కోనేందుకు ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లాలని పాలక పెద్దలుచేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. రాజకీయ పార్టీలు రైతుల జీవితాలతో ఆడుకుంటున్నాయనే ఆరో పణలను కొట్టివేయలేం. ఈ పార్టీ, ఆపార్టీ అని కాదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులపై ఒలకబోసిన ప్రేమ, అధికారం రాగానే మరిచిపోతున్నారు. అలాగేకాంగ్రెస్ రైతు, బిఆర్‌ఎస్ రైతు, బిజెపి రైతు, కమ్యూనిస్టు రైతు అంటూ రైతులను వివిధ పార్టీల అనుబంధ శాఖల పేర్లతో

## ఒక్క మాట

సన్నకారు, చిన్నకారు, మధ్యకారు అంటూ రైతులను విభజించి పాలిస్తున్నారు. వారిగోడు అరణ్యరోదనగా మిగిలిపోతున్నది. ఉత్పత్తులను ప్రభుత్వం ప్రకటించిన కనీసమద్దతు ధరలకు అమ్ముకోవడం కూడా గగనమైపోతున్నది. మార్కెట్ మాయాజాలంలో దళారుల హస్తలాఘవంతో రైతులు కుదేలైపోతున్నారు. ఒకనాడు వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నామని గర్వంగా చెప్పుకునే రైతులు నేడు తాము వ్యవసాయ దారులమని చెప్పుకోవడానికే సిగ్గుపడుతున్నారు. వ్యవసా యం కాక మరేదైనా జీవనవిధానం దొరికితే చిన్న రైతుల నుంచి, పెద్ద భూస్వాముల వరకు పల్లెలను, వ్యవసాయాన్ని వదిలిపెట్టి పట్టణాలకు తరలిపోవడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే లక్షలాది మందిరైతులు నగరాల బాటపట్టారు. వ్యవసాయరంగం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్నది. ఈ తీవ్ర కరవులో పశువులను కాపాడుకునేందుకు సకల అవస్థలుపడుతున్నారు. ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. మొన్న పత్తిరైతులు, నిన్న మిర్చిరైతు, వేరుశనగ రైతు అలా అన్ని పంటల రైతులు ఈ మారణ హోమంలో బలైపోతున్నారు. రైతులంటే సంపన్నులని, ఫ్యూడల్ వ్యవస్థకు పట్టుగొమ్మలని ఇతరుల కష్టాలతో సుఖా లను అనుభవించే స్వార్థపరులని కొందరు నగరవాసుల్లో అభిప్రాయం ఉంది. అలా కొద్దిమంది ఉండొచ్చు. వారిని దృష్టిలో ఉంచుకొని మొత్తం రైతాంగంపై ఇలాంటి వ్యాఖ్యానాలు చేయడం దురదృష్టకరం. ఆత్మహత్యలకు పాల్పడు తున్న అధికశాతం రైతుల్లో చిన్నకారు, హరిజన, గిరిజన, వెనుబడిన వర్గాల రైతులే ఎక్కువగా ఉన్నారు. పేదరిక నిర్మూలనకు వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఉపాధి హామీ పథకం అంటూ కోట్లాది రూపాయలు గుమ్మ రిస్తున్నారు. జనాకర్షణ పథకాలపై పెడుతున్న కోట్లాది రూపాయల ప్రజాధనంపై లెక్కే ఉండదు.

ఇన్నేళ్లుగా ఇంత చేస్తున్నా రైతుల పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. ప్రభుత్వ విధానాల్లోనే మార్పులు రావాలి. పేదరికం అంతం కావాలంటే భారత్ లాంటి దేశాలు తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సిన అవసరంఉందని ఏనాడో ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నివేదికలో స్పష్టంచేసింది. మార్కెట్ ఆధారిత సంస్కరణల పేరుతో అనుసరించిన వ్యూహాలు పనిచేయడం లేదని, వాటి స్థితిగతుల ఫలితాలు ఇవ్వలేదని ప్రపంచబ్యాంకు గతంలో అంగీకరించింది. పేదరికనిర్మూలన కార్యక్రమాలకు కొత్త ఊపు ఇవ్వాలంటే వ్యూహాన్ని పునర్నిర్వచించుకోవాలని కోరింది. పేదలు తమ జీవితాన్ని మెరుగుపరచడానికి ఇప్పుడున్న పరిస్థితులు సరిపోవడం లేదని, భారత్ అభివృద్ధికి వ్యవసాయరంగమే ప్రధాన వనరనిస్పష్టం చేసింది. గ్రామీణ భారతంలో పేదల ఆర్థిక పరిస్థితికి వ్యవసాయోత్పత్తుల పెరుగుదలే కీలకమని స్పష్టంచేసింది. ఇప్పటికైనా ఈ వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. ముఖ్యంగా గ్రామీణంలో రైతులను దృష్టిలోఉంచుకొని పథకాలురూపొందించాలి. వారికి రాయితీలు, సబ్సిడీలు అక్కర్లేదు. వ్యవసాయం మీదనే ఆధారపడి జీవించేవారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచే విధంగా విధానాలు రూపొందించాలి. ప్రస్తుతం సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొని కరవు రక్కసిని శాశ్వతంగా పారద్రోలేందుకు ముందు చూపుతో పటిష్టమైన ప్రణాళికలతో అడుగులు పడాలి. తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి లాంటి జీవన నదులతో పాటు దాదాపు నలభై చిన్న, చితక నదులు ఉన్నాయి. కోట్లాది ఎకరాల సస్యశ్యామలం చేసే వేలాది టిఎంసిల నీరు నిరుపయోగంగా యేటా సముద్రం పాలవుతూనే ఉంది. రాజకీయాలకు అతీతంగా నీటికి అడ్డుకట్టలు వేసి బీడుభూములకు మళ్లించగలిగితే శాశ్వతంగా ఈ కరవు రక్కసిని తెలుగు రాష్ట్రాల నుంచి పారద్రోలగలుగుతాం. చివరిగా ఒక్కమాట విశ్వాసం వ్యక్తికి అద్భుతమైన ఉత్తేజాన్ని ఇస్తుంది. కార్యోన్ముఖున్ని చేస్తుంది. ఎన్ని అపజయాలు ఎదురైనా, మరెన్ని ఎదురుదెబ్బలు తగిలినా విశ్వాసం ఉన్న వ్యక్తి తొణకడు, బెదరడు. ముందుకు సాగిపోతూనే ఉంటాడు. అదే వ్యక్తికి విశ్వాసం సన్నగిల్లితే ఏ చిన్న ఎదురుదెబ్బ తగిలినా తట్టుకోలేడు. తనకుతానుగా సమిధైపోతాడు. అందుకే మానవ జీవన పోరాటంలో విశ్వాసం అనేది ఎంతో ముఖ్యమైనది. ఆ విశ్వాసం దెబ్బతినే తమను ఆదుకునేవారు లేరనే నిరాశానిస్పృహలతో తమలోతాము కృంగికృశించి, మరో గత్యంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగా వారిలో ఆత్మవిశ్వాసం పెంచాలి. మరొకపక్క వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు త్రికరణశుద్ధిగా చర్యలు చేపట్టాలి. సాంకేతికంగా మరే ఇతర రంగాల్లో ఎంత అభివృద్ధి సాధించినా మనిషి జీవనానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావాల్సిన ఆహారం ఆ రైతుల 'చెమట' పుణ్యమేనని గుర్తుంచుకోవాలి. ●

# పర్యావరణ పరిరక్షణతో ప్రజారోగ్య భద్రత

బుర్ర మధుసూదన్ రెడ్డి

ఐరాస లాంటి పలు అంతర్జాతీయ సంస్థలు నిర్వహించే అతి పెద్ద కార్యక్రమాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణ యజ్ఞాన్ని నిరంతరం కొనసాగుతూ మనకు హెచ్చరికలు చేస్తూ వస్తున్నది. పర్యావరణ ఆరోగ్యమే సకల జీవకోటికి సౌభాగ్యమని తెలుసుకొని మన జీవనశైలిని హరిత ఆలోచనల వైపు మళ్లిస్తేనే పర్యావరణ కాలుష్యం తగ్గిపోయిమనకే కాకుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్య గొడుగులు పడతాయి. పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణాలుగా అనాలోచిత సాగు పద్ధతులు, మైనింగ్, ఆటోమొబైల్ ఉద్గారాలు, శిలాజ ఇంధనాల ఉద్గారాలు, అటవీ కార్చిచ్చులు, రేడియోధార్మిక పదార్థాలు, మురుగు నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామికీకరణ, రవాణా, పట్టణీకరణ, భూతాపం, అడవుల నరికివేత, నిర్మాణ రంగం లాంటి అవాంఛనీయ అంశాలు నిలుస్తున్నాయి. పర్యావరణ కాలుష్యం ఫలితంగా మానవాళి/ప్రాణకోటి అనారోగ్యాలు, జీవ వైవిధ్యానికివిఘాతాలు, వాతావరణ మార్పులు, ఆర్థిక ప్రతికూలతలు, సామాజిక ప్రభావాలు లాంటి పలు దుష్ప్రభాలు కలుగుతున్నాయి. వివిధ రకాల కాలుష్యాల్లో గాలి, నేల, నీటి, శబ్ద, రేడియోధార్మిక, దుమ్ము, ఉష్ణ, విషవాయు, సముద్ర, కాంతి కాలుష్యాలు ప్రధానమైనవని మనకు తెలుసు. 26 సెప్టెంబర్ 2026న ప్రపంచవ్యాప్తంగా2011 నుంచి మానవాళి ఘనంగా నిర్వహించుకునే ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం (వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ డే)" నిర్వహించుకునే వేళ 2026 ఇతివృత్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం సామాజిక ఆరోగ్య సాధనలో వైజ్ఞానిక శాస్త్ర పరిజ్ఞానం (ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ స్టాండింగ్ విత్ సైన్స్ టు ప్రొటెక్ట్ కమ్యూనిటీస్)" అనబడే అంశాన్ని తీసుకున్నారు. మానవాళి ఆరోగ్య పరిరక్షణతో పాటు శ్రేయస్సు కల్పనకు గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, వాతావరణ ప్రతికూల మార్పులను తగ్గించడం, శ్వాసకోశ సంబంధ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండడం కొనసాగాలి. గాలి, నేల, జల కాలుష్యాలకు ప్రధాన ప్రమాదకర కారణంగా నిలుస్తున్న ప్లాస్టిక్ కాలుష్యంతో భూమాత ఊపిరి పీల్చడం కష్టంగా తోస్తున్నది. ప్లాస్టిక్ కాలుష్య కోరల్ని పెకిలించడానికి రీయూజ్, రీసైకిల్, రెఫ్యూజ్, రెడ్యూస్, రీథింక్ అనే నినాదాలకు కార్యరూపం దాల్చడం మాత్రమే మన ముందున్న ఉత్తమ కర్తవ్యం. ప్లాస్టిక్ కాలుష్య దుష్ప్రభావంతో వాతావరణ ప్రతికూల మార్పులు, నేల/ప్రకృతి/జల/జీవ వైవిధ్య సంక్షోభాలు, వ్యర్థాల కాలుష్యం లాంటి ప్రమాదకర సమస్యలు ప్రాణకోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నేడు ధరణిలో నెలకొన్న జల నెలవులు, నేలలు ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం కావడం జరుగుతోంది. నేల లేదా జలాల్లోకి చేరిన ప్లాస్టిక్ జీవ విచ్ఛిన్నం లేదా డీగ్రేడేషన్ కావడానికి వంద ఏండ్లు కూడా పట్టవచ్చని నిపుణులు హెచ్చరించడం గమనార్హం. ఒక పర్యావరణవేత్తకో, పర్యావరణ పరిరక్షణ సంస్థకో సంబంధించిన అంశం కాదని, ఒక రోజుమాత్రమే పాటించి మరిచిపోయే విషయంకాదు. ప్రపంచ పర్యావరణ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా మన జీవన విధానంలో ప్రతి క్షణం పర్యావరణ హితాన్ని కోరుతూ మన జీవన పయనం కొనసాగించాలి. పర్యావరణ కాలుష్యానికి కారణంకాకుండా మన జీవనశైలిని మార్చుకుంటూనే పౌరసమాజంలో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచడం మన కనీస కర్తవ్యంగా భావించాలి. ●

# దేశాభివృద్ధికి మూలం తయారీ రంగం

డి వి బి శ్రీహరిన్

భారత తయారీ రంగం వేగంగా విస్తరిస్తోంది. 2025-26లో వాస్తవ ధరల ప్రకారం తయారీ రంగ స్థూల విలువ జోడింపు (జీవీఏ) 10.7 శాతం పెరిగింది. 2026-27 తొలి త్రైమాసికంలోనూ 9.2 శాతం వృద్ధి నమోదైంది. అయినప్పటికీ దేశ మొత్తం జీవీఏలో తయారీ రంగం వాటా 14.8 శాతమే. ఈ వైరుధ్యం ఒక ముఖ్యమైన ప్రశ్నను ముందుకు తెస్తోంది. తయారీ రంగం వేగంగా పెరుగుతున్నప్పటికీ, అది భారత ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని మార్చేంతగా విస్తరిస్తోందా? వృద్ధి వేగం ఆశాజనకమే. కానీ పారిశ్రామికీకరణను కేవలం ఒకటి రెండు త్రైమాసికాల వృద్ధితో అంచనా వేయలేం. దీర్ఘకాలంలో తయారీ రంగం ఉత్పాదకతను పెంచాలి, పెద్దసంఖ్యలో ఉత్పాదక ఉపాధిని సృష్టించాలి, దేశీయ విలువ జోడింపును పెంచాలి, ప్రపంచ మార్కెట్లలో భారత సంస్థల స్థానాన్ని బలోపేతం చేయాలి. ఈ మార్పులు జరిగినప్పుడే తయారీ వృద్ధి ఆర్థిక నిర్మాణంలో గణనీయమైన మార్పుగా మారుతుంది. ప్రపంచ తయారీలో భారత్‌కు ఇంకా విస్తరించేందుకు పెద్ద అవకాశంఉంది. కొన్ని రంగాల్లో దేశం ఇప్పటికే బలమైన సామర్థ్యాలను నిర్మించుకుంది. వాహనాలు, ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఇంజినీరింగ్ వంటి రంగాల్లో భారత సంస్థలు అంతర్జాతీయ పోటీని ఎదుర్కొంటున్నాయి. కానీ ఈ విజయాలను విస్తృత పారిశ్రామిక పర్యావరణంగా మార్చడం ఇంకా మిగిలే ఉంది. కొద్ది రంగాల్లోని విజయాలు దేశవ్యాప్తంగా తయారీ సామర్థ్యానికి సమానార్థకాలు కావు. తయారీ రంగం ప్రాధాన్యాన్ని దాని జీవీఏ వాటాతో మాత్రమే కొలవడం కూడా సరైంది కాదు. ఒక కర్మాగారం ఉత్పత్తి చేసే వస్తువుతో పాటు రవాణా, గిడ్డంగులు, ఆర్థిక సేవలు, ఇంజినీరింగ్, నిర్వహణ, సాఫ్ట్‌వేర్ వంటి అనేక సేవలకు డిమాండ్‌ను సృష్టిస్తుంది. అందువల్ల బలమైన తయారీ రంగం సేవల రంగానికి ప్రత్యామ్నాయం కాదు. అది సేవల విస్తరణకు కూడా ఆధారంగా మారుతుంది. భారత్‌కు అవసరమైనది తయారీ-సేవల మధ్య ఎంపికకాదు. ఈ రెండు రంగాలను పరస్పరం బలపరిచే ఆర్థిక వ్యవస్థ ఉపాధి కోణంలో ఈ అవసరం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. అధిక నైపుణ్యాలు అవసరమయ్యే సేవల రంగం భారత్‌కు కీలకమే అయినప్పటికీ, పెద్దసంఖ్యలో కార్మికులను ఉత్పాదక ఉపాధిలోకి తీసుకురావడానికి విస్తృత తయారీ రంగం అవసరం. వస్త్రాలు పాదరక్షలు, ఆహార శుద్ధి, ఫర్నిచర్, బొమ్మలు, తేలికపాటి ఇంజినీరింగ్ వంటి శ్రమాధారిత రంగాలు ఈ మార్పుకు ముఖ్యమైన మార్గాలుగా నిలవగలవు. ముఖ్యంగా తక్కువ ఉత్పాదకత కలిగిన అనధికారిక పనులనుంచి మెరుగైన వేతనాలు, నైపుణ్యాలు, సామాజిక భద్రత కలిగిన ఉపాధికి మారేందుకు ఇవిఅవకాశాన్ని కల్పించగలవు. అయితే ఉపాధి సృష్టించాలనే లక్ష్యంతో మాత్రమే తయారీని విస్తరించడం సరిపోదు. ఉత్పాదకత కూడా పెరగాలి. తక్కువ వేతనాల ఆధారంగా మాత్రమే ప్రపంచ మార్కెట్ల



లో పోటీ పడటం దీర్ఘకాలిక వ్యూహం కాదు. సాంకేతికత, నైపుణ్యాలు, నాణ్యత, విశ్వసనీయత, పరిశోధన, ఉత్పత్తి రూపకల్పన వంటి అంశాలే భవిష్యత్తులో భారత తయారీ పోటీతత్వాన్ని నిర్ణయిస్తాయి. ఇక్కడ ప్రపంచ విలువ గొలుసుల్లో భారత భాగస్వామ్యం కీలకమవుతుంది. ఆధునిక తయారీలో ఒక ఉత్పత్తి మొత్తం ఒకే దేశంలో తయారయ్యే పరిస్థితి లేదు. రూపకల్పన ఒక చోట, విడిభాగాల తయారీ మరొకచోట, అసెంబ్లీ ఇంకొకచోట జరగడం సాధారణమే. కాబట్టి ప్రతి విడిభాగాన్ని మొదటి నుంచే దేశంలో తయారు చేయాలనే పట్టుదల కంటే, ప్రపంచ ఉత్పత్తి వ్యవస్థల్లోకి ప్రవేశించి, పరిమాణాన్ని పెంచుకుని, సాంకేతిక సామర్థ్యాన్ని సంపాదించి, క్రమంగా దేశీయ విలువ జోడింపును పెంచుకోవడం మరింత ఆచరణాత్మక మార్గం. అందుకే తయారీ రంగంలో దిగుమతుల పాత్రను కూడా సమతుల్యంగా చూడాలి. దిగుమతి చేసుకున్న మధ్యంతర వస్తువులు భారత సంస్థలకు ప్రపంచ మార్కెట్లలో పోటీ పడేందుకు, ఉత్పత్తి పెంచేందుకు, ఎగుమతులు విస్తరించేందుకు సహాయపడితే అవి పారిశ్రామికీకరణలో ఒక దశగా ఉపయోగపడవచ్చు. అయితే దీర్ఘకాలంలో దేశీయ సరఫరాదారుల సామర్థ్యం సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, అధిక విలువ కలిగిన ఉత్పత్తుల వాటా పెరగాలి. ఇందులో సాంకేతికత పాత్ర నిర్ణాయకం. ఆటోమేషన్, ఖచ్చితమైన ఇంజినీరింగ్, ఆధునిక పదార్థాలు, డిజిటల్ వ్యవస్థలు, కృత్రిమ మేధ, పరిశోధన-అభివృద్ధి వంటి రంగాల్లో సామర్థ్యం పెంచుకోకపోతే భారత్ కేవలం అసెంబ్లీ కేంద్రంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఉత్పత్తులను ఇతరుల రూపకల్పన మేరకు తయారు చేయడం నుంచి సొంత ఉత్పత్తి రూపకల్పన, ఇంజినీరింగ్, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి దిశగాకదలాలి. ఈ మార్పులో సూక్ష్మ చిన్న, మధ్యతరహా సంస్థలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. పెద్ద పరిశ్రమలకు సరఫరాదారులుగా మాత్రమే కాకుండా, సాంకేతికతను స్వీకరించే, ఎగుమతులు చేసే, కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేసే సంస్థలుగా అవి ఎదగాలి. ఇందుకు రుణ సౌకర్యం, ఆధునిక సాంకేతికత, నైపుణ్యాలు, మౌలిక వసతులు, మార్కెట్ ప్రాప్యత వంటి అంశాల్లో అవరోధాలను తగ్గించాలి. పెద్ద సంస్థల చుట్టూ మాత్రమే పారిశ్రామిక వృద్ధి కేంద్రీకృతమైతే దాని ప్రయోజనాలు పరిమితంగానే ఉంటాయి. ప్రభుత్వం అమలుచేస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, పారిశ్రామిక మౌలిక వసతులు, లాజిస్టిక్స్ మెరుగుదల వంటి చర్యలు తయారీకి అనుకూల వాతావరణాన్ని సృష్టించగలవు. కానీ ప్రోత్సాహకాలు ప్రారంభ దశలో సహాయపడతాయి. అంతిమంగా పరిశ్రమలు నిలబడేది ఉత్పాదకత, నాణ్యత, వ్యయ సామర్థ్యం, సాంకేతికత, ఎగుమతి సామర్థ్యాలపైనే. అందువల్ల తయారీ రంగం విజయం అంటే దాని వాటా ఒక నిర్దిష్ట శాతానికి చేరుకోవడం మాత్రమే కాదు. మరిన్ని కర్మాగారాలు రావడం ఒక సూచిక కావచ్చు. కానీ అవి ఎంత ఉపాధిని సృష్టిస్తున్నాయి, ఎంత దేశీయ విలువను జోడిస్తున్నాయి, చిన్న సంస్థలను ఎంతగా అనుసంధానిస్తున్నాయి అన్నదే మరింత ముఖ్యమైనది. 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఈ మార్పు అవసరం. తయారీ రంగం వేగంగా పెరగడం మంచి ప్రారంభం. కానీ ఆ వృద్ధి విస్తృత ఉపాధిగా, అధిక ఉత్పాదకతగా, లోతైన దేశీయ విలువ జోడింపుగా, ప్రపంచ పోటీతత్వంగా మారినప్పుడే అది భారత అభివృద్ధిలో శాశ్వతమైన మార్పును తీసుకురాగలదు. ●

# సిఇసి జ్ఞానేశ్ వెంటనే రాజీనామా చేయాలి

## లేకుంటే అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త ఉద్యమం: సిజెపి



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. శనివారం లోగా ఆయన రాజీనామా చేయకపోతే గాంధీ జయంతి అయిన అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త నిరసనలు చేపడతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. జ్ఞానేశ్ కుమార్ తప్పుకోకపోతే తమ ఆందోళనను దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విస్తరింపజేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు నేడు అభిజీత్ దీప్కే ఎక్స్ లో ఒక పోస్ట్ చేశారు. "రేపటిలోగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే, సీజేపీ తన దేశవ్యాప్త నిరసనను అక్టోబర్ 2న ముంబైలో ప్రారంభించి, భారతదేశంలోని ఇతర నగరాలకు కూడా తీసుకువెళుతుంది. ఈ గాంధీ జయంతి నాడు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రతిజ్ఞ చేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో దీప్కే మాట్లాడుతూ జ్ఞానేశ్ కుమార్‌ను ఈ దేశానికి అతిపెద్ద ద్రోహిగా, దేశ వ్యతిరేకిగా అభివర్ణించారు. ఎన్నికల సంఘంపై వచ్చిన ఒక నివేదిక ప్రకారం జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. మన దేశంలో ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడమే ప్రజాస్వామ్యం. కానీ, జ్ఞానేశ్ కుమార్ సీఈసీ అయినప్పటి నుంచి, ఎవరు ఓటు వేయాలో, ఎవరు వేయకూడదో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ఇది ప్రజాస్వామ్యం కాదు, నిరంకుశత్వం. దీనికి ప్రధాన కారకుడు జ్ఞానేశ్ కుమార్ అని దీప్కే తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన 48 గంటల్లో పదవి నుంచి దిగిపోవాలని అల్టిమేటం జారీ చేశారు. ఎస్ఐఆర్, ఓటర్ డేటా యాక్సెస్, కొత్త ఓటర్ల నమోదు వంటి కీలక అంశాలపై ఎన్నికల సంఘంలోనే విభేదాలు తలెత్తాయని వస్తున్న వార్తల నేపథ్యంలో సీజేపీ ఈ ఆరోపణలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదే సమావేశంలో పార్టీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవస్థ దేశాన్ని ఒక పెద్ద ప్రహసనంగా మార్చేసిందని విమర్శించారు. ఈ వ్యవస్థ అవినీతిమయమైంది, విఫలమైంది. దేశంలోని యువత మార్పును కోరుకుంటోంది. ప్రాథమిక మార్పులు అవసరమని వారు డిమాండ్ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

# సుప్రీంకోర్టుకు 'సర్‌' వివాదం

- సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై పిటిషన్ దాఖలు - ఆ నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలి
- ఓట్ల తొలగింపుపైనా విచారణ జరిపించాలి - ఇసి పనితీరుపై స్వతంత్ర దర్యాప్తు చేయించాలి




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) పనితీరులో జరిగినట్లు ఆరోపించబడుతున్న అవకతవకలపై స్వతంత్ర విచారణ కోరుతూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్) దాఖలైంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఈ రిట్ పిటిషన్‌లో, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలోని ఇసిఐ పనితీరుకు సంబంధించిన అంశాలను లేవనెత్తారు. ఓటర్ల జాబితా నుంచి సుమారు 13 కోట్ల పేర్లను తొలగించారన్న ఆరోపణలపై విచారణ జరపాలని, ఓటరు నమోదుకు ఉపయోగించే అసలైన ఫారం 6ను పునరుద్ధరించాలని, పూర్తిస్థాయి కమిషన్ ఆమోదం లేకుండా తీసుకున్నట్లు ఆరోపించబడుతున్న నిర్ణయాలను రద్దు చేయాలని కూడా ఈ పిటిషన్‌లో కోరారు. ఎన్నికల సంఘంలో తీసుకున్న నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు లేవనెత్తిన లిఖితపూర్వక అభ్యంతరాలకు సంబంధించి సెప్టెంబరు 23న ప్రచురితమైన పత్రాలు, మీడియా నివేదికలను ఈ పిటిషన్ ఆధారంగా చేసుకుంది. పిటిషన్ ప్రకారం, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు నవంబరు 2025 నుండి ఆగస్టు 2026 మధ్య కనీసం 14 సందర్భాలలో లిఖితపూర్వక విభేదాలు, అభ్యంతరాలను నమోదు చేశారు. వీటిలో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్), ఐటీ వ్యవస్థలు, పరిపాలనా నిర్ణయాలకు సంబంధించిన అభ్యంతరాలు కూడా ఉన్నాయి. 1960 ఓటర్ల నమోదు నిబంధనలకు ఎలాంటి సవరణ చేయకుండానే, ఈసీఐ ఐటీ విభాగం తొలిసారి ఓటు వేసేవారికి "చివరి ఎస్ఐఆర్‌" అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తూ ఫారం 6లో మార్పులు ప్రవేశపెట్టిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఐటీ కింద ఓటర్ల జాబితా నిర్వహణను కేంద్రీకరించడం ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల (ఇఆర్ఒల) చట్టబద్ధమైన అధికారాలు తగ్గించబడ్డాయని కూడా ఆరోపించారు. గోవాలోని 97 మంది ఓటర్ల కేసును ప్రస్తావిస్తూ, ఇసిఐనెట్ వ్యవస్థలో "రోల్‌బ్యాక్/ రివర్సల్" సౌకర్యం లేకపోవడంతో, వారిని అర్హులుగా గుర్తించినప్పటికీ ఇఆర్ఒలు వారి పేర్లను పునరుద్ధరించ లేకపోయారని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరో ఆరోపణ పశ్చిమ బెంగాల్‌కు సంబంధించింది. అక్కడ, ఎస్ఐఆర్ ప్రక్రియ సమయంలో న్యాయాధికారులచే పేర్లు పునరుద్ధరించబడిన పౌరులకు వ్యతిరేకంగా, ఇసిఐ పేరుతో 16.10 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. పూర్తి ఎన్నికల సంఘం ఆమోదం లేకుండా ఐటీ పర్యవేక్షణ వ్యవస్థను మార్చిందని ఆరోపిస్తూ, సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మనీష్ గార్గ్ జులై 28న జారీ చేసిన పరిపాలనా ఉత్తర్వును కూడా పిటిషనర్ సవాలు చేశారు. ఆ తర్వాత ఎన్నికల కమిషనర్లు సంధు, జోషిలు క్యాబినెట్ కార్యదర్శి టి.వి. సోమనాథన్‌కు లేఖ రాసి, ఆ ఉత్తర్వును వ్యతిరేకించారని, అది ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం, 2023లోని సెక్షన్ 18 ఉల్లంఘన అని వారు అభివర్ణించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రుజువైతే, అవి అధికారిక విధి నిర్వహణలో చేసిన పనుల పరిధిలోకి రావని, అందువల్ల చట్టపరమైన రక్షణను పొందలేవని పిటిషన్‌లో వాదించారు. అధికార విధి నిర్వహణలో లేదా నిర్వర్తించినట్లుగా భావించే పనులలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సివిల్ లేదా క్రిమినల్ విచారణల నుండి లభించే రక్షణ, అటువంటి విధులతో సహేతుకమైన సంబంధం లేని ఆరోపిత పనులకు వర్తించదని కూడా వాదించారు. ఆరోపిత అవకతవకలపై దర్యాప్తు జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై తగిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషనర్ ఆదేశాలు కోరారు. ముగ్గురు సభ్యుల ఇసిఐలోని విభేదాలపై కొనసాగుతున్న ప్రజా చర్చ నేపథ్యంలో ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది.

# జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై అసెంబ్లీలో రగడ

తక్షణమే రాష్ట్రహోదా ఇవ్వాలంటూ తీర్మానం ప్రవేశపెట్టిన సిఎం ఒమర్ అబ్దుల్లా

వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన తెలిపిన బిజెపి సభ్యులు

**శ్రీనగర్, సెప్టెంబరు 25:** జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరుతూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శుక్రవారం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. బీజేపీ సభ్యులు తీర్మానం ప్రతులను చించి నిరసన వ్యక్తం చేయడంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. తీర్మానంలో గతంలో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాలను ప్రస్తావించడం వివాదానికి కారణమైంది. ముఖ్యంగా 2000 జూన్ 26న ఆమోదించిన జమ్మూ కశ్మీర్ స్వయంప్రతిపత్తి తీర్మానాన్ని ఒమర్ అబ్దుల్లా ప్రస్తావించడంపై బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీజేపీ సభ్యులు సభ వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. అనంతరం తీర్మానం ప్రతులను చించి నిరసన తెలిపారు. దీనికి ప్రతిగా అధికార నేషనల్ కాన్ఫరెన్స్ సభ్యులు కూడా బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "2000 జూన్ 26, 2024 నవంబర్ 6న ఈ సభ ఆమోదించిన తీర్మానాలకు అదనంగా, జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను తక్షణమే, అత్యవసరంగా పునరుద్ధరించాలని భారత ప్రభుత్వాన్ని ఈ సభ కోరుతోంది. ఈ తీర్మానాన్ని భారత ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయిస్తుందని తీర్మానంలో పేర్కొన్నారు. 2000 జూన్ 26న అప్పటి జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం, 1953కి ముందు ఉన్న జమ్మూ కశ్మీర్ హోదాను పునరుద్ధరించాలని కోరింది. అప్పట్లో జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేకంగా ప్రధానమంత్రి, సదర్‌ఎ రియాసత్ (రాష్ట్రపతి) వంటి వ్యవస్థలు ఉండేవి. సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభను అరగంట పాటు వాయిదా వేశారు. అనంతరం సభ తిరిగి సమావేశమైనప్పటికీ బీజేపీ సభ్యులు మరోసారి వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. ఈ తీర్మానాన్ని సోమవారం ఓటింగ్‌కు పెట్టే అవకాశం ఉంది. "గత రెండేళ్లుగా జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోలేదని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు స్థానిక బీజేపీ నాయకత్వం వ్యతిరేకంగా ఉందని ఆయన ఆరోపించారు. ఈ తీర్మానం కేవలం రాష్ట్ర హోదా పునరుద్ధరణ గురించే. జమ్మూ కశ్మీర్ ప్రజల అసలు శత్రువులు ఎవరో కూడా ఈ తీర్మానం బయటపెడుతుంది. రాష్ట్ర హోదా పునరుద్ధరణను ఎవరు కోరుకుంటున్నారు, ఎవరు వ్యతిరేకిస్తున్నారు అనేది స్పష్టమవుతుంది" అని ఒమర్ అబ్దుల్లా అన్నారు. రాష్ట్ర హోదా నా ప్రభుత్వం కోసం కాదు. నా పార్టీ కోసం కూడా కాదు. ఇది జమ్మూ కశ్మీర్ గుర్తింపు కోసం. జమ్మూ కశ్మీర్ ప్రజల కోసం అని ఆయన పేర్కొన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వాన్ని బీజేపీ సభ్యులు దేశ వ్యతిరేకులుగా అభివర్ణించడంపై ఒమర్ అబ్దుల్లా స్పందించారు. తమ పార్టీ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని, బీజేపీ నుంచి తమకు ఎలాంటి ధ్రువీకరణ అవసరం లేదని అన్నారు. బీజేపీ నుంచి మాకు ఎలాంటి సర్టిఫికేట్ అవసరం లేదని, దేశం కోసం మేము ఎన్నో త్యాగాలు చేశాం. వారి దేశ వ్యతిరేక వ్యాఖ్యలను మేము పట్టించుకోమని ఒమర్ అబ్దుల్లా అన్నారు.

# యావజ్జీవ శిక్ష తీర్పునిచ్చే అధికారం ఆ కోర్టులకు లేదు

## - సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** హత్య కేసుల్లో నిందితులు జీవితాంతం జైల్లోనే ఉండాలని, శిక్ష తగ్గింపునకు అవకాశం లేదని తీర్పు ఇచ్చే అధికారం సెషన్స్ కోర్టులకు లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి కఠిన ఆంక్షలు విధించే పరిధి కేవలం ఉన్నత న్యాయస్థానాలకే ఉంటుందని జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం తెలిపింది. ముఖ్యంగా 2009లో జరిగిన ముగ్గురి హత్య కేసులో భాగంగా ఈ తీర్పును ఇచ్చిన సుప్రీం కోర్టు.. దోషులకు సెషన్స్ కోర్టు విధించిన శిక్షను రద్దు చేసింది. జీవితాంతం జైల్లోనే ఉండాలన్న శిక్షకు బదులుగా, ఎలాంటి చట్టబద్ధ రెమిషన్ లేని 25యేళ్ల కఠినకారాగార శిక్షను ఖరారు చేసింది. ఐపిసి సెక్షన్ 302 కింద నమోదైన తీవ్ర నేరాల్లో శిక్షల స్వభావాన్ని విశ్లేషిస్తూ జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పాంచోలీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. సాధారణంగా జీవిత ఖైదు అంటే ముద్దాయి తన చివరి శ్వాస వరకు కారాగారంలోనే గడపాలని చట్టపరమైన భావన ఉన్నప్పటికీ రాజ్యాంగం, వివిధ చట్టాల కింద నేరస్థుడికి లభించే శిక్ష తగ్గింపు లేదా క్షమాభిక్ష హక్కులను ప్రాథమికంగానే తొలగించే అధికారం క్రింది కోర్టులకు లేదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. సెషన్స్ కోర్టులు ముద్దాయిలకు ఎలాంటి సడలింపులు ఇవ్వకుండా చనిపోయేవరకు జైలులోనే బంధించాలని ఆదేశాలు ఇవ్వడం చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఎలాంటి మినహాయింపులు లేని ఇలాంటి అత్యంత కఠినమైన శిక్షలను ఖరారు చేసే ప్రత్యేక అధికారం కేవలం హైకోర్టులు, సుప్రీం కోర్టు వంటి ఉన్నత న్యాయస్థానాలకు మాత్రమే ఉంటుందని స్పష్టంగా వెల్లడించింది. విచారణ కోర్టులు తమ పరిధిని దాటి శిక్ష తగ్గింపు అవకాశాలపై సంపూర్ణ నిషేధం విధించలేవని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ముఖ్యంగా క్రింది కోర్టులు దోషులకు విధించిన శిక్షను సుప్రీం కోర్టు సవరించింది. జీవితాంతం జైల్లోనే ఉండాలన్న శిక్షను రద్దు చేస్తూ దాని స్థానంలో ఎలాంటి చట్టబద్ధ రెమిషన్ ప్రయోజనాలు లేకుండా 25 సంవత్సరాల కఠిన కారాగార శిక్షను ఖరారు చేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది

# ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ స్టూడెంట్ ఆఫర్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విద్యార్థులకు గుడ్ న్యూస్ అందించింది. కాలేజీ సెమిస్టర్లు, ఇంటర్న్‌షిప్‌లు లేదా పండుగ సందర్భాల్లో స్వగ్రామాలకు వెళ్లే విద్యార్థుల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు స్టూడెంట్ ఫేర్ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా బేస్ ఫేర్‌పై 10 శాతం మేర తక్షణ తగ్గింపును ఇస్తోంది. ఈ ఆఫర్ కింద టికెట్లు బుక్ చేసుకున్న వారికి సాధారణ 15 కేజీల లగేజీకి అదనంగా మరో 10 కేజీలు, అంటే మొత్తం 25 కేజీల చెక్‌ఇన్ బ్యాగేజీని ఉచితంగా అనుమతిస్తారు. ఈ ప్రత్యేక రాయితీ అక్టోబర్ 20 వరకు చేసే బుకింగ్‌లకు వర్తిస్తుంది. ఈ ఆఫర్‌లో భాగంగా మరిన్ని ఇతర ప్రయోజనాలను కూడా సంస్థ కల్పిస్తోంది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా నేరుగా టికెట్లు బుక్ చేసుకుంటే, ఒకవేళ ప్రయాణ తేదీని మార్చుకోవాల్సి వస్తే కేవలం రూ. 99 చెల్లిస్తే సరిపోతుంది. అలాగే ప్రోమో కోడ్ ఉపయోగించడం ద్వారా అదనంగా 5 శాతం డిస్కౌంట్ పొందవచ్చు. వీటికి తోడు, వీసా కార్డు ద్వారా చెల్లింపులు చేసే వారు వీసాప్లై కోడ్‌ను ఉపయోగిస్తే అక్టోబర్ 9 వరకు గరిష్ఠంగా రూ. 600 వరకు తగ్గింపు లభిస్తుంది. ఈ రాయితీలు పొందాలంటే విద్యార్థుల వయసు 12 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ ఉండాలి. టికెట్ బుకింగ్ సమయంలో స్టూడెంట్ ఫేర్ ఆప్షన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. విమానాశ్రయంలో చెక్‌ఇన్ చేసే సమయంలో గుర్తింపు పొందిన విద్యాసంస్థ జారీ చేసిన ఫొటో ఐడీ కార్డును (పుట్టిన తేదీతో కూడినది) తప్పనిసరిగా సమర్పించాలి.

# భారత్,చైనాతో కలిసి కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలి

## ఐక్యరాజ్యసమితిలో నేపాల్ ప్రధాని బాలేన్‌షా

**న్యూయార్కు, సెప్టెంబరు 25:** హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పుల వల్ల పెరుగుతున్న ముప్పులను ఎదుర్కొనేందుకు భారత్, చైనాతో కలిసి కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ప్రతిపాదించారు. హిమాలయన్ క్లైమేట్ రెసిలియన్స్ మెకానిజం పేరుతో దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వ్యవస్థకు నేపాల్ నాయకత్వం వహించాలని కోరారు. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో షా ఈ ప్రతిపాదన చేశారు. హిమాలయాల్లో ప్రమాదకరమైన హిమ సరస్సులను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఉపగ్రహ సమాచారం, సాంకేతిక పరిజ్ఞానాన్ని మూడు దేశాలు పంచుకోవాలని సూచించారు. విపత్తులపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాలని కోరారు. విపత్తు సంభవించినప్పుడు సరిహద్దులకు అతీతంగా సహాయక చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 26న నేపాల్‌లో వచ్చిన భారీ వరదలు తీవ్ర విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. పర్వత ప్రాంతాల్లోని పలు గ్రామాలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనను కొందరు మౌంటెన్ సునామీగా అభివర్ణించారు. 1,453 మంది మరణించగా, 5,550 మంది గల్లంతైనట్లు నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. గల్లంతైన వారిలో 636 మంది విదేశీయులు ఉన్నారు. వాతావరణ మార్పులే ఈ విపత్తుల తీవ్రతకు కారణమని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ గ్రీన్‌హౌస్ గ్యాస్ ఉద్గారాల్లో నేపాల్ వాటా 0.1 శాతం కంటే తక్కువేనని షా గుర్తుచేశారు. అయినా వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఆ దేశం తీవ్రంగా ఎదుర్కొంటోందన్నారు. వరదల వల్ల రహదారులు, వంతెనలు, పాఠశాలలు, ఇళ్లు, వ్యవసాయ భూములు, విద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని తెలిపారు. నష్టాన్ని 2.69 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. పునర్నిర్మాణానికి మరో 4.77 బిలియన్ డాలర్లు అవసరమని చెప్పారు.

వాతావరణ విపత్తులను ఎదుర్కొనేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు రుణాల కంటే గ్రాంట్ల రూపంలో మరింత సాయం అందించాలని షా అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. వాతావరణ నిధులను పొందే ప్రక్రియను కూడా సులభతరం చేయాలని సూచించారు.

# హార్ముజ్ వద్ద యుద్ధంలోకి అమెరికా లేజర్ ఆయుధాలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 25:** ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా అత్యాధునిక క్షిపణులు, డ్రోన్లను విరివిరిగా వాడుతోంది. తాజాగా అగ్రరాజ్యం తన అమ్ములపొదిలోకి లేజర్ వెపన్స్ శక్తిని హార్ముజ్‌లో ప్రయోగిస్తున్నట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వీటితో ఇప్పటికే హార్ముజ్ వద్ద అనేక క్రూజ్ క్షిపణులు, డ్రోన్లను కూల్చినట్లు తెలిపాయి. మార్పులు చేసిన ఎక్స్‌బాక్స్ గేమ్ కన్సోల్ కంట్రోలర్లను ఈ లేజర్ ఆయుధాల ఆపరేటింగ్‌కు వాడుతున్నట్లు పేర్కొన్నాయి. ఈ ప్రాజెక్టుపై 500 మిలియన్ డాలర్లు వెచ్చించినట్లు సమాచారం. క్షిపణుల వంటి ఖరీదైన ఆయుధాలను ఉపయోగించడం కంటే ఈ లేజర్ ఆయుధాల ద్వారా.. హార్ముజ్‌పై డ్రోన్లను, క్రూజ్ క్షిపణులను సమర్థంగా ధ్వంసం చేస్తున్నట్లు అమెరికా సైనిక వర్గాలు వెల్లడించాయి. వీటిద్వారా డ్రోన్‌లన్ను ట్రాక్ చేసి.. పేల్చివేస్తున్నట్లు తెలిపాయి.

ఎలా పని చేస్తాయి?: ఈ లేజర్ ఆయుధాల సాంకేతికతను అమెరికా సుమారు 50 యేళ్లుగా అభివృద్ధి చేస్తోంది. సంప్రదాయ యాంటీ-డ్రోన్, యాంటీ-మిసైల్ వ్యవస్థల్లా.. లేజర్ ఆయుధాలకు భౌతిక ఇంటర్‌సెప్టర్ అవసరం లేదు. ఈ ఆయుధాలు జనరేటర్లు లేదా బ్యాటరీ ప్యాక్‌ల నుంచి శక్తిని గ్రహించి.. దానిని ఫోటాన్లుగా మారుస్తాయి. తర్వాత వాటి కాంతి కణాలు లక్ష్యం ఉపరితలంపై పడి అది కాలిపోయేంత వేడిని పుట్టిస్తాయి. ఇతర ఆయుధాలతో పోలిస్తే.. వీటి ధర కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఇప్పటి వరకు వీటిని యుద్ధ నౌకలపై మాత్రమే ప్రయోగించారని.. మానవ లక్ష్యాలపై ఉపయోగించలేదని నిపుణులు పేర్కొన్నారు. ఈ ఆయుధాలను మరింత అభివృద్ధి చేయగలిగితే ప్రపంచ దేశాలు ఇకపై మందుగుండు సామగ్రి నిల్వల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండబోదన్నారు. అయితే యుద్ధభూమిలో ఈ లేజర్ ఆయుధాల వాడకాన్ని ట్రంప్ యంత్రాంగం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

# సంక్షిప్త వార్తలు

## అమెరికానౌకలో ఎనిమిది మంది ఆత్మహత్యాయత్నం

**వాషింగ్టన్, సెప్టెంబరు 25:** అమెరికా నావికా దళంలో జరిగిన ఓ సంచలన విషయం బయటకు వచ్చింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌లో పనిచేస్తున్న 8 మంది సైనికులు ఒకే దఫా మోహరింపులో ఆత్మహత్యకు యత్నించినట్లు నేవీ అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు యాక్టింగ్ నేవీ సెక్రటరీ హాంగ్ కావో, సెనేటర్ కిర్‌స్టెన్ గిల్లీబ్రాండ్‌కు రాసిన లేఖలో ఈ వివరాలను తెలిపారు. ఈనెల 22న రాసిన ఈ లేఖ ఇప్పుడు అమెరికా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అబ్రహం లింకన్ నౌకతో పాటు దాని అనుబంధ విభాగాల్లో కలిపి మొత్తం 8 మంది ఆత్మహత్యకు ప్రయత్నించారని హాంగ్ కావో తన లేఖలో పేర్కొన్నారు.

## నెతన్యాహు ప్రసంగం బహిష్కరించిన ఇరాన్ ప్రతినిధులు



**న్యూయార్కు, సెప్టెంబరు 25:** ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రసంగం ప్రారంభించగానే ఇరాన్ ప్రతినిధులు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. అయితే తమ స్థానంలో దివంగత ఇరాన్ సైనిక కమాండర్ ఖాసీం సులేమానీ ఫొటోను ఉంచారు. న్యూయార్క్‌లో గురువారం జరిగిన 81వ ఐరాస సర్వసభ్య సమావేశంలో ఈ ఘటన జరిగింది. సులేమానీ ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)లోని ఖుద్స్ ఫోర్స్‌కు కమాండర్‌గా పనిచేశారు.

## చైనా చేతికి చిక్కిన అమెరికా ఎఫ్35 యుద్ధవిమాన విడిభాగాలు



**బీజింగ్, సెప్టెంబరు 25:** అమెరికా రక్షణ రంగాన్ని, ప్రపంచ భద్రతా వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. అత్యంత ఆధునాతనమైన ఎఫ్35 స్టెల్త్ యుద్ధ విమానానికి చెందిన కీలకమైన విడిభాగాలు చైనా చేతికి చిక్కాయి. ఆస్ట్రేలియా నుంచి మరమ్మతుల కోసం అమెరికాకు పంపిన ఈ భాగాలు, హాంకాంగ్‌కు దారి మళ్లడంతో అక్కడి అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇది పొరపాటున జరిగిందా లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది.

## నన్ను ఎన్‌కౌంటర్‌లో చంపేస్తారేమో: సోనమ్ వాంగ్‌చుక్



**లేహ్, సెప్టెంబరు 25:** తనను ఎన్‌కౌంటర్‌లో చంపేస్తారేమో అని ప్రముఖ పర్యావరణవేత్త, ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. లదాఖ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని గత ఏడాది స్థానికులు లేహ్‌లో ఆందోళన నిర్వహించారు. గత ఏడాది సెప్టెంబరు 24న ఈ ఆందోళన నిర్వహించగా ఇది హింసకు దారితీసింది. ఈ సందర్భంగా చెలరేగిన ఘర్షణలో నలుగురు మరణించారు. భద్రతా బలగాలు జరిగిన కాల్పుల్లో వారు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం పదుల సంఖ్యలో పౌరుల్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన జరిగి ఏడాది పూర్తైన సందర్భంగా గురువారం వాంగ్‌చుక్ మీడియాతో మాట్లాడారు.

## అమెరికా సెనేట్‌కు గ్రీన్‌కార్డు విధానం మార్చే బిల్లు!

**వాషింగ్టన్, సెప్టెంబరు 25:** అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న భారతీయులకు కొత్త చిక్కులు వచ్చే అవకాశం ఉంది. ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డు విధానాన్ని పూర్తిగా మార్చే బిల్లును రిపబ్లికన్ సెనేటర్ టామీ ట్యూబర్‌విల్లే ప్రవేశపెట్టారు. ఇది అమల్లోకి వస్తే ఇప్పుడున్న విధానం స్థానంలో పాయింట్ల ఆధారిత సిస్టమ్ వస్తుంది. అమెరికన్స్ ఫస్ట్ ఇమ్మిగ్రేషన్ యాక్ట్ పేరుతో ఈ బిల్లును తీసుకొచ్చారు. కొత్త విధానం అమల్లోకి వస్తే ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పలు ఉద్యోగ ఆధారిత పిటిషన్లు చెల్లకుండా పోయే అవకాశం ఉంది.

# అరుదైన కానుక.. అమెరికన్-చైనీస్ రుచులు

## జిన్‌పింగ్‌కు ట్రంప్ ప్రత్యేక డిన్నర్



**వాషింగ్టన్, సెప్టెంబరు 25:** అమెరికా పర్యటనకు విచ్చేసిన చైనా అధినేత షీ జిన్‌పింగ్‌క అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు అధికారిక విందు ఇచ్చారు. శ్వేతసౌధంలోని ఈస్ట్ రూమ్‌లో జరిగిన ఈ విలాసవంతమైన విందులో జిన్‌పింగ్ కోసం ప్రత్యేక వంటకాలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన మెనూను వైట్‌హౌస్ విడుదల చేసింది. అమెరికన్, చైనీస్ రుచుల కలయికతో చేసిన వంటకాలు అందులో ఉన్నాయి. మెయిన్ కోర్సులో నువ్వులతో చేసిన బాస్ చేప, క్రిస్పీ బాక్ చోయ్ (ఒక రకమైన చైనీస్ క్యాబేజీ), పసుపు గుమ్మడితో చేసిన వెలౌట్, అడవి పుట్టగొడుగులతో చేసిన ఫ్రికాసీ, క్రిస్పీ పాన్‌సెట్టా, రోస్టెడ్ గార్డెన్ ఎగ్‌ప్లాండ్ వంటివి ఏర్పాటు చేశారు. డెజర్ట్స్‌లో వెనీలా క్రిమెక్స్, వైట్‌హౌస్ హనీక్రీమ్, వాట్‌నట్ ఫ్రాంగపేన్, చెర్రీ కాన్‌ఫిట్ వంటివి అందించారు. ఇక, ఈ కార్యక్రమంలో జిన్‌పింగ్‌కు ట్రంప్ అరుదైన కానుకనిచ్చారు. అమెరికా జాతీయ బాల్డ్ ఈగల్ విగ్రహాన్ని బహుమతిగా ఇచ్చారు. మూడు అడుగుల ఎత్తు ఉన్న ఈ గిఫ్ట్‌ను విందు సమయంలో అతిథుల ముందు ప్రదర్శించారు. స్వేచ్ఛ, స్ఫూర్తికి చిహ్నమైన ఈ విగ్రహం.. చైనాలో ప్రత్యేకంగా నిలుస్తుందని ట్రంప్ ఆకాంక్షించారు. విందు తర్వాత శ్వేతసౌధంలో నూతనంగా నిర్మిస్తోన్న బాల్‌రూమ్‌ను జిన్‌పింగ్‌కు చూపించారు. 'ఈ గదిలోకి వచ్చిన మొదటి విదేశీ నేత మీరే' అంటూ ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ విందుకు అమెరికా టెక్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ మాజీ సిఇఒ టిమ్ కుక్, ఎన్విడియా సిఇఒ జెన్సెన్ హువాంగ్, ఓపెన్ ఎఐకు చెందిన శామ్ ఆల్ట్‌మన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వివక్ష కేసులో మహిళా టెకీకి రూ.965 కోట్లపరిహారం



**లండన్, సెప్టెంబరు 25:** బ్రిటన్లో ఓ వివక్ష కేసులో సంచలనం చోటు చేసుకుంది. ఓ టెక్ కంపెనీలో ఉన్నత పదవి నుంచి తొలగించబడిన మహిళ, పరిహారంగా ఏకంగా రూ.965 కోట్లు పొందేందుకు న్యాయపోరాటంలో కీలక విజయం సాధించారు. ఒకవేళ ఈ మొత్తం ఆమెకు దక్కితే, బ్రిటిష్ ఉపాధి ట్రైబ్యునల్ చరిత్రలోనే ఇది అతిపెద్ద పరిహారం అవుతుంది. ఏడీహెచ్డీ సమస్యతో బాధపడుతున్న షానన్ బర్న్ గిట్‌ప్యాడ్ అనే సంస్థలో వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇంజనీరింగ్గా పనిచేసేవారు. 2023 ఏప్రిల్లో ఆస్ట్రియాలోని లోఫర్లో జరిగిన టీమ్‌బిల్డింగ్ ఈవెంట్లో ఓ ఘటన జరిగింది. ఆ పర్యటనలో ఆమె మద్యం సేవించి, గది తాళం మరిచిపోవడంతో బయటే ఉండిపోయారు. ఆ రాత్రి ఆమె సౌనాలోనే నిద్రించాల్సి వచ్చింది. ఈ ఘటన తర్వాత కంపెనీ సీఈఓ జోహన్నెస్ లాండ్గ్రాఫ్, ఆమెలో వృత్తిపరమైన బాధ్యత లోపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. 2023 జూన్ లో షానన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో షానన్ బర్న్ న్యాయపోరాటానికి దిగారు. తనకున్న ఆరోగ్య సమస్య కారణంగానే తనను వివక్ష తో తొలగించారని ఆరోపిస్తూ బర్మింగ్హామ్ ఉపాధి ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ 2025లో షానన్కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆమె తొలగింపు వికలాంగత వివక్ష కిందకే వస్తుందని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ఆమె భవిష్యత్తులో కోల్పోయిన జీతం, కంపెనీ ఈక్విటీ వంటి వాటిని లెక్కగట్టి సుమారు రూ.965 కోట్ల భారీ పరిహారం కోసం క్లెయిమ్ దాఖలు చేశారు. గిట్‌ప్యాడ్ కంపెనీ ఈ క్లెయిమ్‌ను అసాధారణం, నమ్మశక్యం కానిదని అభివర్ణించింది. పరిహారాన్ని రూ.12.68 కోట్లకు పరిమితం చేయాలని వాదిస్తూ పిటిషన్ వేసింది. ఈ అభ్యర్థనను ఎంప్లాయ్మెంట్ జడ్జి రాచెల్ వెడ్డర్స్పూన్ తోసిపుచ్చారు. షానన్ బర్న్‌కు అత్యధిక వేతన చరిత్ర ఉందని, ఆమె క్లెయిమ్లో జీతంతో పాటు కంపెనీ ఈక్విటీ నష్టాలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. గిట్‌ప్యాడ్లో ఆమెకు 0.85 శాతం వాటా ఉందని, ఒకవేళ ఓపెన్ఏఐ లాంటి సంస్థ గిట్‌ప్యాడ్ను కొనుగోలు చేస్తే ఆ షేర్ల విలువ కొన్ని సంవత్సరాల్లో రూ.267 కోట్లకు చేరే అవకాశం ఉందని బ్యునల్ అంచనా వేసింది.

నిపుణుల సాక్ష్యం లేకుండా షానన్ క్లెయిమ్ విలువను తక్కువగా అంచనా వేయలేమని స్పష్టం చేసింది. ఈ ఘటన తర్వాత షానన్ టెక్ పరిశ్రమను విడిచిపెట్టి, ప్రస్తుతం థెరపిస్టుగా మారేందుకు శిక్షణ తీసుకుంటున్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో టిడబ్ల్యుయుకు కాంగ్రెస్ మద్దతు

## జిహెచ్ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు కీలక బాధ్యతలు అప్పగింత

## జోరుగా ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికలు.. అక్టోబరు 9న పోలింగ్, 17న ఫలితాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల వేడి మొదలైంది. 8 యేళ్ల విరామం తర్వాత జరుగు తున్న ఈ ఎన్నికలకు అక్టోబరు 9న పోలింగ్ నిర్వహిం చనుండగా.. ఇప్పటికే పలు కార్మిక సంఘాలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన మద్దతును ఒక యూనియన్‌కు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యుయు)కు పార్టీ తరఫున పూర్తి మద్దతు ఇస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీడబ్ల్యూయూకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు తెలియజేసినట్లు తెలుస్తోంది. తమ నియోజకవర్గాల పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో టీడబ్ల్యూయూకు సహకారం, సమన్వయం అందించాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు సమాచారం. మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ నేతలు, టీడబ్ల్యూయూ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మికుల సమస్యలు, పని పరిస్థితులు, పెండింగ్ అంశాలు, ఆర్టీసీ భవిష్యత్ తదితర అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. టీడబ్ల్యూయూ విజయం కోసం క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఆర్టీసీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను పార్టీ ఎన్నికల సమన్వయకర్తగా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, కార్మిక సంఘం ప్రతినిధుల మధ్య సమన్వయం చూసే బాధ్యతను బొంతు రామ్మోహన్‌కు అప్పగించింది. డిపోల వారీగా పార్టీ నాయకులు, కార్మిక సంఘం ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహం సిద్ధం చేసుకుంటోంది. అయితే ఎన్నికల్లో తుది నిర్ణయం ఆర్టీసీ కార్మికుల ఓట్ల ద్వారానే వెలువడనుంది. తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను కార్మిక శాఖ ఈనెల 18వ తేదీన విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 9న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అక్టోబర్ 14, 15వ తేదీలను కేటాయించారు. అక్టోబర్ 17న ఫలితాలను ప్రకటించ నున్నారు. చివరిసారిగా ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు 2016లో జరిగాయి. దీంతో సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలకు కార్మిక సంఘాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల్లో ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆర్టీసీలో గుర్తింపు సంఘం హోదా కోసం పలు కార్మిక సంఘాలు పోటీకి సిద్ధమవుతున్నాయి. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్‌తో పాటు ఎంప్లాయీస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, కార్మిక సంఘ్, తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వంటి సంఘాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 26వ తేదీన పోటీ చేసే సంఘాలకు ఎన్నికల గుర్తులు కేటాయించనున్నారు. డిపోల వారీగా కార్మికులను కలుస్తున్న యూనియన్ నేతలు తమ డిమాండ్లు, సమస్యలను వివరిస్తున్నారు. వేతన సవరణ, పెండింగ్ బకాయిలు, డీఏ, పని వేళలు, సర్వీస్ నిబంధనలు, కార్మికుల సంక్షేమం వంటి అంశాలు ప్రధానంగా ప్రచారంలో ప్రస్తావనకు వస్తున్నాయి. గుర్తింపు పొందిన సంఘానికి ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వంతో కార్మికుల తరఫున అధికారికంగా చర్చించే అవకాశం ఉండటంతో ఈ ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నికల్లో మెజారిటీ సాధించిన సంఘానికి ఆర్టీసీలో గుర్తింపు హోదా లభిస్తుంది. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనలు, పని పరిస్థితులు, ఇతర సంక్షేమ అంశాలపై యాజమాన్యంతో చర్చల్లో ఆ సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే ఎన్నికల్లో గెలుపు కోసం కార్మిక సంఘాలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. దాదాపు దశాబ్దం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికులు ఏ యూనియన్‌కు మెజారిటీ మద్దతు ఇస్తారనేది అక్టోబర్ 17వ తేదీన వెలువడే ఫలితాలతో స్పష్టం కానుంది.



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నుంచి అందుకున్న అవార్డును డిజిపి ఆనంద్‌తో పంచుకున్న ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా

## ఈగల్ సిబ్బందికి డిజిపి అభినందనలు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** డ్రగ్స్ కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు స్మగ్లర్లను పట్టుకునేందుకు పక్కాగా వ్యవ హరించడం, వ్యసనపరులను సాధారణ పౌరులుగా మార్చడంలో విశేష కృషి చేస్తున్నందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి దేశంలోనే ఉత్తమ పోలీసు విభాగం అవార్డు సాధించిన ఈగల్ విభాగాన్ని డిజిపి ఆనంద్ శుక్రవారం అభినందించారు. తన కార్యాలయంలో ఈగల్ పోలీ సు అధికారుల పనితీరును ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కేంద్రం నుంచి అందిన అవార్డును ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా, డిజి పి ఆనంద్‌కు చూపారు. అనంతరం డిజి పి మాట్లాడుతూ యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మారకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై వుంద ని అన్నారు. ఈ విషయంలో ఈగల్ సిబ్బంది చేస్తున్న కృషి అమోఘంగా వుందని డిజిపి తెలిపారు. డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పట్టడంతో పాటు వారి ఆస్తులను జప్తు చేయడం కూడా తెలంగాణలోనే ఎక్కు వగా వుందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో అంతరాష్ట్ర, అంతర్జాతీయ నె ట్‌వర్క్‌పై నిరంతర నిఘా వుంచుతామని, డార్క్‌వెబ్‌పై కూడా నిఘా కొనసాగుతుందని డిజిపి తెలిపారు.

## విద్యుత్ డిఇ పై సస్పెన్షన్ వేటు

### ట్రాన్స్‌కో క్రమశిక్షణా చర్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన విద్యుత్ అధికారిపై తెలంగాణ విద్యుత్ ట్రాన్స్ మిషన్ కంపెనీ (టిజి ట్రాన్స్‌కో)కు చెందిన అధికారిపై చర్యలు తీసుకుంటూ ఆ సంస్థ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ట్రాన్స్‌కో వరంగల్ జోన్ విద్యుత్ విభాగంలో కన్స్‌ట్రక్షన్ డీఈ ఎల్. సంపతిరావుపై యాజమాన్యం సస్పెన్షన్ వేటు వేసింది. వరంగల్ జోన్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్‌పై దౌర్జన్యం, దాడి, బెదిరింపులకు పాల్పడిన ఘటనలో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించి ట్రాన్స్‌కో ఫైనాన్స్ కమర్షియల్, హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ ఓరుగంటి శ్రీనివాస్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ బాధ్యతల విషయంలో ఏర్పడిన వివాదమే ఇందుకు దారితీసినట్లు తెలియవచ్చింది.

అధికారవర్గాల వివరాలు ప్రకారం వరంగల్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ బాధ్యతలకు సంబంధించి ఈ నెల 18వ తేదీన వివాదం రేగింది. ఈ వివాదం కాస్త చీఫ్ ఇంజనీర్‌పై దాడికి ప్రయత్నించే వరకూ వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో కార్యాలయంలోని చీఫ్ ఇంజనీర్‌పై ఎల్. సంపతిరావు దౌర్జన్యం, దాడి, బెదిరింపులకు దిగడంతో క్రమశిక్షణా చర్యల కింద ఆయనను సస్పెండ్ చేసినట్లు విద్యుత్ ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ అధికారవర్గాలు వెల్లడించాయి. ఆయన్ని సస్పెండ్ చేసిన తదుపరి ఆ స్థానంలో వేరొకరికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇందులో భాగంగా ఆ స్థానంలో రాజుకు ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ మురళీసాగర్ అదనపు బాధ్యతలు అప్పగించారు.

## ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

### క్షేత్రస్థాయిలో పర్యటించిన సిఇఒ సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సిఇఒ) పి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలోని పలు కేంద్రాలను పరిశీలించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారుల పనితీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాండూర్‌లోని పాత మున్సిపాలిటీ, ఎంపీటీహాల్, గౌతాపూర్ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటరు నమోదు, నోటీసుల పంపిణీ, ధ్రువీకరణ పత్రాల స్వీకరణ తదితర ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం ఓటర్లకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో మాత్రం 72 శాతం నోటీసుల పంపిణీ పూర్తయినట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అందులో పేర్కొన్న వివరాల ప్రకారం అవసరమైన సంబం ధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని వినియోగిం చుకో వాలని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఉందని వివరించారు. అలాగే ఆయా ప్రాంతాల్లోని బీఎల్‌వోల సహకారంతో కూడా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే అందించిన నోటీసులపై క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురవు తున్నాయి. బీఎల్‌వోలు విధులను ఎలా నిర హిస్తున్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలను తెలుసుకు నేందుకే ఈ పరిశీలన చేపట్టినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన సందర్భంగా అధికారులు, బీఎల్‌వోల నుంచి ప్రక్రియకు సంబంధించిన వివ రాలను సీఈవో అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నమోదు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ముందుగా తాండూర్ ఆర్‌డిఓ కార్యాలయంలో తహసీల్దార్‌లు, ఎంపిడిఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలం వారీగా ఇప్పటి వరకు ఎన్ని నోటీసులు జారీ చేశారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నవనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వ రాజ్, ఆర్డీఓ అనిత, తహసీల్దార్ తారాసింగ్, డిఎస్పీ నర్సింగ్ యాదయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.



శుక్రవారం తాండూర్‌లోని పలు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సిఇఒ సుదర్శన్‌రెడ్డి

## దశాబ్దంలో తొలిసారి తగ్గిన వరి ఉత్పత్తి

### బియ్యం ధరలపై పెను ప్రభావం?

**హైదరాబాద్,సెప్టెంబరు25,ప్రభాతవార్త:** దశాబ్ద కాలంలో తొలిసారిగా భారతదేశంలో వరి ఉత్పత్తి తగ్గింది. ఎల్‌నినో ప్రభావం, రుతుపవనాల లోటు దీనికి ప్రధాన కారణం. దేశీయ సరఫరా, బియ్యం ధరలు, భవిష్యత్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గగా, నిల్వలు కొంత ఆశను కల్పిస్తున్నాయి. రైతులపై ఆర్థిక భారం పెరిగి, ఆహార ద్రవ్యోల్బణం భయాలు పెరుగుతున్నాయి. ఈ పరిణామం బియ్యం ధరలను అనూహ్యంగా పెంచింది, దేశీయ సరఫరా, భవిష్యత్ ఎగుమతులపై పెను ప్రభావం చూపనుంది. వర్షాలు సరిగ్గా పడకపోవడం, ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండటం వరి సాగుకు ప్రధాన విఘాతంగా మారింది. సాధారణంగా భారతదేశంలో ఏటా 150 నుంచి 154 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి అవుతుంది. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాలు అధికంగా వరిని సాగు చేస్తాయి. ప్రపంచ బియ్యం ఎగుమతుల్లో భారతదేశ వాటా 30 నుంచి 40 శాతం వరకు ఉంటుంది. ఇటువంటి ఘన చరిత్ర కలిగిన దేశం ఇప్పుడు వరి ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కొన్ని అంచనాల ప్రకారం, పదేళ్లలో తొలిసారి ఉత్పత్తి తగ్గింది. సరిగ్గా పంట ఎదిగే సమయంలో ఆశించిన వర్షపాతం లేకపోవడం గట్టి ప్రభావం చూపింది. 2026-27 మధ్యకాలంలో 10 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర ఉత్పత్తి పడిపోయే ప్రమాదం ఉందని అంచనాలున్నాయి. గతేడాది 154 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి కాగా, ఈసారి దాదాపు 6.5 శాతం మేర ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. 2009-10 తర్వాత ఈ స్థాయిలో ఉత్పత్తి తగ్గడం ఇదే మొదటిసారి. ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యంగా వచ్చాయి. జూన్ 1 నుండి లెక్కవేస్తే నాలుగు నెలలుగా భారతదేశంలో 15శాతం మేర లోటు వర్షపాతం నమోదైంది. భారత వాతావరణ శాఖ ప్రకారం, వర్షపాతం లోటు 10 శాతం లోపు ఉంటే సాధారణ రుతుపవన సంవత్సరంగా పరిగణిస్తారు. అయితే ఈసారి అది 15 శాతానికి పెరగడం సాగుకు తీవ్రమైన సవాళ్లను సృష్టిస్తోంది. ముఖ్యంగా, వరిసాగు ఎక్కువగా ఉండే ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ఈ లోటు వర్షపాతం ఏకంగా 42 శాతం వరకు నమోదైంది. భారతదేశంలో ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం సెప్టెంబర్ 11 నాటికి 42.68 మిలియన్ హెక్టార్లుగా ఉంది, ఇది గత ఏడాదితో పోలిస్తే 4 శాతం తక్కువ అని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దేశంలో 80 శాతం వరి ఉత్పత్తి ఖరీఫ్ సీజన్‌లోనే ఉంటుంది కాబట్టి, ఈ కీలక సమయంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రమవ్వడం ఆందోళనకరంగా మారింది. ఖరీఫ్ కాలంలో వర్షాలు తగ్గడం వల్ల రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భజలాలు అడుగంటడం వంటి సమస్యలు తలెత్తాయి. ఫలితంగా భవిష్యత్తులో వరిసాగుపైనా ప్రభావం పడనుంది. ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ఎల్‌నినో వరి సాగుకు సవాలు విసురుతోంది. సాగు తగ్గడం వల్ల రాష్ట్రాలు బియ్యం నిల్వలు పెంచుకునే పనిలో నిమగ్నమయ్యాయి. ఓ అంచనా ప్రకారం, ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి బియ్యం నిల్వలు 59.6 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. మార్కెట్‌లో ప్రస్తుతం సన్న రకాలైన హెచ్‌ఎంటి, ఆర్‌ఎన్‌ఆర్, బిపిటి వంటి బియ్యానికి కొరత ఏర్పడటంతో, వాటి ధరలు రూ.60 నుంచి రూ.65 వరకు పెరిగాయి. రైతులు వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలపై ఆధారపడుతున్నారు, బోరుబావుల కోసం అధిక విద్యుత్, డీజిల్ ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది వారిపై ఆర్థిక భారాన్ని పెంచుతోంది.

## నేడు ఇన్‌సర్వీస్ టీచర్ల టెట్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్,సెప్టెంబరు25,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ఇన్ సర్వీస్ టీచర్ల కోసం నిర్వహించిన ప్రత్యేక టెట్ ఫలితాలు శనివారం(సెప్టెంబర్ 26న) విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో టెట్ ఫలితాలను విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఫలితాలను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని టెట్ కన్వీనర్ గాజర్ల రమేశ్ వెల్లడించారు. ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ టెట్‌కు మొత్తం 22,477 మంది ఉపాధ్యాయులు పరీక్ష రాశారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫలితాలు విడుదలైన అనంతరం అభ్యర్థులు తమ టెట్ స్కోర్, అర్హత వివరాలను అధికారిక టెట్ వెబ్‌సైట్‌లో పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. ఫలితాలు విడుదలైన తర్వాత అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. ఇందుకోసం సాధారణంగా హాల్‌టికెట్ నంబర్/అప్లికేషన్ వివరాలు అవసరం కావచ్చు.

## వర్షాలతో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

### నిలిచిన ఓవర్‌బర్డెన్ తొలగింపు

### బురదలో కదలని భారీ డంపర్లు, యంత్రాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** వర్షాల కారణంగా సింగరేణి కాలరీస్‌లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా ఓవర్‌బర్డెన్ తొల గింపు కూడా నిలిచిపోయింది. భారీగా కురిసిన వర్షానికి ఓపెన్ కాస్ట్ క్వారీల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. రహదారులు బురదమయంగా మారడంతో బొగ్గును రవాణా చేసే భారీ డంపర్లు, యంత్రాల కదలికలు పూర్తిగా స్తంభించిపోయాయి. వర్షాల కారణంగా మణుగూరు ప్రాంతంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనులలో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. నీటి ముంపు కారణంగా బొగ్గు ఉత్పత్తితో పాటు, ఓవర్‌బర్డెన్ తొలగింపు కార్యకలాపాలు రెండింటినీ ప్రభావితం చేసింది. ఈ వర్షం గనులలో సుమారు 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని మరియు దాదాపు 1.65 లక్షల టన్నుల ఓవర్‌బర్డెన్ పదార్థం తొలగింపును ప్రభావితం చేసినట్లు సమాచారం. పేరుకుపోయిన వర్షపు నీటిని తోడివేయడానికి అధికారులు ఓపెన్ కాస్ట్ గనులలో పంపులు, మోటార్లను వినియోగిస్తున్నారు.

ముఖ్యంగా, ఉత్పత్తిపై ప్రభావాన్ని తగ్గించడానికి సింగరేణి కాలరీస్ సిబ్బంది పరిస్థితిని పర్యవేక్షి స్తూ చర్యలు తీసుకుంటున్నారు. ప్రభావిత గనుల ప్రాంతాల నుంచి నీటిని తొలగించిన తర్వాత బొగ్గు ఉత్పత్తిపై దాని ప్రభావాన్ని మరింతగా అంచనా వేయనున్నారు. పినాపాక నియోజకవర్గంలో సింగరేణి మైనింగ్ కార్యకలాపాలపై ఆధారపడిన అనేక ప్రాంతాలు ఉన్నాయి. కొత్తగూడెం జిల్లాలో మణుగూరు ఒక ముఖ్యమైన బొగ్గు గనుల కేంద్రంగా ఉంది. గనుల ప్రాంతాల్లో నీటిని తొలగించి, కార్యకలాపాలను పునరుద్ధరించే సమయంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలని అధికారులు సిబ్బందికి సూచించారు. రామగుండం ప్రాంతంలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులలో వర్షాల జోరు కారణంగా పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. ప్రాజెక్టులలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రోడ్లన్నీ పూర్తిగా బురదమయంగా మారిపోయాయి. దీనివల్ల గనుల్లో ఉపయోగించే భారీ యంత్రాలు, ఎక్స్‌కవేటర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయి కదల్లేని పరిస్థితి నెలకొంది.

## కాంగ్రెస్ అక్రమాలను గమనిస్తోన్న దేశ ప్రజలు

### ఎన్నికల సంఘం, ఎస్ఐఆర్ ప్రక్రియపై దొంగేదొంగ అన్నట్లుగా కాంగ్రెస్, రాహుల్‌గాంధీ తీరు

### రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** కేంద్ర ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ విషయంలో కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న రాద్ధాంతం చూస్తుంటే దొంగే దొంగ అన్నట్లుగా ఉందని బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర మొత్తం రాజ్యాంగ సంస్థలను పావులుగా వాడుకున్న ఉదంతాలతోనే నిండి ఉందని, అలాంటి పార్టీ నేడు రాజ్యాంగ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా జరుగు తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను తప్పుబట్టడం హాస్యాస్పదమని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎమర్జెన్సీ సమయంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహ రించిన నవీన్ చావ్లా శైలిని, ఆ సమయంలో ఢిల్లీలో జరిగిన అకృత్యాలు, దౌర్జన్యాలు, బలవంతపు కుటుంబ నియంత్రణ అమలులో ఆయన పాత్రను సాక్షాత్తూ షా కమిషన్ చాలా స్పష్టంగా తప్పుబట్టిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు విస్మరిస్తున్నారని డా. లక్ష్మణ్ గుర్తుచేశారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న అటువంటి నవీన్ చావ్లాను తదనంతర కాలంలో ఇందిరాగాంధీ హయాంలో ఎన్నికల కమిషనర్‌గా నియమించి పక్షపాతంగా వ్యవహరించారని, అప్పటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎన్. గోపాలస్వామి సైతం ఆయనపై 12 అభియోగాలు మోపి తప్పుబట్టిన చరిత్ర దేశానికి తెలుసన్నారు. తమ పాలనలో ఎన్నికల సంఘాన్ని రాజకీయ అవసరాల కోసం దుర్వినియోగం చేసిన చరిత్ర ఉన్న కాంగ్రెస్‌కు నేడు స్వతంత్ర సంస్థలపై మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. రాహుల్ గాంధీకి రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘంపై గానీ, న్యాయస్థానాలు, న్యాయమూర్తులపై గానీ ఏమాత్రం గౌరవం లేదని, తమకు ప్రతికూలంగా వస్తే చాలు రాజ్యాంగ సంస్థలను కించపరిచేలా మాట్లాడటం ఆయనకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. తెలంగాణలో బిఆర్ఎస్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేను చేర్చుకొని, తమ పార్టీ సింబల్‌పై ఎంపిగా పోటీ చేయించిన అనైతిక చరిత్ర కాంగ్రెస్‌దని, చివరికి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసి అనర్హత వేటు వేస్తే తప్ప తప్పును సరిదిద్దుకోలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. స్పీకర్‌తో సహా వ్యవస్థలను తప్పుదోవ పట్టించేలా కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరును, రాష్ట్రంలో ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను అడ్డగోలుగా లాక్కుంటున్న వైనాన్ని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని తెలిపారు. ఒకవైపు ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తూ, మరోవైపు రాహుల్ గాంధీ రాజ్యాంగం గురించి, విలువల గురించి నీతులు చెబుతుంటే యువత, ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వరుసగా మూడుసార్లు ప్రజాస్వామ్య బద్ధంగా, ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాని పట్టుకొని రాహుల్‌గాంధీ దేశద్రోహులు అని బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యానించడం ఆయన మానసిక నిరాశకు నిదర్శనమన్నారు. వరుస పరాజయాల భయంతో, అధికారం దక్కలేదన్న తీవ్ర ఆక్రోశంతోనే రాహుల్ గాంధీ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. భారత ప్రజాస్వామ్య ప్రక్రియను, వ్యవస్థలను ఎంతగా అపహాస్యం చేయాలని చూసినా దేశ ప్రజలు సహించబోరని, సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ అహంకారానికి ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని డా. కె.లక్ష్మణ్ హెచ్చరించారు.

## నగరంలో బూటకపు జిఎస్టీ బిల్లులతో రూ.32 కోట్లు స్వాహా

**హైదరాబాద్,సెప్టెంబరు25,ప్రభాతవార్త:** నకిలీ ఇన్వాయిస్‌లతో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు భారీ గండికొట్టిన మరో కుంభకోణం నగరంలో వెలుగు చూసింది. ఎలాంటి ముడి సరుకు కొనుగోలు చేయకుండానే కేవలం కాగితాలపై అంకెల గారడీ చేసి ఏకంగా రూ.32.28 కోట్ల మేర ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఐటీసీ స్వాహా చేసిన ఓ బడా వ్యాపారి బాగోతాన్ని హైదరాబాద్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ జోన్ పరిధిలోని సికింద్రాబాద్ సీజీఎస్టీ కమిషనరేట్ అధికారులు బట్టబయలు చేశారు, టీఎంటీ బార్లు, స్టీల్ పైపుల వ్యాపారం ముసుగులో ఈ భారీ ఆర్థిక మోసానికి పాల్పడిన ముషీరాబాదుకు చెందిన ప్రధాన సూత్రధారిని సీజీఎస్టీ అధికారులు పక్కా ఆధారాలతో అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు. ఈ మేరకు శుక్రవారం సీజీఎస్టీ కమిషనరేట్ కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. దర్యాప్తు అధికారులు వెల్లడించిన ప్రకారం... ముషీరాబాద్ కేంద్రంగా ఐరన్ అండ్ స్టీల్ వ్యాపారం నిర్వహిస్తున్న సదరు నిందితుడు పన్నుల ఎగవేత కోసం క్షేత్రస్థాయిలో ఉనికిలో లేని, ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించని బోగస్ కంపెనీలతో పాటు గతంలోనే అక్రమాలకు పాల్పడి జీఎస్టీ రిజిస్ట్రేషన్లు రద్దయిన డొల్ల కంపెనీల నుంచి ముడిసరుకు కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడు. ఎక్కడా ఎలాంటి సరుకు చేతులు మారకపోయినా, కేవలం నకిలీ బిల్లుల ఆధారంగా కోట్లాది రూపాయల ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను అక్రమంగా తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. ఇలా దొడ్డిదారిన పొందిన ఐటీసీ క్రెడిట్ను ఉపయోగించి, తన సంస్థ చెల్లించాల్సిన జీఎస్టీ పన్ను బాధ్యతను తీర్చేసినట్లు అధికారులను బురిడీ కొట్టించాడు. అయితే, సదరు సంస్థ లావాదేవీలు, తరచూ క్లెయిమ్ చేస్తున్న భారీ ఐటీసీపై అనుమానం వచ్చిన సికింద్రాబాద్ సీజీఎస్టీ అధికారులు అతడు బిల్లులు తీసుకున్న సప్లయర్స్ చిరునామాల్లో సంబంధిత అధికారులు పరిశీలన చేపట్టారు. తీరా అక్కడ పరిశీలిస్తే.. ఆ చిరునామాల్లో ఎలాంటి వ్యాపార సంస్థలు లేవని, అవన్నీ కేవలం పన్ను ఎగవేత కోసం సృష్టించిన నకిలీ డొల్ల సంస్థలని నిర్ధారించారు. వాస్తవంగా సరుకు రాకుండానే నకిలీ బిల్లులతో ఐటీసీని పొందడం, దానిని జీఎస్టీ చెల్లింపులకు వాడుకోవడం సెంట్రల్ జీఎస్టీ చట్టం 2017 నిబంధనలను కచ్చితంగా ఉల్లంఘించడమేనని తేల్చారు. ఈ కుంభకోణాన్ని సంబంధించి పక్కా ఆధారాలు సేకరించిన అనంతరం, నిందితుడి వాంగ్మూలాన్ని రికార్డు చేసిన అధికారులు.. సీజీఎస్టీ చట్టంలోని సెక్షన్ 69 కింద ఆ ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేశారు. డ్యూటీ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి 14 రోజుల జ్యూడిషియల్ కస్టడీ విధించినట్లు అధికారులు తెలిపారు. ముషీరాబాద్ కేంద్రంగా సాగిన ఈ నకిలీ బిల్లుల దందా వెనుక ఇంకెవరి హస్తం ఉందనే కోణంలో లోతైన దర్యాప్తు కొనసాగుతోందని సికింద్రాబాద్ సిజీఎస్టీ అధికారులు స్పష్టం చేశారు. పన్ను ఎగవేతదారుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు తమ విభాగం నిరంతరం నిఘా ఉంచుతుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల కోసం రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీ

### కేంద్ర, రాష్ట్రం మధ్య సమన్వయం లక్ష్యం

### కేంద్ర ఎంపి నిధుల్లో రాష్ట్రంలో 10 శాతమే ఖర్చు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్రం మధ్య సమన్వయం చేసుకునేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మధ్య గణాంకాల సేకరణ, నిర్వహణలో మెరుగైన సమన్వయం కోసం స్టేట్ లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ (ఎస్ఎల్‌సీసీ) ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి సంబంధించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షత వహిస్తారు. అలాగే ఈ సమన్వయ కమిటీలో మొత్తం 18 మంది సభ్యులు ఉంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సామాజిక, ఆర్థిక మరియు వివిధ పరిపాలన రంగాలకు సంబంధించిన అధికారిక గణాంకాల సేకరణ, వాటి ప్రాసెస్సింగ్, క్షేత్రస్థాయి నిర్వహణను మరింత పటిష్టం చేయడం, పరస్పర సమన్వయాన్ని పెంపొందించడం ఈ కమిటీ ఏర్పాటు ముఖ్య ఉద్దేశ్యంగా అధికారవర్గాలు వెల్లడించాయి.

తద్వారా జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో గణాంకాల వ్యవస్థ మరింత పారదర్శకంగా మరియు సమర్థవంతంగా రూపుదిద్దుకోనుందని ప్రభుత్వం భావిస్తోంది. కాగా కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ దేశంలో జాతీయ ఆదాయం, ఉపాధి, ధరల సూచికలు మరియు వినియోగ వ్యయం వంటి రాష్ట్రాలకు సంబంధించిన కీలక డేటాను శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించి విడుదల చేస్తుంది. దీని పరిధిలో నేషనల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్, సెంట్రల్ స్టాటిస్టికల్ ఆఫీస్ వంటి విభాగాలు పనిచేస్తాయి. దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మరియు ఇరవై అంశాల కార్యక్రమాన్ని ఈ కేంద్ర గణాంకాల శాఖ సమీక్షిస్తుంది. వీటితో పాటు ఎంపీలాడ్స్ పథకం నిర్వహణ కూడా దీని బాధ్యతల్లో ఒకటిగా ఉంది. అయితే పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేయడంలో రాష్ట్రానికి చెందిన కొందరు ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గత రెండేళ్లలో ఎంపీల్యాడ్స్ కింద తెలంగాణ ఎంపీలకు కేటాయించిన నిధులలో కేవలం 23 శాతం మాత్రమే వినియోగించుకున్నట్లు వెల్లడైంది. కేంద్రం ఎంపీల్యాడ్స్ కింద ప్రతి ఎంపీకి ఏటా రూ. 5 కోట్లు కేటాయిస్తుంది. జాతీయ సగటు వినియోగం 75 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది చాలా తక్కువగా ఉంది. 28 రాష్ట్రాలలో ఈ రాష్ట్రం 24వ స్థానంలో ఉంది. తెలంగాణకు చెందిన 17 మంది లోక్‌సభ, 6గురు రాజ్యసభ సభ్యులతో సహా 23 మంది ఎంపీలకు కేంద్రం రూ.394 కోట్లు కేటాయించగా, అందులో కేవలం రూ.94 కోట్లు మాత్రమే వినియోగించారు. ఆరుగురు ఎంపీలు అయితే రెండేళ్ల కాలంలో తమకు అందుబాటులో ఉన్న నిధులలో 10 శాతం కంటే తక్కువ ఉపయోగించారు. ఈ నేపథ్యంలో కేంద్రం, రాష్ట్రం మధ్య సమన్వయం కోసం కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారవర్గాలు భావిస్తున్నాయి.



## మిక్స్‌డ్ షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణం

**టోక్యో, సెప్టెంబరు 25:** ఆసియా క్రీడల షూటింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ దక్కింది. పదిమీటర్ల ఎయిర్‌పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్‌లు స్వర్ణం సాధించారు. ఈ క్రీడల్లో దేశానికి రెండో పసిడిపతకం లభించినట్లయింది. తొలుత మహిళల క్రికెట్ జట్టు బంగారుపతకం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్‌కు అర్హత సాధించాయి. వీరిలో కమల్‌జీత్, సురుచిలు కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. ఇక దక్షిణకొరియా ద్వయానికి రజతం ఇరాన్‌జోడీకి కాంస్యం దక్కాయి. 50 మీటర్ల రైఫిల్‌టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రజతం సాధించింది. ఫైనల్‌లో షూటర్లుఐశ్వరీ ప్రతాప్‌సింగ్ తోమర్, రుద్రాంశ్‌పాటిల్, నీరజ్‌కుమార్‌లు మొత్తంగా 1762 పాయింట్లతో చైనా టీమ్ స్వర్ణం సాధించింది. నాలుగు పాయింట్ల తేడాతో మనజట్టుకు పసిడిచేజారిపోయింది. మరోవైపు స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో జోష్ణచిన్నప్ప, సెంథిల్‌కుమార్‌లు పతకం సాధించారు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్స్‌లో ఫిలిప్పీన్స్ జోడీ డేవిడ్ పెలినో జమైకా ఆరిబాడోను 11-3, 11-5తో ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లారు. ఇక టేబుల్‌టెన్నిస్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత ద్వయం మనుష్‌షా, దియా చితాలేలు కూడా పతకం సాధించారు. క్వార్టర్స్‌లో హాంకాంగ్ జోడీని 11-6, 13-15, 11-9, 11-5 తేడాతో ఓడించారు.

# రైతుల గుండెల్లో వాయు'గండం'

### ఎడతెరపిలేని వర్షాలు.. పోటెత్తిన వరద
### పొంగిపొర్లిన వాగులు, వంకలు, కుంటలు
### నీటమునిగిన పంట పొలాలు.. భారీనష్టం
### ప్రభుత్వం ఆదుకోవాలంటూ రైతులు వేడుకోలు



**అమరావతి, సెప్టెంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తీవ్ర వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, గ్రామాలు, పంట పొలాలు, రహదారులు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తుండగా.. వందలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు వందలాది ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీటమునిగి భారీగా నష్టం కల్గించింది. శ్రీకాకుళం జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వర్షం సైతం లెక్క చేయకుండా ముంపు ప్రాంతాలను పరిశీలించారు. శ్రీకృష్ణాపురం, బోరుభద్ర, గోదలాం, కొల్లిపాడు, లక్కివలస, మరువాడ, మేఘ వరం, వడ్డివాడ, కాకరపల్లి, అంట్లవరం, నగిరిపేట, సంతబొమ్మాళి, రెయ్యిపేట, వడ్డితాండ్ర, కోటపాడు, ఆకాశలక్కవరం తదితర గ్రామాల్లో ముంపునకు గురైన వరి పంట పొలాలను మంత్రి అచ్చెన్నాయుడు వివిధ శాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంట పొలాల్లోకి వెళ్లి పరిస్థితిని స్వయంగా పరిశీలించిన మంత్రి రైతులతో నేరుగా మాట్లాడి పంట నష్టం, నీటి ముంపు తీవ్రత, పంట ప్రస్తుత పరిస్థితి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో భారీ వర్షాలకు సుమారు 250 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. బ్రిడ్జి సమీపంలోని పొలాలు పూర్తిగా నీటము నగడంతో పొట్ట దశలో ఉన్న వరి పంట దెబ్బతింటుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. ఎకరాకు ఇప్పటికే రూ.40 వేల వరకు ఖర్చు చేశామని, పంట నష్టపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత తుఫాన్ల సమయంలో జరిగిన పంట నష్టాలకు సంబంధించిన పరిహారం ఇప్పటికీ అందలేదని కౌలు రైతులు మండిపడ్డారు. ముంపు ప్రాంతాలను కొవ్వూరు తహసీల్దార్ దుర్గాప్రసాద్,వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. కాలువలను జెసిబిలతో శుభ్రం చేసి నీరు బయటకు వెళ్లేలా చర్యలుతీసుకుంటామని తెలిపారు. పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని అధికారులు పేర్కొన్నారు. తమను తక్షణమే ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం
## సామాజిక న్యాయం
### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు25,ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని సీఎం పేర్కొన్నారు. ఆమె 131వ జయంతి సందర్భంగా ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం బీసీలు, పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని సీఎం గుర్తుచేశారు. సమ్మక్క సారలమ్మ, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని తెలిపారు. కోఠిలోని మహిళా విశ్వ విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టి ఆమె సేవలను స్మరించుకున్నామని సీఎం చెప్పారు. ఐలమ్మతో పాటు తెలంగాణ వీర మహిళలు చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా ఆదర్శమని అన్నారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్య, గురుకులాలు, హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు యువత, మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, గౌరవం, న్యాయం అందించడమే చాకలి ఐలమ్మకు అందించే నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## జార్ఖండ్ మంత్రి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,సెప్టెంబరు25,ప్రభాతవార్త:** జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దీపికా పాండే సింగ్ కుమార్తె త్రిషా సింగ్ జంషెడ్ పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె మృతి పట్ల మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. త్రిషాసింగ్ అకాలమృతి పట్ల మంత్రి సీతక్క తీవ్రవిచారం వ్యక్తం చేస్తూ, దీపికాపాండేసింగ్‌తోపాటు ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. ఈ మేరకు లేఖ రాశారు.



## అణ్వాయుధం తయారీ ఉద్దేశం లేనేలేదు
### అణుకేంద్రాల తనిఖీకి అంతర్జాతీయ సంస్థలకు అనుమతి
### ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్

**టెహ్రాన్, సెప్టెంబరు 25:** అణ్వాయుధం తయారు చేయాలన్న ఉద్దేశం తమకు లేదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. తమ అణు కేంద్రాలను తనిఖీ చేసేందుకు అంతర్జాతీయ సంస్థలను అనుమతిస్తామని తెలిపారు. ఎలాంటి కారణం లేకుండా అమెరికా తమపై దాడులకు దిగిందని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పెజెష్కియాన్ పేర్కొన్నారు. నిరంతరం దాడులు చేస్తూ చర్చలు జరగకుండా అమెరికా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అమెరికా దాడులు, ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొంటూనే ముందుకు సాగుతామని వెల్లడించారు. తమ దేశ మనుగడ కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా భరిస్తామన్నారు. యుద్ధాన్ని ముగించాలా వద్దా అనేది అమెరికా చేతుల్లోనే ఉందన్నారు.

అలాగే, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై దాడికి చైనా ఉపగ్రహ చిత్రాలను ఇరాన్ బలగాలు వినియోగించినట్లు వస్తున్న ఆరోపణలను పెజెష్కియాన్ కొట్టిపారేశారు. యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు చేసే పనులకు వారే బాధ్యులని స్పష్టంచేశారు. అమెరికా, ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుంటే, మరోవైపు యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులను ఉధృతం చేస్తున్నారు. తాజాగా మరోసారిహౌతీలు రియాద్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపారు. ఈ క్రమంలో సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్, క్షిపణి దాడులు జరిపినట్లు సమాచారం.

రాస్ తనురాలోని ఈ రిఫైనరీ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు హూతీ సైనిక ప్రతినిధి పేర్కొన్నారు. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన తెలిపారు. మరోవైపు, హౌతీ దాడులకు గట్టి బదులిచ్చామని సౌదీ అరేబియా పేర్కొంది. దక్షిణ తైఫ్ ప్రావిన్స్, ఎర్ర సముద్ర తీరంలోని యాన్బు ప్రాంతాల్లో హూతీలు ప్రయోగించిన ఆరు బాలిస్టిక్ క్షిపణులను తమ బలగాలు అడ్డుకున్నట్లు పేర్కొంది. హౌతీ దాడుల నేపథ్యంలో పవిత్ర మక్కా నగరంతో సహా పలు ప్రాంతాలకు సౌదీ అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది.

## నవంబరు 1నుంచి ఖరీఫ్
# ధాన్యం కొనుగోళ్లు

### 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం
### 2,619 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
### అందుబాటులో 31వేల వాహనాలు
### ఎపి పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ, సెప్టెంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని నవంబరు 1న ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడిన ఆయన, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియకు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సేకరణ ప్రక్రియ కోసం 24 వేల మంది సిబ్బందిని నియమించగా, కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు 31వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. ఈసారి రైతులకు రవాణా ఖర్చులు కూడా చెల్లించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.



శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న ఎపి పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట దిగుబడులు, తద్వారా ధాన్యం సేకరణ అంచనాలు తగ్గినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా సకాలంలో కొనుగోలు చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లుల సామర్థ్యం, చెల్లింపుల ప్రక్రియ వంటి అంశాల్లో పౌరసరఫరాల శాఖతో పాటు ఇతరప్రభుత్వ విభాగాలను భాగ స్వామ్యం చేసేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు.

## యువతిపై సామూహిక అత్యాచారం

**వార్ధా, సెప్టెంబరు 25:** మహారాష్ట్రలో దారుణం జరిగింది. 19 ఏళ్ల యువతిపై కొందరు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఈనెల24, వేకువ ఝామున, మహారాష్ట్ర, వార్ధా రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాలివి. మహారాష్ట్రకు చెందిన ఒక 19 ఏళ్ల యువతి తన చంద్రాపూర్‌లో ఉన్న తన బంధువుల్ని కలిసి, సేవాగ్రామ్ వెళ్లింది. అక్కడ్నుంచి బుధవారం అర్ధరాత్రి వార్ధా రైల్వే స్టేషన్ చేరుకుంది. రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా ఉన్న యువతిని బస్సు డిపోకు తీసుకెళ్తానని నమ్మించి ఒక ఆటో డ్రైవర్ తన ఆటోలో ఎక్కించుకుని వెళ్లాడు. బస్ డిపోకు తీసుకెళ్లకుండా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆమె అక్కడినుంచి తప్పించుకుని వచ్చింది. రైల్వే స్టేషన్‌లో ఉన్న ఆమె వద్దకు మరికొందరు వచ్చారు. వాళ్లు కూడా ఆమెను అక్కడినుంచి తీసుకెళ్లారు. వారు కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. వీరిలో మొదట అత్యాచారానికి పాల్పడ్డ నిందితులు కూడా ఉన్నారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి 2.00 గంటల తర్వాత జరిగింది. తర్వాతి రోజు ఉదయం బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపారు. అత్యాచారానికి పాల్పడ్డ ఐదుగురు నిందితుల్ని అరెస్టు చేశారు. వీరిలో ఆటో డ్రైవర్లు కూడా ఉన్నారు. ఇంకా ఎవరైనా నిందితులు ఉన్నారా అనే కోణంలో కూడా దర్యాప్తు జరుపుతున్నామని రైల్వే ఎస్పీ మంగేష్ షిండే తెలిపారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం తగిన వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## బండ్లగూడలో కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో గణేశ్ లడ్డూ రూ.1.01 కోట్లు

### బాలాపూర్ లడ్డూ ధర రూ.39 లక్షలు..
### గతేడాది కంటే రూ.4 లక్షలు ఎక్కువ

**హైదరాబాద్,సెప్టెంబరు25,ప్రభాతవార్త:** తెలంగాణలో గణేష్ ఉత్సవాల సందర్భంగా జరిగే బాలాపూర్ లడ్డూ వేలం అత్యంత ప్రసిద్ధి చెందింది. ప్రతి సంవత్సరం వినాయక నిమజ్జనం రోజున ఈ లడ్డూ వేలం పాటను నిర్వహిస్తారు బాలాపూర్ గణనాథుడి లడ్డూను దక్కించుకునేందుకు ప్రతి ఏడాదిలానే భక్తుల్లో ఈ ఏడాది కూడా తీవ్ర పోటీ నెలకొంది. ఈ ఏడాది పోటా పోటీగా జరిగిన లడ్డూ వేలం పాటలో సాహెబ్‌నగరనకు చెందిన అర్బనన గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ సామ ప్రణీత్‌రెడ్డి రూ.39లక్షలకు దక్కించుకున్నారు. గతంలో కంటే బాలాపూర్ లడ్డు ఈసారి రూ.4లక్షలు అదనంగా పలికింది. 2025లో రూ.35లక్షలకు లింగాల దశరథ్‌గౌడ్ బాలాపూర్ లడ్డును దక్కించుకున్నారు. 1994లో మొదటిసారి ప్రారంభమైన ఈ బాలాపూర్ లడ్డూ వేలం పాట రూ. 450 తో మొదలై, నేడు కోట్లాది మంది భక్తుల మధ్య ప్రతిష్టాత్మకమైన రికార్డులను సృష్టిస్తూ వస్తోంది. శివుని ఆశీస్సులతో బాలాపూర్ లడ్డూను దక్కించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రణీత్‌రెడ్డి చెప్పారు. గణేష్ లడ్డూ వేలాల్లో బాలాపూర్ మాదిరిగానే తన కంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన బడంగ్‌పేట్‌లోని బడా గణేష్ లడ్డూ ఈసారి వేలంలో రూ.10.50లక్షలు పలికింది. వేలంలో ఆర్‌విఆర్ క్లౌడ్(కిచెన్ అండ్ క్యాటరర్స్)కు చెందిన సహ యజమానులు రాళ్లగూడెం రవి వర్ధన్‌రెడ్డి, దొడ్డి వెంకటేశ్, రాఘవేందర్‌రెడ్డి, మాదిరెడ్డి భరత్‌రెడ్డిలు లడ్డూను సొంతం చేసుకున్నారు. బండ్లగూడలోని కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో గణేశ్ లడ్డూ రూ.1.01 కోట్లకు పలికింది. శక్తిమాన్ గ్రూప్ సభ్యులు రూ.1.01 కోట్లకు దక్కించుకున్నారు. గత ఏదాది ఇదే విల్లాస్‌లో గణేష్ లడ్డూ రూ.2.31 కోట్లు పలికింది.



బాలాపూర్ లడ్డూను వేలంలో పొందిన అర్బన్ గ్రూపు సామ ప్రణీత్‌రెడ్డి

## ఎఫ్‌సివి పొగాకు రైతులకు ప్రతి బ్యారన్‌కు
# రూ.50వేలు వడ్డీలేని రుణం
### కేంద్రం ప్రకటన

**విజయవాడ,సెప్టెంబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పొగాకు రైతులకు కేంద్రం శుభవార్త తెలిపింది.. ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు ప్రతి బ్యారన్‌కు రూ.50వేలు వడ్డీ లేని రుణం ఇవ్వా లని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక ఇబ్బందుల నుంచి పొగాకు రైతులను ఆదు కునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వివరించింది. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణ యంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడే పరిస్థితులు తొలగిపోతాయని పొగాకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌సీవీ పొగాకు రైతు లు పంటసాగు, క్యూరింగ్ ప్రక్రియ, బార్న్ నిర్వహణకు పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టా ఉం టుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిం చకపోతే పంట నష్టం తీవ్రంగా ఉంటుంది. దీంతో రైతులపై అప్పుల భారం పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో వడ్డీ లేని రుణం అందుబాటులోకి వస్తే రైతులకు తక్షణ నగదు అవసరాలు తీర్చుకునే అవకాశం లభిస్తుందని కేంద్రం భావిం చింది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సిన అవసరం కూడా తగ్గుతుందని ఆలోచించింది. ఈ ఏడాది జులైలో ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర వాణిజ్య శాఖ ఉన్నతాధికారుల బృందం పర్యటించింది. సీఎం చంద్రబాబు పొగాకు రైతుల పరిస్థితిపై పలు పర్యాయాలు కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్ళారు. ప్రధాని నరేంద్రమోడీ, సంబంధిత కేంద్ర మంత్రులకు ఆయన లేఖలు రాసారు. ఈ సం దర్భంగా రాష్ట్రంలోని ఎఫ్‌సీవీ పొగాకు మార్కెట్ పరిస్థితిని ఈ బృందం సమీక్షించింది. ఈ నేపథ్యంలో ఏపీలోని పొగాకు రైతుల కోసం కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది.

## కుటుంబసభ్యులతో విదేశాలకు వెళ్లిన ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబరు 25, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మరోసారి విదేశీపర్యటనకు బయలుదేరి వెళ్ళినట్లు సమాచారం.

శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి విదేశీ పర్యటనకు సీఎం వెళ్ళారు. ఈ పర్యటన పూర్తి వ్యక్తిగతంగా మూడు రోజుల పాటు కొనసాగుతుందని సమాచారం. ప్రైవేట్ పర్యటన కావడంతో ఆయన వెళ్ళే దేశం, బస చేసే ప్రాంతానికి సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

ఇది పూర్తిగా వ్యక్తిగత పర్యటన కావడంతో ఆయన ఏ దేశానికి వెళ్తున్నారు, ఎక్కడ స్టే చేస్తారు అనే వివరాలను అధికారులు అత్యంత గోప్యంగా ఉంచారు. అక్కడ ఎలాంటి రాజకీయ భేటీలు కూడా ఉండవు ఈ నెల 28న వరకు అయన విదేశాలల్లో పర్యటిస్తారని సమాచారం.

ఈ ట్రిప్‌లో ఎలాంటి ప్రభుత్వ ప్రతినిధులు కానీ, అధికారిక ప్రోటోకాల్స్ కానీ ఉండవు. నిరంతర సమీక్షలు, జిల్లాల పర్యటనలతో బిజీగా ఉండే చంద్రబాబు, కేవలం కుటుంబ సభ్యులతో సమయం గడపడానికే ఈ చిన్న విరామం తీసుకున్నట్లు సమాచారం. ఆయన ఏ సమయానికి విదేశాలకు వెళ్ళింది ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు,

చంద్రబాబు విదేశాల్లో ఉన్న మూడు రోజులు అధికారికంగా వర్చువల్ సమీక్షలు( అవసరమయితే తప్ప)దూరంగా ఉంటారని తెలిసింది. ఆయన విదేశాల నుంచి రాగానే ఈ నెల 29నుంచి వరుసగా అయిదురోజుల పాటు రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ షెడ్యూల్ ఇప్పటికే విడుదలయింది.

## కోర్టు అనుమతి రాగానే ఎపిలో మున్సిపల్ ఎన్నికలు

### కొన్ని కేసుల్లో తీర్పులు రిజర్వ్
### మరికొన్నింటిపై వాదనలు
### వెంకటగిరి పర్యటనలో స్పష్టత ఇచ్చిన ఎపి మంత్రి నారాయణ

**నెల్లూరు, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర పుర పాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టత ఇచ్చారు. కోర్టు క్లియరెన్స్ వచ్చిన వెంటనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. తిరుపతి జిల్లా వెం కటగిరి పర్యటనలో మంత్రి నారాయణ మున్సిపల్ ఎన్నికలపై మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఎన్నికలకు సంబంధించి ప్రస్తుతం కోర్టులో పలు అంశాలపై విచారణ జరుగుతోందని తెలిపారు. కొన్నింటిపై జడ్జిమెంట్ రిజర్వ్ చేసి ఉందని, మరి కొన్ని అంశాలపై వాదనలు జరుగుతున్నాయని తెలిపారు. కోర్టు నుంచి క్లియరెన్స్ వచ్చిన వెంటనే మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు.



శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో మీడియాతో మాట్లాడుతున్న ఎపి మంత్రి నారాయణ

# నేను ఎవ్వరికీ మద్దతుగా మాట్లాడబోను

### కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ఎన్నికల సంఘంపై వస్తున్న ఆరోపణలపై కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ స్పందించారు. ప్రభుత్వంలో ఉన్నానని ఎవరికీ మద్దతుగా మాట్లాడబోనని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అని చెప్పారు. ఆ సంస్థపై ప్రశ్నలు వస్తున్నప్పుడు వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని, ముఖ్యంగా సీఈసీదేనని అన్నారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణల గురించి తాను పెద్దగా పట్టించుకోనని చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. ఆరోపణలు చేయడం ప్రతిపక్షాల రాజకీయ విధానంలో భాగమన్నారు. అయితే ప్రతిపక్షాలను సంతృప్తిపరిచేందుకు ఎన్నికల సంఘం స్పందించాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రజలకు విషయాలను వివరించి వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అదే ప్రజాస్వామ్య గొప్పతనమని పేర్కొన్నారు. మరోవైపు బీహార్‌లో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. పాట్నాలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డెక్కారు. బీహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ రామ్ నేతృత్వంలో నిరసన ప్రదర్శన జరిగింది. సచివాలయ పోలీస్ స్టేషన్ గేటు సమీపంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళన కారులను అడ్డుకున్నారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. బారికేడ్ల వద్దే కార్యకర్తలు నిరసన కొనసాగించారు.



# దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వ నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు వెలుగుతాయని వివరించారు. దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం కావాలని ఆయన భావించినట్లు తెలిపారు. పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటోందని మోదీవివరించారు. ఈ ఆలోచనల స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగావికసిత్ భారత్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

# వచ్చే 12 నెలల్లో భారత్ సుస్థిర వృద్ధి

## - ప్రపంచ ఆర్థిక వేదిక ప్రధాన ఆర్థిక వేత్తల అంచనా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** తాజా ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) అంచనాల ప్రకారం, సర్వేలో పాల్గొన్న ప్రధాన ఆర్థికవేత్తలలో 98 శాతం మంది రాబోయే 12 నెలల్లో మితమైన లేదా అంతకంటే బలమైన వృద్ధిని ఆశిస్తున్నారు. వీరిలో 74శాతం మంది భారతదేశానికి బలమైన లేదా చాలా బలమైన వృద్ధి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మే నెలలో ఈ సంఖ్య 52శాతంగా ఉంది. దేశీయ డిమాండ్‌లో కొనసాగుతున్న స్థితిస్థాపకత ప్రతిబింబిస్తూ, 2026–27 ఆర్థిక సంవత్సరానికి భారతదేశ వృద్ధి అంచనాను ఆగస్టులో 6.7శాతానికి పెంచారు. "అధిక ఇంధన ధరలు అంచనాలపై ఒత్తిడిని కొనసాగిస్తున్నప్పటికీ, స్థితిస్థాపకమైన దేశీయ డిమాండ్ ద్వారా వృద్ధికి మద్దతు కొనసాగుతుందని భావిస్తున్నారు" అని డబ్ల్యుఇఎఫ్ నివేదిక పేర్కొంది. మే నెలతో పోలిస్తే ద్రవ్యోల్బణ అంచనాలు తగ్గాయి. మే నెలలో 61 శాతం మంది అధిక లేదా చాలా అధిక ద్రవ్యోల్బణాన్ని అంచనా వేయగా, ఇప్పుడు 55 శాతం మంది ప్రధాన ఆర్థికవేత్తలు రాబోయే 12 నెలల్లో మితమైన ద్రవ్యోల్బణాన్ని, 45 శాతం మంది అధిక ద్రవ్యోల్బణాన్ని ఆశిస్తున్నారు. ఆగస్టులో వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం వార్షిక ప్రాతిపదికన 4.8 శాతానికి పెరిగింది. ఇది 4 శాతం మధ్యకాలిక లక్ష్యాన్ని అధిగమించినప్పటికీ, 2-6 శాతం సహన పరిధిలోనే ఉంది. ప్రతిస్పందించిన వారిలో అధిక శాతం (67 శాతం) మంది ద్రవ్య విధానంలో ఎలాంటి మార్పు ఉండదని అంచనా వేస్తుండగా, 24 శాతం మంది విధానాన్ని కఠినతరం చేస్తారని భావిస్తున్నట్లు ఈ నివేదిక పేర్కొంది. ఆగస్టులో తటస్థ విధాన వైఖరితో పాటు, పాలసీ రేటును 5.25 శాతంగా ఉంచారు. ఆర్థిక విధానం కూడా స్థిరంగా ఉంటుందని అంచనా వేయగా, 72 శాతం మంది ఎలాంటి మార్పు ఉండదని, 22 శాతం మంది సరళ విధానాన్ని ఆశిస్తున్నారు. "బలమైన వృద్ధి, సహన పరిధిలోనే ఉన్న ద్రవ్యోల్బణం, విధాన స్థిరత్వంపై సర్వే అంచనాలకు అనుగుణంగా ఉన్నాయి" అని నివేదిక తెలిపింది. అయితే, ఈక్విటీ మార్కెట్ పనితీరు అంత ఉత్సాహంగా లేదు. యేడాది ప్రారంభం నుండి (19 నాటికి) నిఫ్టీ 50 సూచీ 7.9 శాతం క్షీణించింది. నిరుద్యోగిత విషయానికి వస్తే, రాబోయే 12 నెలల్లో ఎటువంటి మార్పు ఉండదని 70 శాతం మంది ప్రధాన ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. మిగిలిన వారిలో పెరుగుదల (17 శాతం), తగ్గుదల (13 శాతం) ఉంటుందనే అభిప్రాయాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆగస్టులో 15 యేళ్ళు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో నిరుద్యోగిత రేటు జూలైలోని 5.1 శాతం నుండి 5 శాతానికి తగ్గింది, అదే సమయంలో కార్మిక శక్తి భాగస్వామ్య రేటు 55.4 శాతం నుండి 55.6 శాతానికి పెరిగింది. ఈ పరిణామాలు బలమైన ఆర్థిక కార్యకలాపాలతో పాటు సాపేక్షంగా స్థిరమైన కార్మిక మార్కెట్ పరిస్థితులను సూచిస్తున్నాయని, అయినప్పటికీ నిరంతర ఉపాధి కల్పన అనేది కీలకమని డబ్ల్యుఇఎఫ్ సర్వే పేర్కొంది.

# రంగనాయక స్వామి ఆలయంలో అర్ధరాత్రి చోరీ

## పురాతన విగ్రహాలు అపహరణ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ,పోలీస్ సిబ్బంది

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు అక్కడ ఉన్న పురాతన విగ్రహాలను అపహరించుకొని వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్న అర్చకులు ఆలయ తాళాలు విరిగి ఉండటాన్ని గుర్తించారు. పోలీసు లకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం తో ఆలయ పరిసరాలను పరిశీలించారు. పురాతన విగ్రహాలు అపహరణకు గురి కావడంతో భక్తులు స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దుండగులను గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# బిసి, ఎస్సి, ఎస్టీ హాస్టళ్ల సిబ్బందిని పెంచాలి

## ఉపముఖ్యమంత్రి భట్టితో ఆర్.కృష్ణయ్య బృందం



ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన ఆర్.కృష్ణయ్య వినతిపత్రాన్ని సమర్పించిన దృశ్యం

**హైదరాబాద్ సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త ):** రాష్ట్రంలోని బిసి, ఎస్సి, ఎస్టీ కాలేజీ హాస్టళ్లలో సీట్లు సరిపోక, అరకొర సిబ్బందితో దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లలోని సమస్యలను తక్షణమే సమీక్షించి, పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆయన నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించి, సుదీర్ఘంగా చర్చించింది. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ హాస్టళ్ల పరిపాలనలో ఇప్పటివరకు ప్రభుత్వం ఒక నిర్దిష్ట విధానాన్ని రూపొందించకపోవడం శోచనీయమన్నారు. ఉన్నత విద్యనభ్యసించే డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ విద్యార్థులకు మెరుగైన భోజనం, వసతి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిభారం ఎక్కువై వర్కర్లు ఉద్యోగాలు వదిలేస్తుండటంతో వంట మనుషులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో రిటైర్ అయిన వారి స్థానంలో కొత్త వారిని నియమించి, హాస్టళ్లలో ఖాళీలను భర్తీ చేయాలి. ప్రతి కాలేజీ హాస్టల్‌కు అటెండర్, వాచ్‌మెన్, కమాటీ, కుక్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి. నాలుగేళ్లుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలి. నూతన మెనూ ప్రకారం వంట పనిభారం పెరిగినందున యుద్ధప్రాతిపదికన ప్రతి హాస్టల్‌కు అదనంగా 5 మంది సిబ్బందిని కేటాయించాలి. 100 మందికి పైగా విద్యార్థులున్న హాస్టళ్లలో ప్రతి 25 మందికి ఒక కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ వర్కర్‌ను నియమించాలి. బీసీ కాలేజీ హాస్టళ్లలో సీట్లను 10 శాతం పెంచడంతో పాటు, కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్లు, 50 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేయాలి. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (బీజూవీ) పోస్టులను గ్రేడ్1గా అప్‌గ్రేడ్ చేయాలి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ల సతీష్, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు సి. రాజేందర్, బీసీ నాయకులు అంజి గౌడ్, నరేష్ గౌడ్, శివ కుమార్ యాదవ్, బలరాం, కె.వంశీ పాల్గొన్నారు.

# రాజ్యాధికారం బిసిలదే

**- 2 ఎకరాల భూములిస్తాం, ఒసిలను అసెంబ్లీ గేటు తాకనివ్వం : తాండూరులో తీన్మార్ మల్లన్న**



తాండూరులో తీన్మార్ మల్లన్న.

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** రాబోయే ఎన్నికల్లో బీసీలదే రాజ్యాధికారమని టీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తాండూరులో రోడ్‌షో నిర్వహించిన తీన్మార్ రెడ్లను, ఇతర ఓసీలను అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వబోమని స్పష్టం చేశారు. 2014లో కేసీఆర్ సర్కార్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 2 కోట్లకు పైగా ఉండగా ఇటీవల రేవంత్ సర్కార్ నిర్వహించిన కులగణనలో కోటీ 80 లక్షలుగా నమోదు చేయడం శోచనీయమని అన్నారు. పదేళ్ల వ్యవధిలో 20 లక్షల బీసీ జనాభా తగ్గుతుందా అని ప్రశ్నించారు. ఒకవేళ వారు చనిపోతే డెత్ సర్టిఫికేట్లు చూపించాలన్నారు. ఈ ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగతా కులగణన పత్రాలను కాల్చినట్లు తెలిపారు. కేసీఆర్, రేవంత్‌లకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీల ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెడ్ల లెక్కలు తేల్చుతామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కోటి ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని బీసీలకు 2 ఎకరాల చొప్పున పంపిణీ చేస్తామని తెలిపారు. బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేలా చేస్తామన్నారు. వారి భద్రతే ధ్యేయంగా పనిచేస్తామని చెప్పారు. రాజ్యాధికారం సాధించిన తర్వాత నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం కోసం దృష్టి సారిస్తామని ఆయన వివరించారు. ఓట్లు, జనాభా అధికంగా ఉన్నా ఇప్పటికీ పవర్ బీసీల చేతుల్లోకి రాకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ బిడ్డను సీఎంగా చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మల్లన్న పిలుపునిచ్చారు. తాండూరు నియోజకవర్గంలో అభివృద్ధి జరుగడం లేదని ఎమ్మెల్యేపై విమర్శలు చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు రెడ్లు ఉన్నంత వరకు ప్రగతి సాధ్యం కాదన్నారు. ఈ నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు ముందుకు సాగడం లేదని విమర్శించారు. తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిని కొడంగల్ ఆసుపత్రిగా మార్చారని మండిపడ్డారు. తాండూరులో కూడా బీసీ బిడ్డయే ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఇక్కడ బీసీలకు గెలిచే సత్తా ఉందని తీన్మార్ మల్లన్న వివరించారు. తాండూరులో రియల్టర్ శంకర్‌యాదవ్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలన్నారు.

# ఆర్టీసి గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించాలి

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు



బొంతు రామ్మోహన్‌కు మద్దతు పత్రాన్ని అందజేస్తున్న బి.మహేష్‌కుమార్‌గౌడ్. చిత్రంలో ఐఎన్‌టియుసి నాయకులు

**సైఫాబాద్, సెప్టెంబరు 25 ప్రభావార్త:** ఆర్టీసీలో అక్టోబరు 9వ తేదీన జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూయూ)కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సంపూర్ణంగా మద్దతు ప్రకటించింది. ఈ ఎన్నికల్లో యూనియన్ విజయానికి పార్టీ శ్రేణులు సహకరించాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ టిడబ్ల్యూయూకు మద్దతు ప్రకటిస్తూ పత్రాన్ని అందజేయడంతోపాటు ఎన్నికల సమన్వయకర్తగా టిపిసిసి ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్‌ను నియమించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమంలో కార్మిక సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘంకు జరగనున్న ఎన్నికల్లో టిడబ్ల్యూయూకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంపూర్ణంగా సహకారం అందించాలని సూచించారు. జిల్లాల వారిగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి యూనియన్ విజయానికి కృషి చేయాలని కోరారు. గుర్తింపు పొందిన కార్మిక సంఘానికి ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడంతోపాటు వాటిని పరిష్కరించే బాధ్యత ఉంటుందన్నారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన జలమండలి యూనియన్ ఎన్నికల్లో సమన్వయ బాధ్యతలు నిర్వహించి విజయాన్ని సాధించిన అనుభవంతో ఆర్టీసీ ఎన్నికల్లో సమిష్టిగా పనిచేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉద్యోగులందరూ టిడబ్ల్యూయూకు మద్దతు ఇచ్చి ఓట్లు వేసి భారీ మేజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, టిఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఈ.అశ్వత్థామరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూయూకు తెలంగాణ జన సమితి, సిఐటియూ అనుబంధ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ , ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ సంపూర్ణంగా మద్దతు ప్రకటించాయని తెలిపారు. తమ యూనియన్‌కు మద్దతు ప్రకటించిన సిఎం రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, రవాణా శాఖ మంత్రి, పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డికి యూనియన్ నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# సాగులో సత్ఫలితాలిచ్చిన సోలార్ పంప్‌సెట్లు

## - రాష్ట్రంలో తొలిసారిగా ప్రోటోటైప్ అగ్రి పంప్స్ - సింక్రొనైజేషన్ ప్రక్రియ విజయవంతం

## - రైతుల కరెంట్ కష్టాలకు ఇక చెక్ - కొండారెడ్డిపల్లి గ్రామంలో ప్రయోగం

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త** వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న కరెంట్ సమస్యలకు చెక్ పెట్టే దిశగా రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) చేసిన ప్రయత్నాలు సత్‌ఫలితాలు ఇచ్చాయి. వ్యవసాయ రంగంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, రైతులకు నాణ్యమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో తలపెట్టిన ప్రయోగాత్మక ప్రాజెక్టు కీలక ముందడుగు వేసింది. నాగర్‌కర్నూల్ సర్కిల్ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన 7.5 కిలోవాట్ల ప్రోటోటైప్ సోలార్ అగ్రికల్చర్ పంప్‌సెట్‌ల సింక్రొనైజేషన్ ప్రక్రియను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. రాష్ట్రంలో తొలిసారి ప్రయోగాత్మకంగా ఇక్క ప్రోటోటైప్ సోలార్ అగ్రికల్చర్ పంప్‌సెట్‌ల సింక్రొనైజేషన్ ప్రక్రియను అధికారులు విజయవంతంగా పరీక్షించారు. ఈ విధానం అమల్లోకి వస్తే ఇక రైతుల కరెంట్ కష్టాలు తీరనట్టేనని తెలిపారు. కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో ఈ సోలార్ పంప్‌సెట్‌లను విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు ఏర్పాటు చేశారు. స్థానిక ఎర్తింగ్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ న్యూట్రల్ ఎర్తింగ్ వ్యవస్థలతో వీటిని అనుసంధానించి సాంకేతిక పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఒక రైతు సోలార్ పంప్‌సెట్‌ను డీటీఆర్ న్యూట్రల్ ఎర్తింగ్ పద్ధతితో, మరో రైతుకు సంబంధించి సోలార్ పంప్‌సెట్‌ను లోకల్ ఎర్తింగ్ పద్ధతితో పద్ధతిలో అనుసంధానం చేసి విజయవంతంగా పరీక్షించారు. ఈ ప్రోటోటైప్ ప్రాజెక్టును రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, నాగర్‌కర్నూల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకట నరసింహారెడ్డి, డివిజనల్ ఇంజనీర్ ఎం. సుధాకర్ పర్యవేక్షించి, సాంకేతికంగా సమన్వయం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సోలార్ పంప్‌సెట్‌లను విద్యుత్ పంపిణీ వ్యవస్థతో సమర్థవంతంగా అనుసంధానం చేయడం ద్వారా రైతులకు పగటి పూట నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. సంప్రదాయ విద్యుత్ వినియోగంపై భారం తగ్గుతుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో సోలార్ ఆధారిత పంప్‌సెట్ల అమలుకు అవసరమైన సాంకేతిక ప్రమాణాలు, భద్రతా అంశాలు, నిర్వహణ విధానాలపై ఈ ప్రోటోటైప్ ద్వారా సమగ్ర అధ్యయనం చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు కట్టుబడి ఉన్నాయని చీఫ్ ఇంజనీర్ బాలస్వామి తెలిపారు. దీనివల్ల రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరడమే కాకుండా, విద్యుత్ వ్యవస్థపై భారం తగ్గి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి విధానాలను అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకట నరసింహారెడ్డి పేర్కొన్నారు. సౌరశక్తి ఆధారిత పంప్‌సెట్లతో వ్యవసాయ రంగంలో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుంది.

# అచ్చంపేటలో ఘరానా మోసం

## అధిక వడ్డీ ఆశచూపి న రూ. 6 కోట్లతో పరార్

**అచ్చంపేట,సెప్టెంబరు,25 ప్రభాతవార్త:** అధిక వడ్డీ ఆశ చూపి అచ్చంపేట పట్టణంలో ఐదు నుంచి 6 కోట్ల వరకు వసూలు చేసిన ఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే పట్టణంలో సాయి నగర్ కాలనీలో సలీం అనే వ్యక్తి ఇరుగుపొరుగు వారి నుండి అధిక వడ్డిస్తానంటూ ఆశ చూపి ఒక్కొక్కరి వద్ద లక్షల్లో వసూలు చేసిన వ్యక్తి రెండు రోజులుగా కనిపించకపోవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం సీఐ నాగరాజు, ఎస్సై నరేష్, సాయి నగర్ కాలనీలో సలీం ఇంటికి వెళ్లి సోదాలు నిర్వహించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అచ్చంపేట సీఐ నాగరాజు తెలిపారు. సుమారు 50 నుండి 60 మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తున్నదని, సలీం ఎక్కడ ఉన్నాడు, ఎంతమంది వద్ద నుంచి ఎంత మొత్తంలో డబ్బులు తీసుకున్నాడు. ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపడుతున్నామన్నారు. సలీం ఆచూకీ లభిస్తేనే మొత్తం వ్యవహారంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని సీఐ తెలిపారు.

# ఉద్యోగులకు గిఫ్ట్ బాక్సులు, ఐఫోన్లు

## వరల్డ్ స్టార్ మ్యాన్‌పవర్ సంస్థ

**దుబాయి, సెప్టెంబరు 25:** యూఏఈకి చెందిన ఓ కంపెనీ తమ ఉద్యోగుల పట్ల చూపిన ఉదారత ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంటోంది. ఉద్యోగులందరినీ ఆశ్చర్యపరుస్తూ యాజమాన్యం ఖరీదైన ఐఫోన్లను బహుమతిగా ఇచ్చింది. అయితే, ఈ బహుమతిని అందించిన విధానం మరింత ఆసక్తికరంగా మారింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. యూఏఈ కేంద్రంగా పనిచేస్తున్న వరల్డ్ స్టార్ మ్యాన్‌పవర్ అనే సంస్థ తమ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. కంపెనీ వ్యవస్థాపకుడు నిషాద్ హుస్సేన్, మేనేజింగ్ డైరెక్టర్ అయిన ఆయన భార్య హసీనా నిషాద్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ఉద్యోగులందరినీ పిలిచి, టేబుల్‌పై ఉంచిన గిఫ్ట్ బాక్సులలో ఒకదాన్ని ఎంచుకోమని చెప్పారు. ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా ఆ బాక్సులను తెరిచి చూశారు. కొందరికి అందులో ఖరీదైన ఐఫోన్లు రాగా, మరికొందరికి కేవలం చాక్లెట్ బార్‌లు మాత్రమే వచ్చాయి. చాక్లెట్లు వచ్చిన వారు కాస్త నిరాశకు గురైనప్పటికీ, అసలైన సర్ ప్రైజ్ అప్పుడే మొదలైంది. కార్యక్రమంలో చివరిగా, ఎండీ హసీనా నిషాద్ ముందుకు వచ్చి, చాక్లెట్లు పొందిన ప్రతీ ఉద్యోగికి కూడా కొత్త ఐఫోన్లను స్వయంగా అందించారు.

# ఐటి కారిడార్‌లో నేడు డాక్టర్ మన్మోహన్‌సింగ్ విగ్రహావిష్కరణ

## తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్‌సింగ్ పాత్ర చరిత్రాత్మకం: మంత్రి పొన్నం



మన్మోహన్‌సింగ్ విగ్రహావిష్కరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**గచ్చిబౌలి, సెప్టెంబరు 25 ప్రభాతవార్త** భారత మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్‌సింగ్ కాంస్య విగ్రహాన్ని ఐటి కారిడార్ పరిధిలోని విప్రో సర్కిల్ వద్ద శనివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు విగ్రహావిష్కరణ ఏర్పాట్లను శుక్రవారం తెలంగాణ రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. కాంస్య విగ్రహం ఆవిష్కరిస్తున్న ప్రదేశంతో పాటు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి, మంత్రులు హాజరవుతున్న క్రమంలో ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు ఎనలేనివని అన్నారు. భారత దేశ ఆర్థిక ప్రగతికి దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని అన్నారు. 1991ఆర్థిక మంత్రిగా ఆయన చేపట్టిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలకమైన మార్పుకు దోహదం చేశాయన్నారు. 2004నుంచి 2014 వరకు ప్రధాన మంత్రిగా దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలకు హక్కులు, అవకాశాలను విస్తరించే దిశగా, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యా హక్కు చట్టం వంటి కీలక కార్యక్రమాలు అమలులోకి వచ్చాయన్నారు. దేశ నిర్మాణంలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పార్లమెంటు సభ్యుడిగా ఆయన మార్గదర్శకత్వంలో పనిచేసే అవకాశం లభించడం తన ప్రజా జీవితంలో ఎంతో గర్వకారణమైన విషయమని అన్నారు. ఆయన సహకారం, మార్గదర్శకత్వంలో కరీంనగర్ పార్లమెంటు నియోజకర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టానని, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రాంతీయ అభివృద్ధికి కేంద్ర సహకారం అందించడంలో మన్మోహన్‌సింగ్ చూపిన సానుకూల దృక్పదాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపారు. తెలంగాణ ప్రజల చిరకాల వాంచ అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో డాక్టర్ మన్మోహన్‌సింగ్ పాత్ర ఎంతో కీలకమైనదని తెలిపారు. 2009లో ప్రక్రియ ప్రారంభించేందుకు నాటి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నుంచి, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు జరిగిన పరిణామాల్లో ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాత్ర చారిత్రాత్మకమని అన్నారు. నగరంలోని ఐటి కారిడార్ విప్రో సర్కిల్ వద్ద డాక్టర్ మన్మోహన్ సింగ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి ఆయన సేవలను స్మరించుకోవడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ మన్మోహన్‌సింగ్ సేవలను గుర్తింపుగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు.

# తూర్పు, పశ్చిమ దేశాల భిన్నమైన ఫ్యాషన్ శైలులు

## ఆకర్షణగా నిలిచిన శ్వేతసౌధం

**వాషింగ్టన్, సెప్టెంబరు 25:** వైట్‌హౌస్ తూర్పు, పశ్చిమ దేశాల దౌత్యపరంగానే కాకుండా భిన్నమైన ఫ్యాషన్ శైలులకు ఆకర్షణగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, సతీమణి మెలానియా ట్రంప్.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, సతీమణి పెంగ్ లియువాన్‌లకు అధికారిక విందుకు స్వాగతం పలికారు. అయితే ఇరు దేశాల ప్రథమ మహిళలు అయిన వారు ధరించిన వస్త్రాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఒకరిది ఆధునికతకు, మరొకరిది సంప్రదాయానికి నిలువుటద్దంగా నిలిచాయి. మెలానియా తెల్లని బో బ్లౌజ్, పెంగ్ మాండరిన్ కాలర్ గౌన్‌ను ధరించారు. దీంతో అభిముఖ దిక్కుల దేశాల భిన్నమైన ఆహార్యం అందరి దృష్టిని ఆకర్షించింది. మెలానియా తెల్లటి సెయింట్ లారెంట్ బ్లౌజ్, నల్లటి బ్రోకేడ్ డోల్స్, గబానా ప్యాంటు ధరించారు. ఆధునిక, క్లీన్ కట్, వెస్ట్రన్ డిజైన్లకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇతర దేశాల ప్రథమ మహిళలా తమ సొంత దేశపు బ్రాండ్లకే పరిమితం కాకుండా యూరోపియన్ యూనియన్, అంతర్జాతీయ డిజైనర్ దుస్తులను ధరించారు. ఇది ఆమెకు నాలుగో అధికారిక విందు. పెంగ్ నేలను తాకే ఎర్రటి, మాండరిన్ కాలర్, మణికట్టును తాకే స్లీవ్స్ గౌనును ధరించారు. చైనీస్ సంస్కృతిలో సూర్యుడు, అగ్ని, శ్రేయస్సుకు ప్రతీకగా ఎరుపు.

# ఇరాన్ కవలలపై దారుణం - నిరసనల్లో పాల్గొన్నారని ఒకరికి మరణశిక్ష, మరొకరికి 27 యేళ్ల ఖైదు!

**ఇస్ఫహాన్(ఇరాన్), సెప్టెంబరు 25:** ఇరాన్‌లోని ఇస్ఫహాన్ నగరానికి చెందిన 19 ఏళ్ల కవల సోదరీమణులు తారానెహ్, రోమినా రహీమీల కన్నీటి కథ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అందరినీ కలచివేస్తోంది. జనవరిలో ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగాయి. ఆ సమయంలో పాఠశాలలో చదువుకుంటున్న ఈ ఇద్దరు అమ్మాయిలు కూడా మొదటిసారి ఆందోళనల్లో పాల్గొన్నారు. అయితే ఆ నిరసనల్లో పాల్గొన్న కొద్ది రోజులకే, ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు వారి ఇంటిపై దాడి చేసి ఆ ఇద్దరినీ బలవంతంగా తీసుకెళ్లిపోయారు. ఈ ఘటన తరువాత షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. ఆ ముసుగు దొంగలు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కోర్" సభ్యులని తేలింది. తమ కూతుళ్లు ఏమైపోయారో తెలియక వారి తల్లి మర్జయా నూర్మొహమ్మదీ దాదాపు నాలుగు నెలల పాటు ఆసుపత్రులు, ప్రభుత్వ ఆఫీసులు, జైళ్ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగారు. చివరికి వారికి ఒక చేదు నిజం ఎదురైంది. ఈ కేసులో తారానెహ్‌కు ఏకంగా మరణశిక్ష విధించగా, రోమినాకు 27 ఏళ్ల జైలు శిక్ష పడింది. దీంతో దిక్కుతోచని ఆ కుటుంబం కోర్టులో అప్పీల్ చేయడమే కాకుండా, ఇప్పుడు ఐక్యరాజ్యసమితిని కూడా సాయం కోరింది. ఇస్ఫహాన్‌లోని షోహదా చౌక్ దగ్గర పెద్ద ఎత్తున ప్రజలు నిరసన తెలుపుతున్న సమయంలో తారానెహ్, రోమినాలు కూడా అందులో చేరారు. నిజానికి అంతకుముందు వారు ఎప్పుడూ ఏ విధమైన నిరసనల్లోనూ పాల్గొనలేదు. సరిగ్గా ఆ సమయంలోనే చౌక్ దగ్గర జరిగిన ఘర్షణల్లో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. అందులో ఒకరు రివాల్యూషనరీ గార్డ్ సభ్యుడు కాగా, మరొకరు నిరాశ్రయుడైన వ్యక్తి. ఈ ఘటన తర్వాత ఈ ఇద్దరు సోదరీమణులతో సహా మొత్తం 16 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిపై మోలోటోవ్ కాక్‌టైల్స్ తయారు చేశారని, భద్రతా దళాలపై దాడులు చేశారని తీవ్రమైన ఆరోపణలు మోపారు. అంతేకాకుండా, దేవుడికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం" (మొహారేబెహ్) అనే కఠినమైన నేరాన్ని కూడా వీరిపై రుద్దారు. నిర్బంధంలో లాఠీలతో దారుణంగా కొట్టారని, మానసిక నరకం చూపించడమే కాకుండా లైంగికంగా వేధించారని కుటుంబ సభ్యులు, న్యాయవాదులు చెబుతున్నారు. ముఖ్యంగా తారానెహ్ మోకాళ్లు, మోచేతులు, చేతులపై లాఠీలతో తీవ్రంగా కొట్టడం వల్ల ఆమె దేహానికి పెద్ద ఎత్తున గాయాలయ్యాయి. మే నెలలో ఎట్టకేలకు తల్లిని తమ కూతుళ్లను కలవడానికి అనుమతించినప్పుడు, ఆ తల్లి తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ముఖాలు వాచిపోయి, తలపై వెంట్రుకలు ఊడిపోయి ఉన్న ఆ అమ్మాయిలను చూసి ఆమె మొదట గుర్తుపట్టలేకపోయింది, కేవలం వారి గొంతు ఆధారంగానే వారు తన పిల్లలని తెలుసుకోగలిగింది.

# ఆసియా క్రీడల్లో భారత్, పాక్ మధ్య నో మ్యాచ్



## నాకౌట్, ఇతర పరిస్థితులతోనే సాధ్యం

**న్యూఢిల్లీ:** జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా గేమ్స్ 2026లోనూ భారత్, పాకిస్థాన్ జట్లు మధ్య జరిగే హైటెన్షన్ మ్యాచ్క అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇతర టోర్నీల తరహాలో గ్రూప్ దశలోనే దాయాదీ దేశాలు తలపడటం లేదు. దాంతో ఇరు జట్లు నాకౌట్ చేరడంతో పాటు, ఇతర పరిస్థితులు కలిసొస్తే తప్పా భారత్, పాక్ మధ్య పోరు చూసే అవకాశం లేదు. షెడ్యూల్, డ్రా ప్రకారం, భారత్, పాకిస్తాన్ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడవు. ఇరు జట్లు నాకౌట్ దశకు చేరుకుంటేనే భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరుగుతుంది. సెమీస్‌లో కూడా ఇరు జట్లు తల పడే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. సెమీ ఫైనల్స్‌లో గెలిస్తే, అక్టోబర్ 3న జరిగే స్వర్ణ పతకం మ్యాచ్‌లో భారత్, పాకిస్థాన్ తలపడ తాయి. అంతేకాకుండా ఒకవేళ రెండు జట్లు సెమీ ఫైనల్స్‌లో ఓడిపోతే, అక్టోబర్ 3న జరిగే కాంస్య పతకం మ్యాచ్‌లో తలపడవచ్చు. అయితే పాకిస్థాన్ ఫైనల్ చేరే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. మరోవైపు భారత్ సెమీస్‌లో ఓడే అవకాశాలు చాలా తక్కువ. మహిళల క్రికెట్‌లో పాకిస్థాన్ సెమీస్‌లో వెనుదిరగ్గా, భారత్ స్వర్ణం గెలిచింది. భారత్, పాకిస్థాన్ జట్లు తలపడలేదు. పురుషుల క్రికెట్‌లోనూ ఇవే ఫలితాలు పునరావృతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఇక ఆసియా గేమ్స్ టోర్నీ నిబంధనల ప్రకారం పురుషుల క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో ఈ నెల 25న హాంకాంగ్, ఒమెన్ మధ్య, ఆఫ్ఘనిస్థాన్, నేపాల్ మధ్య ప్రారంభమయ్యాయి. ఆసియా క్రీడల చరిత్రలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం ఇది నాలుగోసారి మాత్రమే.

ఈ టోర్నీలో మొత్తం 10 ఆసియా జట్లు మెడల్స్ కోసం పోటీపడుతున్నాయి. మెరుగైన ఐసీసీ ర్యాంకింగ్స్ కలిగిన భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నేరుగా క్వార్టర్ ఫైనల్స్ ఆడనుండగా, ఆతిథ్య జపాన్, ఆఫ్గానిస్థాన్, నేపాల్, మలేషియా, హాంగ్‌కాంగ్, ఒమన్ గ్రూప్ దశలో పోటీపడుతు న్నాయి. ఈ 6 జట్లను రెండు గ్రూప్‌లుగా విభ జించి రౌండ్ రాబిన్ పద్ధతిలో ఆడిస్తున్నారు. గ్రూప్ దశ ముగిసే సరికి ప్రతీ గ్రూప్ నుంచి టాప్2లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంటాయి. క్వార్టర్ ఫైనల్స్ తర్వాత సెమీఫైనల్స్ జరుగు తాయి. అక్టోబర్ 3న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో క్రికెట్ పోటీలు ముగుస్తాయి.





## ఆసియా క్రీడలు కబడ్డీ .. ఫైనల్స్‌కు
# భారత్ పురుషుల, మహిళల జట్లు

**నాగోయా:** ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు తమ తమ ఈవెంట్లలో విజయాలతో ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. నాగోయాలో శుక్రవారం జరిగిన మహిళల జట్టు నేపాల్‌పై 48-24 తేడాతో విజయం సాధించి ఫైనల్ పోరుకు దూసుకెళ్లగా, ఆ తర్వాత పురుషుల జట్టు ఇక్కడ జరిగిన సెమీఫైనల్ దశలో థాయ్‌లాండ్‌పై 66-28 తేడాతో గెలిచి వారితో చేరింది. మహిళల మ్యాచ్‌లో, భారత్ తొలి అర్ధభాగంలో 4 ఆల్‌అవుట్‌లు, 4 బోనస్ పాయింట్లతో సహా 31-17తో గణనీయమైన ఆధిక్యాన్ని నెలకొల్పింది. నేపాల్ భారత్‌కు గట్టి పోటీ ఇవ్వలేక రెండవ భాగంలో కేవలం 7 పాయింట్లు మాత్రమే అదనంగా సాధించగలిగింది. పురుషుల మ్యాచ్ కూడా ఇదే రీతిలో సాగింది. తొలి అర్ధభాగంలో భారత్ జట్టు 37-18 ఆధిక్యం సాధించి, తర్వాతి అర్ధభాగంలో కూడా అదే ఆధిపత్యాన్ని కొనసాగించారు. మ్యాచ్‌లో థాయిలాండ్ 5 బోనస్ పాయింట్లు సాధించగా, భారత్ 15 బోనస్ పాయింట్లు కైవసం చేసుకుని ఆధిక్యంలో నిలిచింది. 2010లో మహిళల కబడ్డీ తొలిసారిగా ఆసియా క్రీడల క్రీడగా మారగా, ఇప్పటివరకు జరిగిన ప్రతి ఎడిషన్‌లోనూ భారత్ ఆధిపత్యం చెలాయించింది. పురుషుల విభాగంలో కూడా భారత్ ప్రస్తుత ఛాంపియన్‌గా ఉంది.



## నాలుగురోజుల మ్యాచ్‌లో ఇండియా విజయం
### 162 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఓటమి

**పుదుచ్చేరి:** మొదటి నాలుగు రోజుల మ్యాచ్‌లో భాగంగా పుదుచ్చేరిలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఇండియా 162 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. విజయం కోసం 363 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ, 55/2 స్కోరుతో తమ రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఆస్ట్రేలియా భోజన విరామం తర్వాత కొద్దిసేపటికే 200 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ ములానీ 3 వికెట్లు పడగొట్టగా, మ్యాచ్ మొత్తంలో 124 పరుగులకు ఏడు వికెట్లతో తన ప్రదర్శనను ముగించాడు. ఆఖరి రోజు శుక్రవారం ఆట ఆరంభంలోనే మీడియం పేసర్ అన్షుల్ కంబోజ్ దెబ్బకొట్టాడు. తొలి గంటలోనే ఓవర్‌నైట్ బ్యాటర్లైన నాథన్ మెక్‌స్వీనీని (35), ఆస్ట్రేలియా కెప్టెన్ పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (16) అవుట్ చేశాడు. ఆ తర్వాత తుషార్ దేశ్‌పాండే వరుసగా జోష్ ఫిలిప్, లియామ్ స్కాట్‌లను అవుట్ చేయగా, ఆఫ్‌స్పిన్నర్ తనుష్ కోటియన్ జాసన్ సంఘాను బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియా 185/7తో కష్టాల్లో పడింది. ఫెర్గస్ ఓ నీల్ (47) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆ తర్వాత ములానీ బౌలింగ్‌లో డీప్ మిడ్ వికెట్‌లో క్యాచ్ ఇచ్చి ఇండియా విజయాన్ని ఖరారు చేశాడు. ఆస్ట్రేలియా 171 పరుగులు చేయగా, భారత్ 334 పరుగులకే ఆలౌట్ అయి తొలి ఇన్నింగ్స్‌లో 163 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సాయి సుదర్శన్ 39 పరుగులు, కెప్టెన్ దేవదత్ పడిక్కల్ 59 పరుగులు చేసి, ఆస్ట్రేలియా 363 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడంలో సహాయపడ్డారు. ఇండియా తమ చివరి ఆరు వికెట్లను 48 పరుగులకే కోల్పోయింది.

### ఆసియా క్రీడలు.. పురుషుల క్రికెట్..
# ప్రారంభ మ్యాచ్‌లో నేపాల్ గెలుపు
### 5 వికెట్ల తేడాతో అఫ్ఘానిస్థాన్ ఓటమి



**నిస్షిన్:** ఆసియా క్రీడల పురుషుల క్రికెట్ ఈవెంట్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై నేపాల్ విజయం సాధించింది. శుక్రవారం నిస్షిన్‌లో జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో నేపాల్ ఆఫ్ఘనిస్తాన్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించింది. ఆఫ్ఘనిస్తాన్‌పై 103 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, నేపాల్ 2 వికెట్లు మిగిలి ఉండగా లక్ష్యాన్ని చేరుకుంది. రోహిత్ పౌడెల్(33) నాటౌట్‌గా, సుందీప్ జోరా 34, కెప్టెన్ దీపేంద్ర సింగ్ ఐరీ 15 రన్స్ సాధించారు. కుశాల్ భుర్తెల్, లలిత్ రాజ్‌బన్షి కలిసి 7 వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్‌ను 102 పరుగులకే పరిమితం చేశారు. ఇద్దరు ఓపెనర్లు అవుటవడంతో నేపాల్ ఛేజింగ్ కష్టంగా ప్రారంభమైంది. ఫరీదూన్ దావూద్‌జాయ్, భుర్టెల్‌ను డకౌట్ చేయగా, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, ఆసిఫ్ షేక్‌ను రెండు పరుగులకే క్యాచ్ పట్టించాడు. ఆ తర్వాత ఏడవ ఓవర్‌లో కుశాల్ మల్లా రనౌట్ అవ్వడంతో, 6.3 ఓవర్ల తర్వాత నేపాల్ స్కోరు 31/3గా నిలిచింది. సందీప్, రోహిత్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టడంతో నేపాల్ లక్ష్యం వైపు సాగింది. సందీప్ ఒక ఫోర్, ఒక సిక్స్ కొట్టి రనౌట్ కాగా, రోహిత్ 3 ఫోర్లతో, దీపేంద్ర డబుల్స్‌తో ఛేజింగ్‌ను నిలబెట్టారు. 18వ ఓవర్‌లో దీపేంద్ర అవుటయినా, గుల్సన్ ఝా నేపాల్‌కు ఐదు వికెట్ల విజయాన్ని అందించాడు. అంతకుముందు, రాజ్‌బని కేవలం 13 పరుగులకే 3 వికెట్లు తీయగా, భుర్తెల్ 4 వికెట్లు పడగొట్టడంతో ఆఫ్ఘనిస్తాన్ ఇబ్బంది పడింది. ఆఫ్ఘనిస్తాన్ తరఫున ఫైసల్ షినోజాదా, నజీబుల్లా జద్రాన్ చెరో 30 పరుగులతో నిలవగా, నంగేయాలియా ఖరోటి 17 పరుగులు జోడించాడు. అయినప్పటికీ, జట్టు కేవలం 102 పరుగులు మాత్రమే చేయగలిగింది.







### ఆసియా క్రీడలు..
# గుల్వీర్‌కు రజతం
### బరానికా, మన్‌ప్రీత్‌లకు కాంస్యాలు

**నాగోయా:** ఆసియా క్రీడల్లో శుక్రవారం అథ్లెటిక్స్ విభాగాల్లో భారత్ సత్తా చాటింది. పురుషుల 10వేల మీటర్ల పరుగులో గుల్వీర్ సింగ్ రజతం గెలుచుకోగా, మహిళల పోల్ వాల్ట్‌లో బరానికా ఎలాంగోవన్ కాంస్యం సాధించి చరిత్ర సృష్టించింది. 28:27.51 సమయంతో స్వర్ణం గెలుచుకున్న బహ్రెయిన్‌కు చెందిన బిర్హాను బలేవ్ వెనుక, గుల్వీర్ 28:29.38 సమయంతో రెండవ స్థానంలో నిలిచాడు. అలాగే బరానికా 4.15 మీటర్ల ఎత్తును అధిగమించి కాంస్యం కైవసం చేసుకుని పోల్ వాల్ట్‌లో ఆసియా క్రీడల పతకం గెలిచిన మొదటి భారతీయ అథ్లెట్‌గా నిలిచింది. అంతకుముందు తన మొదటి ప్రయత్నాలలో 3.85 మీటర్లు మరియు 4 మీటర్ల ఎత్తులను అధిగమించింది. జాతీయ రికార్డు హోల్డర్ సింధుశ్రీ గణేష్‌కు తొలి ప్రయత్నంలోనే కష్టాలు ఎదురయ్యాయి. ఆమె 3.85 మీటర్లతో ప్రారంభించినప్పటికీ, మూడు ప్రయత్నాలలోనూ విఫలమైంది. మహిళల షాట్‌పుట్‌లో మన్‌ప్రీత్ తన నాలుగో ప్రయత్నంలో 17.17 మీటర్ల అత్యుత్తమ త్రోతో కాంస్యం గెలుచుకోగా, ఆమె సహచరి కృష్ణ జయశంకర్ 16.57 మీటర్లతో ఐదవ స్థానంలో నిలిచింది. అనిమేష్ కుజుర్ తన సెమీఫైనల్ హీట్‌లో 10.38 సెకన్లతో ఏడవ స్థానం, గురిందర్‌వీర్ సింగ్ 10.32 సెకన్లతో ఐదవ స్థానంతోను, మహిళల హెప్టాథ్లాన్‌లో పూజ 5,368 పాయింట్లతో ఆరవ, అనామిక 5,234 పాయింట్లతో ఎనిమిదవ స్థానంతో సరిపెట్టుకున్నారు.

## సమ్మెరోజుల్లో ఎటిఎం ఛార్జీలు రద్దు చేశాం
### కస్టమర్లకు ఎస్‌బిఐ సడలింపులు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలు పునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ కస్టమర్లకు వెసులుబాటు ఇచ్చింది. బ్యాంకుల సమ్మె జరగ నున్న మూడు రోజుల పాటు ఏటీఎం లావాదేవీలపై ఎలాంటి చార్జీలు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎస్‌బీఐ ప్రకటన విడుదల చేసింది. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మె కారణంగా వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఎస్‌బీఐ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. సమ్మె జరిగే ఈ మూడు రోజుల్లో ఎస్‌బీఐ కస్టమర్లు దేశంలోని ఏ బ్యాంకు ఏటీఎంలోనైనా ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు లేదా ఇతర లావాదేవీలు జరప వచ్చు. సమ్మె కాలంలో తమ బ్రాంచ్‌లు తెరిచే ఉంటాయని ఎస్‌బీఐ తెలిపినప్పటికీ, ఉద్యోగుల భాగస్వామ్యాన్ని బట్టి సేవలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. అందువల్ల, అత్యవసరమైన బ్రాంచ్ పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని ఖాతాదారులకు సూచించింది. నగదు అవసరాల కోసం ఏటీఎంలతో పాటు ఆటోమేటెడ్ డిపాజిట్ అండ్ విత్‌డ్రా యల్ మెషీన్లు (ఏడీడబ్ల్యూఎం) కూడా అందుబాటులో ఉంటాయని తెలియజేసింది. అదే సమయంలో డిజిటల్ లావాదేవీలకు ఎలాంటి ఆటంకం ఉండదని ఎస్‌బీఐ భరోసా ఇచ్చింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్టీజీఎస్ వంటి డిజిటల్ సేవలు యథావిధిగా పనిచేస్తాయని స్పష్టం చేసింది. సాధారణ చెల్లింపులు, నిధుల బదిలీకోసం ఈ సేవలను వినియో గించుకోవాలని కోరింది. దీంతో పాటు కస్టమర్ సర్వీస్‌పాయింట్లు కూడా కొన్ని రకాల సేవలను అందిస్తాయని వివరించింది. ఖాతాదారులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని తమ ఆర్థిక కార్యకలాపాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని ఎస్‌బీఐ విజ్ఞప్తి చేసింది.

## అప్పర్ సర్క్యూట్‌కు చేరిన హీరో మోటార్స్




**ముంబయి, సెప్టెంబరు 25:** స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టిన మూడు రోజుల్లోనే హీరో మోటార్స్ షేర్ భారీ లాభాలను అందుకుంది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఈ షేర్ 20శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్ఈలో రూ. 141.85 వద్ద సరికొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6,443.05 కోట్లకు చేరింది. హీరో మోటార్స్ షేర్లు ఈనెల 23న దలాల్ స్ట్రీట్‌లో లిస్టయ్యాయి. ఐపీఓ ఇష్యూ ధర రూ.84 కాగా ఎన్ఎస్ఈలో రూ.82 వద్ద లిస్టయ్యాయి. అంటే 2.38 శాతం డిస్కౌంట్‌తో మార్కెట్‌లోకి వచ్చాయి. బీఎస్ఈలో రూ.82.10 వద్ద లిస్టయ్యాయి. అయితే లిస్టింగ్ తర్వాత షేర్‌కు కొనుగోళ్ల మద్దతు పెరిగింది. దీంతో లిస్టింగ్ ధరతో పోలిస్తే ఇప్పటివరకు దాదాపు 73 శాతం పెరిగింది. అమెరికా, యూరప్, భారత్, ఆసియాన్ దేశాల్లోని ఆటో మొబైల్ కంపెనీలకు అవసరమైన పవర్‌ట్రెయిన్ సొల్యూషన్స్‌ను హీరో మోటార్స్ అందిస్తోంది. కంపెనీ ఐపీఓ సెప్టెంబర్ 16 నుంచి 18 వరకు జరిగింది. మొత్తం 6.66 రెట్లు సబ్‌స్క్రిప్షన్ వచ్చింది. ఐపీవో ద్వారా కంపెనీ రూ.1,000 కోట్లు సమీకరించింది. ఇందులో రూ.600 కోట్ల విలువైన 7.14 కోట్ల తాజా షేర్లను జారీ చేసింది. మరో రూ.400 కోట్ల విలువైన 4.76 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద ఉంచింది. గత ఏడాది కంపెనీ ఆదాయం 5.7 శాతం, ఎబిడిటా 34.3 శాతం, నికర లాభం 55.5 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది.

# సెన్సెక్స్, నిఫ్టీల్లో కొనుగోళ్ల ర్యాలీ..లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




**ముంబయి, సెప్టెంబరు 25:** వారాంతంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు భారీ పతనం తర్వాత ఒక్కసారిగా కొనుగోళ్లతో లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం, రూపాయి బలపడటం పెట్టుబడిదారుల సెంటిమెంట్‌కు ఊతమిచ్చాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు కోలుకోగా, ఐటీ మరియు హెల్త్‌కేర్ షేర్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 315.20 పాయింట్లు పెరిగి 73,895.74 వద్ద ముగియగా, నిఫ్టీ50 సూచీ 77.40 పాయింట్లు లాభపడి 23,140.50 వద్ద స్థిరపడింది. గత ట్రేడింగ్ సెషన్‌లో నిఫ్టీ 1.64 శాతం క్షీణించింది. యాక్సిస్ బ్యాంక్ 3.03 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 1.75 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.92 శాతం లాభపడి నిఫ్టీకి ప్రధానంగా మద్దతునిచ్చాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.25 శాతం తగ్గితే, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.01 శాతం స్వల్పంగా క్షీణించింది. బీఎస్ఈలో మొత్తం 2,257 షేర్లు లాభపడగా, 2,079 షేర్లు నష్టపోయాయి. మరో 254 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్‌లో నవంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 1.10 డాలర్లు (1.03 ) తగ్గి 105.50 డాలర్లకు చేరింది. భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రిటర్నులు 7.111 శాతం నుంచి 7.100 శాతానికి తగ్గింది. విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. పాక్షికంగా మార్పిడి చేయగల రూపాయి విలువ గత ముగింపు 95.9925తో పోలిస్తే 95.8050 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధర 0.77 శాతం పెరిగి రూ.1,51,878 వద్ద నమోదైంది. పెర్ల్ గ్లోబల్ ఇండస్ట్రీస్ షేరు 3.56 శాతం లాభపడింది. పీవీపీ వెంచర్స్ షేరు 5 శాతం లోయర్ సర్క్యూట్‌ను తాకింది. ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ షేరు కూడా 5 శాతం లోయర్ సర్క్యూట్‌లో ముగిసింది. వాస్కాన్ ఇంజినీర్స్ షేరు 4.48 శాతం పెరిగింది. ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా షేరు 6.31 శాతం ఎగిసింది. బ్లూ క్లౌడ్ సాఫ్‌టెక్ సొల్యూషన్స్ షేరు 11.62 శాతం భారీగా ర్యాలీ చేసింది. వెల్‌స్పన్ కార్ప్ షేరు 4.91 శాతం లాభపడింది.

# జిఎస్టీకౌన్సిల్‌లో శ్లాబుల్లో మార్పులుండవ్




**ముంబయి, సెప్టెంబరు 25:** వచ్చేనెల ఏడోతేదీ జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ప్రధాన జీఎస్టీ పన్ను రేట్లలో పెద్ద ఎత్తున మార్పులు ఉండే అవకాశం కనిపించడం లేదు. ఈ సమావేశంలో కొత్తగా రేట్ల మార్పుల కంటే, ఇప్పటికే అమల్లోకి తీసుకొచ్చిన రేట్ల హేతుబద్ధీకరణ (రేట్ రేషనలైజేషన్) అమలు పరిస్థితిని సమీక్షించడం, అలాగే "ప్రాసెస్ రిఫార్మ్స్"పై ప్రధానంగా దృష్టి సారించే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాదిలో అమలు చేసిన జీఎస్టీ రేట్ల మార్పులు ఎలా అమలవుతున్నాయనే అంశాన్ని కౌన్సిల్ సమీక్షించనుంది. అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడం, రేట్ల హేతుబద్ధీకరణ ప్రభావాన్ని అంచనా వేయడంపైనే ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే అక్టోబర్ 7 సమావేశం "జీఎస్టీ 2.0"లో భాగమైన ప్రక్రియల సంస్కరణలపై దృష్టి పెడుతుందని తెలిపారు. ఇందులో ఈఇన్వాయిస్, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) నిబంధనల వంటి అంశాలు కీలకంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. గత జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రేట్ల హేతుబద్ధీకరణపై నిర్ణయాలు తీసుకోగా, సంస్కరణలను అక్టోబర్ సమావేశానికి వాయిదా వేశారు. దీంతో ఈ సమావేశంలో మరోసారి జీఎస్టీ రేట్లలో పెద్ద ఎత్తున మార్పులు ఉంటాయనే అంచనాలు తగ్గే అవకాశం ఉంది. గత ఏడాది అమలు చేసిన రేట్ల హేతుబద్ధీకరణ ఫలితాలను సమీక్షించిన అనంతరం అవసరమైతే భవిష్యత్తులో మరిన్ని మార్పులపై కౌన్సిల్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# హెచ్‌డిఎఫ్‌సి ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్లు
## ఉద్యోగులకు 18,97,180 ఈక్విటీ షేర్లు కేటాయింపు



**ముంబయి, సెప్టెంబరు 25:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ఉద్యోగుల స్టాక్ ఆప్షన్ పథకాలు కింద ఆప్షన్లు/ఆర్ఎస్‌యూలు వినియోగించుకున్న ఉద్యోగులకు మొత్తం 18,97,180 ఈక్విటీ షేర్లను కేటాయించినట్లు శుక్రవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ఈ కేటాయింపుతో బ్యాంక్ చెల్లింపుచేసిన మూలధనం 15,41,67,00,168 ఈక్విటీ షేర్ల నుంచి 15,41,85,97,348 ఈక్విటీ షేర్లకు పెరిగింది. ఒక్కో షేరు ముఖ విలువ రూ.1గా ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఇటీవలి కాలంలో మిశ్రమ ప్రదర్శన కనబరిచింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో షేరు ధర సుమారు 0.5 తగ్గింది. గత నెలలో 0.9 లాభపడింది. గత ఆరు నెలల్లో సుమారు 6 క్షీణించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 25.98 పడిపోయింది. గత ఏడాదిలో 22.7 తగ్గింది. గత ఐదేళ్లలో మొత్తం 8 మేర నష్టపోయింది.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2026 అక్టోబర్ 17, శనివారం రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించనుంది. సెప్టెంబర్ 30, 2026తో ముగిసిన త్రైమాసికం మరియు అర్ధవార్షిక నివేదికలు వెలువరిస్తుంది. ఆర్థిక ఫలితాలను ఆమోదించేందుకు అదే రోజు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సమావేశం నిర్వహించనుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సెక్యూ రిటీల ట్రేడింగ్ విండో ఈనెల 24 నుంచి అక్టోబర్ 19, 2026 వరకు మూసివేసింది. తొలి త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 5పెరిగి రూ.19,059 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.18,155 కోట్లు.నికర వడ్డీ ఆదాయం 6.7 పెరిగి రూ.33,534కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ. 31,438కోట్లు. ప్రొవిజన్లు రూ.3,060 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇవి రూ. 14,441 కోట్లు ఉండగా, ఈసారి గణనీయంగా తగ్గాయి.వరుస త్రైమా సిక ప్రాతిపదికన బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.15 నుంచి 1.17 కు పెరిగింది. నికర ఎన్‌పీఏ 0.38 నుంచి 0.41 కు పెరిగింది. ఇక ప్రొవిజన్లు గత త్రైమాసికంలోని రూ.2,610 కోట్లతో పోలిస్తే, తొలి మూడునెలల్లో రూ.3,060కోట్లకు పెరిగాయి.

## ఎండిఆర్ ఛార్జీలు పన్ను, సెస్, సర్‌ఛార్జీ లేమీ కాదు
### ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



**ముంబయి, సెప్టెంబరు 25:** యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీలు విధించనున్నారనే ప్రచారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. ఈ అంశంతో సాధారణ ఖాతాదారులు లేదా వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి జేబుపై ఎలాంటి అదనపు భారం పడదని తెలిపారు. రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట డిజిటల్ లావాదేవీలకు ఎండీఆర్ వర్తించినా, అది వినియోగదారులకు కాదని, వ్యాపారులకే పరిమితమని మంత్రి చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు. ఎండీఆర్ అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు వంటి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల కోసం ఈ రుసుము ఉంటుందని వివరించారు. ఎండీఆర్ నిబంధనలపై అవగాహన లోపం వల్లే అనవసర అపోహలు వ్యాపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపుల్లో వ్యాపారులు ఇలాంటి రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. యూపీఐ చెల్లింపుల విషయంలోనూ ఈ చార్జీని కస్టమర్లపైకి నెట్టే అవకాశం ఉండదని మంత్రి తేల్చిచెప్పారు. డిజిటల్ చెల్లింపులను ఉపయోగించే ప్రజలకు సేవలు ఉచితంగానే, ఎప్పటిలాగే అంతరాయం లేకుండా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళానికి గురికావొద్దని సూచించిన ఆమె, ఎండీఆర్ ద్వారా వసూలయ్యే సొమ్ము డిజిటల్ పేమెంట్ నెట్‌వర్క్ నిర్వహణలో భాగస్వామ్యమైన బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థల వ్యవస్థాపక వ్యయాలకే ఉపయోగపడుతుందని వివరించారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-195/6, Kanteshwar, Nizamabad-503001, RNI No. 64862/96, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.